www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

'సోషల్'పై అమెరికా డేగ కన్ను!

- గత ఐదేళ్లలో వినియోగించిన అన్ని ఖాతాల ఐడీల వివరాలు వెల్లడించాలి
- లేదంటే వీసా దరఖాస్తు తిరస్కరణ!
- భవిష్యత్తులో అనర్హత ప్రమాదం కూడా..
- భారత్‌లోని అమెరికా ఎంబసీ ప్రకటన

2

శుక్రవారం | 27-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 89 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్ల పక్షం; తిథి: విదియ ఉ.11:20 తదుపరి తదియ; నక్షత్రం: పునర్వసు ఉ.7:22 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ.3:06-4:39; దుర్ముహూర్తం: ఉ.8:23-9:15, మ.12:44-1:36; అమృతఘడియలు: రా.12:24-1:57; రాహుకాలం: ఉ.10:30-12:00; సూర్యోదయం: 5:47; సూర్యాస్తమయం: 6:49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


రైలు పట్టాలపై కారు

రైలు పట్టాలపై కారు

- ఆత్మహత్యాయత్నంలో భాగంగా యూపీ మహిళ హల్‌చల్
- పట్టాలపై 7 కి.మీ.లు ప్రయాణం
- రంగారెడ్డి జిల్లాలో ఘటన
- అతికష్టం మీద ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పలు రైళ్లకు అంతరాయం

3


పోలీసుల అదుపులో ఓమికా సోని

కీచక టీచర్‌కు 17 ఏళ్ల జైలు శిక్ష

- పోక్సో కేసులో పెద్దపల్లి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు
- పదో తరగతి చదివే సమయంలో విద్యార్థినిపై ఉపాధ్యాయుడు సాతూరి మధుకర్ అత్యాచారం
- ఆమె డిగ్రీ చదివే వరకు కొనసాగిన ఆగడాలు
- లైంగిక దాడి వీడియోలు తీసి యువతికి బెదిరింపులు
- ఆమెకు వివాహమైన తర్వాత కూడా ఆగని వేధింపులు
- వీడియోలు యువతి భర్తకు పంపడంతో విడాకులు


కాల్వశ్రీరాంపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినిని లోబర్చుకుని శారీరక వాంఛ తీర్చుకోవడమే కాక.. తన దుశ్చర్యను వీడియోలు తీసి వాటితో ఆమెను ఏళ్ల తరబడి వేధించి.. ఆమె వివాహ జీవితం ముక్కలవ్వడానికి కారణమైన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడికి న్యాయస్థానం కఠిన శిక్ష విధించింది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్

మిగతా 14వ పేజీలో...

మంజీరా బ్యారేజీ పిల్లర్లకు పగుళ్లు

- డేంజర్‌లో జంట నగరాలకు తాగునీరు అందించే డ్యామ్
- మేడిగడ్డ తరహాలో మంజీరా దిగువ భాగంలో కొట్టుకుపోయిన ఆప్రాన్.. బ్యారేజీకి పొంచి ఉన్న ముప్పు
- మరమ్మతులు లేక దెబ్బతిన్న గేట్లు.. బలహీనపడ్డ కట్టలు
- పూర్తిస్థాయిలో నీటి నిల్వ శ్రేయస్కరం కాదు
- ఎన్డీఎస్‌వో నిపుణుల బృందం నివేదిక

11


మాదకద్రవ్యాల వినియోగం వ్యతిరేక సదస్సులో పాటల సీడీ విడుదల చేస్తున్న సీఎం రేవంత్, మంత్రి లక్ష్మణ్, నటులు రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ

డ్రగ్స్ కట్టడికి ఈగల్

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇకపై ఈగల్.. ఎక్కడ గంజాయి పండించినా గద్దలా పట్టేస్తాం

- స్కూల్లో డ్రగ్స్ దొరికితే యాజమాన్యంపైనా కేసు.. పాఠశాలల్లో మానసిక నిపుణుల్ని నియమించాలి
- పాత్రలు కాదు... హీరోల కష్టం ఆదర్శం కావాలి.. క్రీడల్లో రాణించే వారికి రాజకీయాల్లో స్పెషల్ కోటా
- డ్రగ్స్ వ్యతిరేక సదస్సులో సీఎం రేవంత్.. డ్రగ్స్ తీసుకుంటే సినీ ఇండస్ట్రీ నుంచి బహిష్కరణ: దిల్ రాజు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు రాష్ట్ర సరిహద్దులు దాటి లోనికి రాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మకాలకు పాల్పడుతున్న వారిని పట్టుకునేందుకు అవసరమైతే రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లాలని పోలీసులకు చెప్పామన్నారు. కిరాణా దుకాణాల్లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ కట్టడి బాధ్యతలు నిర్వర్తిస్తున్న తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్)ను ఇక నుంచి ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)గా మారుస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. విద్యాసంస్థల్లో ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తూ, విక్రయిస్తూ పట్టుబడితే యాజమాన్యాల పైన కూడా కేసులు పెడతామని హెచ్చరించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా శిల్పకళా వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి వచ్చిన వందల మంది విద్యార్థుల్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమ

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్ అభివృద్ధిలో 'హెచ్-సిటీ' కీలకం!

- బడ్జెట్‌లో 10వేల కోట్లు కేటాయించాం
- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు
- రూ.45 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన
- జూలై 10న క్యాబినెట్ భేటీ

13

ఐఎస్‌ఎస్‌లోకి శుభాన్షు

ఆ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా చరిత్ర

- ఐఎస్ఎస్‌తో అనుసంధానమైన గ్రేస్
- కొత్తగా వచ్చిన నలుగురికి స్వాగతం పలికిన ఏడుగురు వ్యోమగాములు
- త్రివర్ణ పతాకంతోపాటు మీ ప్రేమ కూడా నాతో ఉంది
- అంతరిక్షం నుంచి భూమి అద్భుతం
- భారరహిత స్థితిలో అంతా కొత్తగానే..
- శిశువులా నేర్చుకుంటున్నా
- వీడియో లింక్ ద్వారా శుభాన్షు శుక్లా


అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సహచర వ్యోమగాములతో శుభాన్షు శుక్లా (వృత్తంలో)

న్యూఢిల్లీ, జూన్ 26: భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు గురువారం సాయంత్రం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోకి ప్రవేశించారు. వారికి ఐఎస్ఎస్‌లోని ఏడుగురు వ్యోమగాములు సాదరంగా స్వాగతం పలికారు. అంతరిక్షం నుంచి భూమిని చూసే అరుదైన అవకాశం తనకు లభించటంపై శుభాన్షు హర్షం వ్యక్తం చేశారు. తాను ఊహించుకున్న దానికన్నా గొప్పగా ఉందన్నారు. బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి బయల్దేరిన గ్రేస్.. 28 గంటల అనంతరం గురువారం సాయంత్రం 4.01 గంటలకు ఐఎస్ఎస్‌ను చేరుకుంది. ఆ తర్వాత ఐఎస్ఎస్‌తో 12 జతల హుక్స్ ద్వారా అనుసంధానమయ్యే ప్రక్రియ మొదలైంది. ఐఎస్ఎస్‌కు గ్రేస్‌కు మధ్య సమాచార, విద్యుత్ లింకులు

మిగతా 2వ పేజీలో...


12వ నంబర్ గేటు వద్ద తెగిపోయి వేలాడుతున్న రోప్

జూరాలలో తెగిన గేట్ల రోప్‌లు!

- 9, 12వ నంబర్ గేట్ల వద్ద ఘటన
- రోప్‌లు వేలాడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్
- రెండు నెలలుగా గేట్ల మరమ్మతులు
- వరదలతో పనులకు అంతరాయం
- ఈ క్రమంలోనే ఘటన జరిగినట్లు అనుమానాలు
- రోప్‌లు తెగిపోలేదు.. ప్రమాదం లేదు
- పనులు ఇంకా కొనసాగుతున్నాయి
- జూరాల ఎస్‌ఈ వెల్లడి


గద్వాల/ధరూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వరద వస్తున్న వేళ జూరాల ప్రాజెక్టులో రెండు గేట్లకు సంబంధించిన రోప్‌లు తెగిపోయాయి. 9వ, 12వ నంబర్ గేట్లకు సంబంధించిన రోప్‌లు తెగి, వేలాడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒక వైపు గేట్లకు మరమ్మతులు జరుగుతుండగానే.. ఈ ఘటన చోటు చేసుకోవడం కలకలం రేపింది. అయితే, ఇదంతా ప్రచారమేనని, ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం లేదని జూరాల ఎస్‌ఈ వివరణ ఇచ్చారు. జూరాల ప్రాజెక్టులో మొత్తం 62 గేట్లు ఉన్నాయి. రబ్బరు సీల్స్

మిగతా 11వ పేజీలో...

'హనీమూన్ మర్డర్'లా దొరికిపోవొద్దు!

- మేఘాలయాలో నిందితుల్లా కాకుండా మనం పక్కాగా పని పూర్తిచేయాలి
- హత్య చేశాక హనీమూన్‌కు లద్దాఖ్
- తేజేశ్వర్ హత్యకు ముందు ఐశ్వర్య, తిరుమలరావు ప్రణాళిక
- గద్వాల హత్య కేసు ఛేదించిన పోలీసులు
- ఎనిమిది మంది నిందితుల అరెస్టు

14



దోమ సైజులో గూఢచారి డ్రోన్!

- చేతి గోరు కంటే చిన్నగా తయారీ
- సైన్యం కోసం చైనా శాస్త్రవేత్తల సృష్టి
- పాస్‌వర్డ్‌లు, సున్నిత డేటాకు ముప్పు
- రక్షణ రంగ నిపుణుల ఆందోళన

2

ఏపీ అమరావతిలో టవర్లకు రైట్ రైట్..

13

- ఎల్-1 బిడ్డర్లకు ఎల్‌వోఏల అందజేత
- 3,673 కోట్లతో పనులు అప్పగింత
- మౌలిక వసతులకు రూ.1,052 కోట్లు




ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు ఆంధ్రజ్యోతి ఎండీ వాంగ్మూలం

- సిట్ ఆఫీసులో ఉదయం 11కు హాజరు
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికీ పిలుపు
- అక్రమ ఫోన్ ట్యాపింగ్‌లో బాధితులెందరో!
- ఎస్ఐబీ సీడీఆర్‌లో 615 ఫోన్ నంబర్లు
- సీడీఆర్ ఆధారంగా వాంగ్మూలాల నమోదు
- పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించడానికి సిట్ ప్రయత్నం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణకు సిట్ అధికారులు గురువారం నోటీసు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని కోరారు. ఎస్ఐబీ వద్ద ఉన్న కాల్ డిటైల్ రికార్డ్స్(సీడీఆర్)లో తన ఫోన్ నంబర్ కూడా ఉండటంతో కేసు విచారణలో

మిగతా 3వ పేజీలో...



భాష ఈ దేశపు ఆత్మ

- వ్యతిరేకించే మాధ్యమం మాత్రమే కాదు
- హిందీకి ఏ భాషతోనూ శత్రుత్వం లేదు
- స్థానిక భాషల్లో మెడికల్, ఇంజనీరింగ్ కోర్సుల బోధనకు సిద్ధం కండి
- రాష్ట్ర ప్రభుత్వాలకు అమిత్‌షా సూచన

2

మెడికల్ రీయింబర్స్ బిల్లులకు ఆమోదం

- ఒకేసారి రూ.180 కోట్లు విడుదల చేసిన డిప్యూటీ సీఎం
- రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటికీ మోక్షం

13

టీజీపీజీఈసెట్ ఫలితాలు విడుదల

14



ఆచితూచి మాట్లాడండి!

- రాష్ట్ర పార్టీతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లండి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఖర్గే హితవు
- ఢిల్లీలో పార్టీ జాతీయాధ్యక్షుడితో గంటపాటు మంత్రి భేటీ

13

న్యూయార్క్ మేయర్ పోటీలో జోహ్రాన్ మమ్దానీ

- డెమొక్రాట్ పార్టీ అభ్యర్థిగా ఎంపిక
- ప్రఖ్యాత బాలీవుడ్ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడు
- తండ్రి గుజరాతీ మూలాలున్న ఉగాండా ముస్లిం
- జోహ్రాన్ కమ్యూనిస్టు పిచ్చివాడంటూ ట్రంప్ విమర్శలు

2





భూ సమస్యల పరిష్కారానికి ఫీజు చెల్లించాల్సిందే!

- ఇప్పుడు దరఖాస్తు పెడితే రుసుము తప్పనిసరి
- రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన వాటికే ఉచితం
- రైతులకు తేల్చిచెబుతున్న రెవెన్యూ అధికారులు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ముగిశాయి. అయితే, ఆ సదస్సుల్లో తమ సమస్యలు చెప్పుకోలేని వారు ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సదస్సు జరిగినప్పుడు తాము ఊళ్లో లేమని, ఆస్పత్రుల్లో ఉన్నామని ఇలా రకరకాల కారణాలతో రైతులు తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి తమ దరఖాస్తులను అందజేస్తున్నారు. ఇలాంటి దరఖాస్తులకు ఉచిత పరిష్కారం ఉండదని, భూభారతి చట్టం నిబంధనల ప్రకారం ఆయా సేవలకు నిర్దేశించిన ఫీజు చెల్లిస్తేనే దరఖాస్తులను ఆమోదిస్తామని తహసీల్దార్లు చెబుతున్నారు. గతంలో ఉచితమని చెప్పి, ఇప్పుడు ఎందుకు డబ్బులు అడుగుతున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులకు మాత్రమే ఫీజు మినహాయింపు ఇస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం(సీసీఎల్ఏ) తహసీల్దార్లకు లాగిన్ ఇచ్చింది. దీంతో సదస్సులు ముగిశాక వచ్చే దరఖాస్తులను ఈ లాగిన్ ద్వారా నమోదు చేయలేమని అధికారులు చెబుతున్నారు. మూడు విడతల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో భారీగా దరఖాస్తులు

మిగతా 11వ పేజీలో...

రాజ్యాంగమే 'సుప్రీం'

- బుల్డోజర్ న్యాయం పనిచేయదు
- సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు



అమరావతి (మహారాష్ట్ర), జూన్ 26: దేశంలో రాజ్యాంగమే సర్వోన్నతమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలైన న్యాయ, కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలు దాని కిందే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తన జన్మస్థానమైన అమరావతిలో బుధవారం జరిగిన సన్మానసభలో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగమే సర్వోన్నతం అంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన 'మౌలిక స్వరూపం' తీర్పును ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని సవరించే అధికారం మాత్రమే పార్లమెంటుకు ఉందని, పూర్తిగా మార్చివేసే అధికారంలేదని ఆ తీర్పు ద్వారా స్పష్టం చేసిందని పేర్కొన్నారు. పార్లమెంటే సుప్రీం అని కొందరు అంటున్నారని, కానీ తన ఉద్దేశంలో రాజ్యాంగమే సుప్రీం అని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు ఇచ్చినంత మాత్రాన జడ్జి స్వతంత్రంగా వ్యవహరిస్తున్నట్టు కాదన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను కాపాడేలా తాను తీర్పులు ఇచ్చినట్టు జస్టిస్ గవాయ్ చెప్పారు. బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. నివాస హక్కు సుప్రీం అని, దానిని బుల్డోజర్‌లతో అడ్డుకోలేరని తెలిపారు.

భాష ఈ దేశపు ఆత్మ

- హిందీకి ఏ భాషతోనూ శత్రుత్వం లేదు: అమిత్‌షా



న్యూఢిల్లీ, జూన్ 26: భాష కేవలం వ్యక్తీకరణ మాధ్యమంకాదని, అది దేశపు ఆత్మ అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. భారతీయ భాషలతో హిందీకి మిత్రత్వం ఉన్నదని, అన్ని భాషలూ మిళితమైతేనే దేశ ఆత్మగౌరవాన్ని నిలపడంలో గొప్ప పాత్ర పోషించగలవన్నారు. ఢిల్లీలో అధికార భాషా విభాగం ఏర్పడి యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో గురువారం అమిత్‌షా పాల్గొన్నారు. భాషల సాయం లేకుండా చరిత్ర, సంస్కృతి ప్రాచుర్యం పొందలేవన్నారు. భారతీయ భాషల ఉన్నతి, అధికార భాష అభివృద్ధికి రానున్నకాలంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నట్టు అమిత్‌షా తెలిపారు. కేంద్రం, రాష్ట్రాల్లో పాలనా వ్యవహారాలన్నీ భారతీయ భాషల్లోనే సాగుతున్నాయన్నారు. భాషల మధ్య వైషమ్యంలేదని, విదేశీ భాషలు సహా ఏ భాషకూ హిందీ శత్రువుకాదని పేర్కొన్నారు. మన ఆలోచనల్లో, సంభాషణల్లో మన భాషలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. స్థానిక భాషల్లో మెడికల్, ఇంజనీరింగ్ కోర్సులను బోధించేలా ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్రాలను కోరారు. యువతకు భారతీయ భాషలను చేరువ చేసే పనిని రానున్నకాలంలో అధికార భాషా విభాగం చేపడుతుందని షా తెలిపారు.

ఆకాశంలోనే విమాన ఇంజన్‌లో మంటలు

- 159 మంది సురక్షితం.. అమెరికాలో ఘటన

లాస్ వేగాస్, జూన్ 26: ఆకాశంలో ఉండగా ఓ అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఇంజన్‌లో మంటలు వ్యాపించడంతో దాన్ని అత్యవసరంగా కిందికి దించివేయాల్సి వచ్చింది. లాస్ వేగాస్‌లోని హ్యారీ రీడ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బుధవారం ఉదయం 8.15 గంటలకు ఆ విమానం 153 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది మొత్తం 159 మందితో బయలుదేరింది. కాసేపటికే కుడి ఇంజన్‌లో సమస్యలు తలెత్తి మంటలు వ్యాపించినట్టు గుర్తించి దాన్ని వెనక్కి మళ్లించి ఐదు నిమిషాల్లోనే అత్యవసరంగా కిందికి దించారు. సిబ్బంది అత్యంత నైపుణ్యాన్ని ప్రదర్శించి విమానాన్ని సురక్షితంగా కిందికి దింపడంతో ప్రయాణికులు ఎవరికెలాంటి నష్టం జరగలేదు. ఉత్తర కరోలినాలోని చార్లొటే డగ్లస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్తుండగా మెకానికల్ సమస్య తలెత్తడంతో ఈ అగ్ని ప్రమాదం జరిగిందని ఆ విమానయానసంస్థ తెలిపింది.

ఎస్‌సీవో ప్రకటనపై సంతకానికి రాజ్‌నాథ్ నో

- పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంతో నిరాకరణ

క్వింగ్డావో, జూన్ 26: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సంయుక్త ప్రకటనపై సంతకం చేయడానికి భారత్ గురువారం నిరాకరించింది. అందులో పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంతో పాటు సీమాంతర ఉగ్రవాదంపై భారత్ కఠిన వైఖరిని స్పష్టంగా పేర్కొనకపోవడంతో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ దానిపై సంతకం చేయలేదు. ఈ నేపథ్యంలో ఎస్‌సీవో రక్షణ మంత్రుల సమావేశం ఉమ్మడి ప్రకటన లేకుండానే ముగిసింది. అంతకుముందు చైనాలోని కింగ్డావోలో నిర్వహించిన ఎస్‌ఈవో సమావేశంలో రాజ్‌నాథ్ ప్రసంగిస్తూ పాక్ వైఖరిని పరోక్షంగా దుయ్యబట్టారు. కొన్ని దేశాలు సరిహద్దు ఉగ్రవాదాన్ని విధాన సాధనంగా ఉపయోగించుకుంటూ, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలకు చోటుండకూడదని, అలాంటి దేశాలను విమర్శించడానికి ఎస్‌ఈవో వెనుకాడకూడదన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవారు దాని పరిణామాలను ఎదుర్కోక తప్పదని రాజ్‌నాథ్ హెచ్చరించారు. కాగా, 2020లో గల్వాన్ లోయలో ఘర్షణల అనంతరం భారత రక్షణ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి. కాగా, ఉగ్రవాదంపై ఏకాభిప్రాయం సాధించడంలో ఎస్‌సీవో రక్షణ మంత్రుల సమావేశం విఫలమైందని విదేశాంగ శాఖ పేర్కొంది.

టూవీలర్లకు టోల్ చార్జీల యోచన లేదు : గడ్కరీ

న్యూఢిల్లీ, జూన్ 26: దేశంలోని జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు టోల్ టాక్స్ విధించే ప్రతిపాదనేమీలేదని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం స్పష్టం చేశారు. టూవీలర్ వాహనాలకు టోల్ మినహాయింపు కొనసాగుతుందన్నారు. వచ్చే నెల 15 నుంచి హైవేలపై టూవీలర్లకు టోల్ చార్జీలను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టుగా మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో కేంద్ర మంత్రి స్పందించారు. టూవీలర్లపై టోల్ టాక్స్ విధిస్తారంటూ కొన్ని మీడియా సంస్థలు తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేస్తున్నాయని, ఇది సరికాదన్నారు. కాగా టూవీలర్లకు టోల్ చార్జీలు విధించే యోచన ప్రభుత్వ పరిశీలనలో లేదని ఎన్‌హెచ్‌ఏఐ కూడా స్పష్టంచేసింది.

సెప్టెంబరులో ప్రపంచ అయ్యప్ప భక్తులతో సభ

పతనంతిట్ట, జూన్ 26: శబరిమల చరిత్రలోనే తొలిసారి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప భక్తులతో పంపాబేస్ వద్ద సెప్టెంబరులో సభను ఏర్పాటు చేయనున్నట్లు కేరళ మంత్రి వీఎన్ వాసవన్ ప్రకటించారు. ఓనం వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, రాబోయే మండల, మకరవిళక్కు సీజన్ సందర్భంగా అయ్యప్ప భక్తులకు కావాల్సిన ఏర్పాట్లపై సమీక్షిస్తామన్నారు. గురువారం ఆయన శబరిమలపై ఉన్నతాధికారులతో సమీక్ష తర్వాత మీడియాతో మాట్లాడుతూ సీఎం పినరయి విజయన్‌తోపాటు ప్రముఖులు ఈ సభలో పాల్గొంటారని వివరించారు.

సోషల్ మీడియా ఖాతాలపై అమెరికా డేగ కన్ను!

- గత ఐదేళ్లలో వినియోగించిన ఖాతాల ఐడీల వివరాలివ్వాలి
- లేదంటే వీసా దరఖాస్తు తిరస్కరణ.. అమెరికా ఎంబసీ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 26: వీసా దరఖాస్తుదారులకు అమెరికా కీలక సూచనలు చేసింది. ఇకనుంచి తమ దేశ వీసాకు దరఖాస్తు చేసే వారందరూ గత ఐదేళ్లలో వినియోగించిన అన్ని సోషల్ మీడియా ఖాతా ల యూజర్ నేమ్‌లు లేదా హ్యాండిల్స్ వివరాలను డీఎస్-160 ఫామ్‌లో వెల్లడించాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనను విస్మరిస్తే.. అప్లికేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశంతో పాటు భవిష్యత్తులో వీసా పొందేందుకు అనర్హులవుతారని హెచ్చరించింది. తమ జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం గురువారం 'ఎక్స్'లో వెల్లడించింది. దరఖాస్తులో సమర్పించిన వివరాలు సరైనవేనని అభ్యర్థులు సంతకం చేసి, సమర్పించేముందు ధ్రువీకరించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ వివరాలను వీసా స్క్రీనింగ్, సోషల్ మీడియా ఖాతాల పరిశీలనలో ఉపయోగించుకుంటామని తెలిపింది.

దోమ సైజులో గూఢచారి డ్రోన్..!

- చేతి గోరు కంటే చిన్నగా తయారీ
- సైనిక అవసరాల కోసం చైనా అద్భుత సృష్టి



న్యూఢిల్లీ, జూన్ 26: ఈ రోజుల్లో డ్రోన్ల వినియోగం బాగా పెరిగిపోయింది. ముఖ్యంగా సైనిక కార్యకలాపాల కోసం అనేక దేశాలు డ్రోన్లను విరివిగా వాడుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో డ్రాగన్ దేశం చైనా సరికొత్త విప్లవానికి తెరతీస్తూ.. దోమ సైజులో ఉండే అతిచిన్న గూఢచారి డ్రోన్‌ను ఆవిష్కరించింది. చైనా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ (ఎన్‌యూడీటీ) అభివృద్ధి చేసిన ఈ సూక్ష్మ డ్రోన్‌ను.. సైనిక కార్యకలాపాలు, రహస్య మిషన్లు, నిఘా అవసరాలకు ఉపయోగించనున్నారు. 0.6 సెంటీమీటర్లతో చిన్న కీటకం సైజులో ఉండే దీన్ని ఇటీవల చైనా అధికారిక మిలటరీ చానెల్ సీసీటీవీ 7లో ప్రదర్శించారు. నల్లటి కర్ర లాంటి శరీరం, ఆకుల ఆకారంలో ఉండే రెక్కలు, తీగల్లాంటి కాళ్లతో ఇది చూడటానికి దోమలా ఉంటుంది. ఇది సూక్ష్మ జీవిలా కనిపించినా.. దీని వెనుక నిఘా, రహస్య ఆపరేషన్ల కోసం అభివృద్ధి చేసిన అత్యాధునిక సైనిక ఇంజనీరింగ్ ఉంది. ఇది పెద్ద సైన్యాన్ని సైతం స్తంభింపచేయగలదు.

రాడార్లు గుర్తించకుండా ఎగరగలదు

రహస్య మిషన్ల కోసం రూపొందించిన ఈ డ్రోన్.. సహజ వాతావరణంలో కలిసిపోతుంది. సంప్రదాయ భద్రతా వ్యవస్థలైన రాడార్లు వీటిని గుర్తించడం కష్టం. చైనా శాస్త్రవేత్తలు దాని బాడీలో కమ్యూనికేషన్ గేర్, సెన్సర్లు, పవర్ యూనిట్లు, కంట్రోల్ ఎలక్ట్రానిక్స్‌ను ఏర్పాటుచేశారు. ఈ డ్రోన్‌ను స్మార్ట్ ఫోన్ ద్వారా నియంత్రించవచ్చు. ఈ సూక్ష్మ డ్రోన్‌పై భద్రతా రంగ నిపుణులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. పాస్‌వర్డ్‌లు, సున్నితమైన డేటా తస్కరణకు నేరస్థులు ఇలాంటి డ్రోన్లను వినియోగించవచ్చని రక్షణ రంగ నిపుణుడు తిమోతి హీత్ ఆందోళన వ్యక్తం చేశారు.



అమ్మో... విమాన ప్రయాణం!

ఎయిర్‌ఇండియా ప్రమాదం తర్వాత ప్రజల్లో పెరిగిన 'ఏవియో ఫోబియా'.. విమానం ఎక్కాలంటేనే గుబులు

- టికెట్ బుక్ చేసుకునే ముందే పూర్తిస్థాయిలో వివరాల ఆరా
- బోయింగ్ డ్రీమ్ లైనర్ పేరు వింటేనే ప్రయాణికుల్లో ఒక రకమైన భయం
- ఎయిర్ ఇండియాపై సన్నగిల్లిన నమ్మకం.. బుకింగ్స్‌పై ప్రభావం
- ఎమర్జెన్సీ డోర్ల వద్ద సీట్లకు డిమాండ్



ఒకప్పుడు విమాన ప్రయాణం అంటే కలల ప్రపంచంలో విహారమే. దానినో హోదాగా, గర్వంగా భావించేవారు. తర్వాత పరిస్థితి మారింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం విమాన ప్రయాణాన్ని ఓ భయంగా మార్చేసింది. ఇలాంటి భయంతో నెలకొనే ఒత్తిడి, గుండెలో గుబులు, అసహనం కలిగే స్థితిని మానసిక నిపుణులు ఏవియో ఫోబియాగా పిలుస్తారు. చాలా మంది ఈ ఫోబియాతో విమాన ప్రయాణాలకు దూరంగా ఉంటారు. గతంలో ప్రయాణికులు ఏ విమానాల్లో ప్రయాణిస్తున్నామనేది పెద్దగా పట్టించుకోలేదని, ఇప్పుడు ఆలోచన విధానం మారిందని ముంబైకి చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ తెలిపింది. టికెట్ బుక్ చేసుకునే ముందే విమాన రకం, మోడల్, విమానయాన కంపెనీ వంటి అంశాలను పరిశీలిస్తున్నారని పేర్కొంది. బోయింగ్, డ్రీమ్ లైనర్ అనే పేర్లు వినడానికి కూడా ప్రయాణికులు ఇష్టపడటం లేదని వెల్లడించింది.

ప్రయాణికుల్లో భయం

274 మంది ప్రాణాలను బలిగొన్న బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో, టీవీ చానెళ్లలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. ఇప్పటికే ఏవియో ఫోబియా ఉన్న వారిలో భయాన్ని రెట్టింపు చేయడమే కాదు.. కొత్తగా ఫోబియాకు లోనయ్యే వారి సంఖ్యను కూడా పెంచాయి. భారతీయ ప్రయాణికుల్లో భయాందోళనలకు ఈ ప్రమాద దృశ్యాలు ఒక ముఖ్య కారణమని మానసిక నిపుణులు తెలిపారు. ఈ సంఘటన జరిగిన ఒక్కరోజు తర్వాత భారత్‌లో 'ఫ్లయింగ్ ఫియర్' అనే పదంపై గూగుల్‌లో శోధన పెరిగిందని గూగుల్ ట్రెండ్స్ డేటా చూపిస్తోంది.

ఎయిర్ ఇండియాపై ప్రభావం

అహ్మదాబాద్ ప్రమాదం విమానయాన రంగాన్ని గణనీయంగా ప్రభావం చేసింది. ముఖ్యంగా ఎయిర్‌ఇండియాపై ప్రజల నమ్మకం తగ్గినట్టు స్పష్టంగా తెలుస్తోందని ముంబైలోని మరో ట్రావెల్ ఏజెన్సీ తెలిపింది. చాలా మంది ప్రయాణికులు ఎయిర్ ఇండియాలో ప్రయాణించడానికి భయపడుతున్నారని, ప్రత్యామ్నాయ విమానయాన సంస్థలను కోరుకుంటున్నారని పేర్కొంది. వారి డేటా ప్రకారం 'ఎయిర్ ఇండియా విమానాల బుకింగ్‌లు 15 నుంచి 20 శాతం తగ్గాయి. అదే సమయంలో ప్రయాణాల రద్దు 30 నుంచి 40 శాతం మేర పెరిగాయి' అని తెలిపింది. ఇది ఎయిర్‌ఇండియాకు ఆర్థికంగా, బ్రాండ్ ఇమేజ్‌పరంగా నష్టాన్ని కలిగించిందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

11ఏ సీటుకు డిమాండ్

ఇంత పెద్ద విమాన ప్రమాదంలో ఒకే ఒక్క వ్యక్తి ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. ఇప్పుడు అతను బతకడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అతను కూర్చున్న సీటు నంబరు 11ఏ .అప్పటి నుంచి ఆ సీటు కోసం అభ్యర్థనలు పెరిగాయని భారతీయ ట్రావెల్ ఎజెంట్లు నివేదించారు. కొంత మంది ప్రయాణికులు అదనంగా డబ్బు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారట. యూకేకు చెందిన రమేష్ ఎమర్జెన్సీ డోర్ పక్కన కూర్చోవడం వల్లే తప్పించుకున్నాడని మెజారిటీ ప్రజలు నమ్ముతున్నారు.

ఏవియో ఫోబియా ఎలా ఎదుర్కోవాలి ?

మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నివేదిక ప్రకారం.. 2024లో ప్రపంచవ్యాప్తంగా 40.6 కోట్ల విమాన సర్వీసులు విజయవంతంగా గమ్యస్థానాన్ని చేరుకోగా, కేవలం 7 ప్రమాదాలే నమోదయ్యాయి. వాస్తవాలు ఎలా ఉన్నా, ఒక్క ఘోర ఘటన ఏవియో ఫోబియా భయాన్ని పెంచింది. దీనిని ఎదుర్కోవడానికి మానసిక నిపుణులు కొన్ని ముఖ్య సూచనలు చేశారు. సానుకూల ఆలోచనలతో మనస్సును మళ్లించడం, సంగీతం వినడం లాంటివి ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. చిన్న ప్రయాణాలతో ప్రారంభించి క్రమంగా పెద్ద ప్రయాణాల వైపు అడుగులు వేయాలని సూచిస్తున్నారు. కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ ఎక్స్‌పోజర్ థెరపీ(విమాన దృశ్యాలు, సౌండ్స్, ప్రయాణ వీడియోలను చూపిస్తారు), యాంగ్జైటీ మేనేజ్‌మెంట్ మెడికేషన్ ద్వారా ఏవియో ఫోబియాను ఎదుర్కోవచ్చని చెబుతున్నారు.

(సెంట్రల్ డెస్క్)

న్యూయార్క్ మేయర్ పోటీలో జోహ్రాన్ మమ్దానీ

- డెమొక్రాట్ పార్టీ అభ్యర్థిగా ఎంపిక

న్యూయార్క్, జూన్ 26: అమెరికాలోని కీలకమైన నగరం న్యూయార్క్ మేయర్ పదవికి భారత సంతతి మూలాలున్న జోహ్రాన్ మమ్దానీ పోటీపడుతున్నారు. డెమొక్రాట్ పార్టీ తరఫున మేయర్ అభ్యర్థిగా ఆయన ఎంపికయ్యారు. 33 ఏళ్ల వయసున్న జోహ్రాన్ తల్లి అమెరికాలో స్థిరపడిన భారతీయురాలు, సినీ నిర్మాత మీరా నాయర్. సలాం బాంబే, మాన్సూన్ వెడ్డింగ్ వంటి సినిమాలతో సంచలనం సృష్టించిన ఆమె పద్మశ్రీ అవార్డు గ్రహీత కూడా. ఆయన తండ్రి మహమూద్ మమ్దానీ గుజరాతీ మూలాలున్న ఉగాండా జాతీయుడు. ఆఫ్రికా ఖండంలో వలస పాలన, రాజకీయ హింసపై ఎన్నో రచనలు చేశారు. ప్రముఖ యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 'గుడ్ ముస్లిం.. బ్యాడ్ ముస్లిం' పుస్తకం రాశారు. జోహ్రాన్ 1991 అక్టోబర్ 18న ఉగాండాలోని కంపాలాలో జన్మించారు. ఆయనకు ఏడేళ్ల వయసున్నపుడు వారి కుటుంబం న్యూయార్క్‌కు వలస వచ్చింది. అక్కడే చదువు పూర్తి చేసిన జోహ్రాన్.. క్రమంగా రాజకీయాల్లో అడుగుపెట్టారు. 2021లో క్వీన్స్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తాజాగా న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికలో డెమొక్రాట్ అభ్యర్థిగా ఎంపికయ్యారు. ఆయన గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సర్వేలు తేల్చాయి. ఈ క్రమంలో జోహ్రాన్ మమ్దానీపై అమెరికా అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "జోహ్రాన్ కమ్యూనిస్టు పిచ్చివాడు. ఇంతకుముందు రాడికల్ వామపక్షవాదులను చూశాం. కానీ ఇతను మరీ దారుణంగా ఉన్నాడు. అతడి గొంతు ఘోరంగా ఉంది. అంత తెలివైనవాడు కూడా కాదు" అని విమర్శించారు. డెమొక్రాట్ల తరఫున మేయర్ అభ్యర్థిత్వానికి పోటీపడిన సమయంలో జోహ్రాన్ కూడా ట్రంప్‌పై గట్టిగానే విమర్శలు గుప్పించారు.

ఐఎస్‌ఎస్‌లోకి శుభాన్షు

(మొదటిపేజీ తరువాయి)


అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు

విజయవంతంగా ఏర్పాటయ్యాయి. దీనికి రెండు గంటల సమయం పట్టింది. గ్రేస్‌లోని వ్యోమగాములు నలుగురు ఐఎస్ఎస్‌లోకి వెళ్లారు. తద్వారా ఐఎస్ఎస్‌లోకి వెళ్లిన తొలి భారతీయుడిగా శుభాన్షు శుక్లా చరిత్ర సృష్టించారు. శుభాన్షుకు మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ 634వ బాడ్జి ఇచ్చారు. రోదసిలో ప్రయాణించిన 634వ వ్యోమగామి అని ఈ బ్యాడ్జి అర్థం. 'భారత అంతరిక్ష పరిశోధనల్లో ఇదొక కొత్త అధ్యాయం. మీతో మాట్లాడుతూ ఉంటా. నాతో త్రివర్ణ పతాకం ఉంది. మీ అందరి ప్రేమనూ నేను వెంట తీసుకొచ్చా. రాబోయే 14 రోజులూ శాస్త్ర పరిశోధనల పరంగా చాలా ఆసక్తికరంగా ఉండనున్నాయి' అని శుభాన్షు పేర్కొన్నారు. అమెరికాకు చెందిన స్పేస్ ఎక్స్ అనే ప్రైవేటు సంస్థ చేపట్టిన ఈ ప్రయోగానికి శుభాన్షు.. మిషన్ పైలట్‌గా వ్యవహరిస్తున్నారు. సీనియర్ వ్యోమగామి పెగ్గీ విట్సన్ మిషన్ కమాండర్‌గా ఉన్నారు. కాగా, ఐఎస్ఎస్‌లో ఇప్పటికే ఏడుగురు వ్యోమగాములున్నారు. తాజాగా, వారికి మరో నలుగురు అదనంగా చేరారు.

ఒక శిశువులా నేర్చుకుంటున్నా: శుభాన్షు శుక్లా

భూమ్మీద నుంచి ఐఎస్ఎస్‌కు వెళ్తున్న క్రమంలో గ్రేస్ వ్యోమనౌకలో ఉన్న వీడియో లింక్ ద్వారా శుభాన్షు శుక్లా మాట్లాడుతూ, గురుత్వాకర్షణ శక్తి లేని పరిస్థితుల్లో జీవించటం నేర్చుకుంటున్నానని, ఇదంతా ఒక శిశువులా అనిపిస్తోందన్నారు. అందరికీ హలో.. నమస్కారం అంటూ శుభాన్షు తన మాటలు ప్రారంభించారు. ప్రయోగానికి ముందు 30 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉన్న సంగతిని ప్రస్తావిస్తూ.. 'లాంచ్‌ప్యాడ్ మీద గ్రేస్‌లో కూర్చోగానే ఎప్పుడెప్పుడు బయల్దేరుదామా అనే భావనే నా మనసు నిండా ఆవరించింది. ప్రయాణం ప్రారంభమవగానే సీటులో నెట్టివేయబడినట్టు అనిపించింది. అంతా నిశ్శబ్దం. శూన్యంలో తేలుతూ ఉన్నాం. తొలుత ఏమీ ప్రత్యేకంగా అనిపించలేదు. కానీ, కొంతసేపటి తర్వాత మాత్రం అద్భుతంగా అనిపించసాగింది' అని తెలిపారు. 'ఈ కొత్త అనుభవానికి అలవాటు పడటం మొదలైంది.. కొత్తగా అడుగులు వేయటం, నడవటం, తినటం, చదవటం, నన్ను నేను నియంత్రించుకోవటం వంటివన్నీ ఒక శిశువులా నేర్చుకోవటం ఎంతో సంతోషాన్నిచ్చాయి. ఇదంతా కొత్త వాతావరణం, కొత్త సవాల్. నా సహచర వ్యోమగాములతో కలిసి నేర్చుకుంటున్నా. పొరపాట్లు చేయటం మంచిదే.. కానీ, వాటిని ఇతరులు చేస్తుంటే చూడటం వినోదాన్ని ఇస్తుంది' అంటూ ప్రయాణంలో విశేషాల్ని, సరదాల్ని శుభాన్షు శుక్లా వివరించారు.

ఇది సమష్టి విజయం

ఈ ప్రయాణం తన వ్యక్తిగత ఘనత కాదని, దీంట్లో భాగస్వాములైన వారందరి సమష్టి విజయమని, వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని శుభాన్షు వినమ్రంగా పేర్కొన్నారు. తన కుటుంబసభ్యులు, స్నేహితుల సహకారం కూడా గొప్పదని, వారు లేకుంటే తాను ఇక్కడి దాకా వచ్చేవాడినే కాదన్నారు. గురుత్వాకర్షణ రాహిత్య స్థితిని తెలుసుకోవటం కోసం (జీరో జీ ఇండికేటర్) తమతోపాటు తీసుకొచ్చిన హంస బొమ్మను ప్రస్తావిస్తూ.. 'భారతీయ సంస్కృతిలో హంసకు గొప్ప ప్రాధాన్యం ఉందని, జ్ఞానానికి ప్రతీకగా భావిస్తారని గుర్తు చేశారు. అవసరమైన దానిపైనే దృష్టి పెట్టి, అనవసరమైన వాటిని వదిలిపెట్టటం హంస లక్షణమని, ప్రస్తుత చంచల ప్రపంచంలో ఇది చాలా ముఖ్యమైనదన్నారు. ప్రయాణంలో తాను చాలాసేపు ప్రశాంతంగా పడుకున్నానని తన సహచరులు చెప్పినట్లు శుక్లా వెల్లడించారు. ఐఎస్ఎస్‌లో శుక్లా బృందం 14 రోజులపాటు ఉండనుంది. సైన్స్‌కు సంబంధించిన పలు ప్రయోగాలను ఈ బృందం చేయనుంది.

ట్రంప్ ఆణిముత్యాలు

- వరుసగా విభిన్న వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు



న్యూఢిల్లీ, జూన్ 26: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాచాలత్వమే వేరు. ఎవరు కాదన్నా, ఎవరు అవునన్నా ఆయన చెప్పాలనుకున్నది చెబుతారు. కాదని ఖండించినా చెబుతూనే ఉంటారు. వివిధ దేశాల ప్రధాన మంత్రులు, అధ్యక్షుల స్థాయి వాళ్లపై అప్పుడే ప్రశంసలు కురిపిస్తుంటారు, ఉన్నట్టుండి వ్యతిరేక వ్యాఖ్యలూ చేస్తుంటారు. అలా బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఒక్కరోజులోనే ట్రంప్ చేసిన కొన్ని వ్యాఖ్యలివి..

ఇరాన్ క్షిపణులు అద్భుతం!

"ఇజ్రాయెల్‌కు చాలా గట్టి దెబ్బ తగిలింది. ముఖ్యంగా చివరి రెండు రోజుల్లో దెబ్బతిన్నది. ఆ (ఇరాన్) బాలిస్టిక్ క్షిపణులు చాలా భవనాలను ధ్వంసం చేశాయి. అవి అద్భుతంగా పనిచేశాయి".. ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌కు నష్టం ఎక్కువే జరిగిందంటూ..

అవినీతిపై విచారణ వద్దు

"ఇరాన్‌ను అణచివేసి ఇజ్రాయెల్ చరిత్రలోనే గొప్ప ఘట్టానికి నేతృత్వం వహించిన ప్రధాని నెతన్యాహును అవినీతి ఆరోపణలపై విచారించడం దారుణం. ఈ విషయం నన్ను షాక్‌కు గురిచేసింది. దేశానికి ఎంతో చేసిన గొప్ప హీరో అయిన ఆయనపై వెంటనే అవినీతి విచారణను నిలిపివేయాలి. లేదా క్షమాభిక్ష పెట్టాలి.." ఈ నెల 30న నెతన్యాహు అవినీతి కేసులపై విచారణ జరగనున్న నేపథ్యంలో..

భారత్-పాక్ యుద్ధంపై పాత పాట..

"భారత్, పాక్‌లతో మాట్లాడాను. చూడండి మీరు ఇలా యుద్ధం చేసుకుంటుంటే పరిస్థితి చెడుగా మారుతుందని, అలాగైతే అమెరికా ఎలాంటి వాణిజ్యం చేయబోదని చెప్పాను. దాంతో లేదు లేదు.. మాకు వాణిజ్య ఒప్పందం కావాలని వాళ్లు చెప్పారు. మేం అణు యుద్ధాన్ని నివారించాం".. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ..

ముస్లిం డెమొక్రాట్‌పై వాచాలత్వం..

"అనుకున్నంతా అయింది. డెమొక్రాట్లు గీత దాటారు. జోహ్రాన్ మమ్దానీ ఓ కమ్యూనిస్టు పిచ్చివాడు. న్యూయార్క్ నగర మేయర్ అయ్యే దిశగా వెళుతున్నాడు. ఇంతకుముందు రాడికల్ వామపక్షవాదులను చూశాం. కానీ ఇతను మరీ దారుణంగా ఉన్నాడు. అతడి గొంతు ఘోరంగా ఉంది. అంత తెలివైనవాడిలా కూడా కనిపించడం లేదు".. న్యూయార్క్ మేయర్ పదవి కోసం డెమొక్రాట్ల ప్రైమరీలు గెలిచిన నాయకుడిని తూలనాడుతూ.. (జోహ్రాన్ మమ్దానీ తల్లి మన కేరళకు చెందిన నాయర్, తండ్రి ఉగాండా ముస్లిం)

పుతిన్ చెబితే వినే రకం కాదు..

"రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మిగతా వాటిలా కాదు. చాలా క్లిష్టమైనది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెబితే వినే రకం కాదు. ఆయనను తప్పుదోవ పట్టించారు. ఈ యుద్ధం ఆయనకు తలనొప్పిగా మారింది. దీన్నుంచి బయటపడాలని అనుకుంటున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ నాకు సమస్యలు ఉన్నాయి".. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని కూడా ఆపుతారా అన్న మీడియా ప్రశ్నకు సమాధానంగా..

మొస్సాద్ ఏజెంట్లు చూసివచ్చారు..

"ఇరాన్ ఫర్దో అణుశుద్ధి కేంద్రం పూర్తిగా ధ్వంసమైంది. అమెరికా బాంబులు వేసిన తర్వాత ఇజ్రాయెల్ మొస్సాద్ ఏజెంట్లు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని వారు చెప్పారు".. ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలు పూర్తిగా ధ్వంసం కాలేదన్న నిఘా వర్గాల వార్తలను తప్పుపడుతూ...

అమెరికాపై మాదే విజయం

- మా దాడులు అమెరికాకు చెంపదెబ్బల్లాంటివి
- ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా ఖమేనీ వెల్లడి


అయతుల్లా ఖమేనీ

టెహ్రాన్/వాషింగ్టన్/న్యూఢిల్లీ, జూన్ 26: అమెరికాపై తాము విజయం సాధించామని ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక ఆయన తొలిసారి ఈ యుద్ధంపై స్పందించారు. 10 నిమిషాల నిడివిగల వీడియోను విడుదల చేశారు. దాన్ని ఇరాన్ అధికారిక వార్తా చానల్ ప్రసారం చేసింది. ఆ వీడియోలో ఖమేనీ పలుమార్లు అమెరికా, ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. "12 రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్‌పై మేమే విజయం సాధించాం. పశ్చిమాసియాలో అమెరికాకు చెందిన అతిపెద్ద బేస్‌పై దాడులు చేశాం. ఇవి అమెరికాకు చెంపదెబ్బలాంటివే..! మరోమారు అమెరికా దుస్సాహసం చేస్తే.. మా క్షిపణులు అమెరికాను తాకుతాయనే సంకేతాన్నిచ్చాం" అని వ్యాఖ్యానించారు.

ఇరాన్‌కు తీవ్ర నష్టం: సీఐఏ

అమెరికా దాడులతో ఇరాన్ అణు కేంద్రాలకు తీవ్రంగా పరిగణించగలిగే స్థాయిలో నష్టం వాటిల్లిందని అగ్రరాజ్య కేంద్ర దర్యాప్తు సంస్థ(సీఐఏ) డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ వెల్లడించారు. కాగా.. ఇరాన్ అణు కార్యక్రమం పూర్తిస్థాయిలో దెబ్బతిన్నదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటించారు. నాటో సదస్సులో ఆయన మాట్లాడుతూ.. "మా దాడులు పూర్తవ్వగానే.. మొస్సాద్ ఏజెంట్లు అణు కేంద్రాల వద్ద పరిశీలించారు. ఆయా కేంద్రాలు పూర్తిగా ధ్వంసమైనట్లు నిర్ధారించారు" అని చెప్పారు. కాగా, పన్నెండు రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇరాన్‌లో 1,054 మంది మరణించారని, 4,476 మంది క్షతగాత్రులయ్యారని మానవ హక్కుల సంఘాలు పేర్కొన్నాయి. అయితే.. ఇరాన్ ప్రభుత్వం మాత్రం 606 మంది మృతిచెందారని, 5,332 మంది క్షతగాత్రులయ్యారని ప్రకటించింది.

రైలు పట్టాలపై కారు

- ఆత్మహత్యాయత్నంలో భాగంగా యూపీ మహిళ హల్‌చల్
- పట్టాలపై 7 కి.మీ.లు ప్రయాణం
- రంగారెడ్డి జిల్లాలో ఘటన

శంకర్‌పల్లి, జూన్26 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో రైలు పట్టాలపై కారుతో దూసుకెళ్లిన ఓ మహిళ నానా హంగామా సృష్టించింది. ఏడు కిలోమీటర్ల మేర రైలు పట్టాలపై కారులో ప్రయాణించి రైల్వే అధికారులు, పోలీసులను పరుగులు పెట్టించింది. రైల్వే పోలీసులు అతికష్టం మీద ఆమెను అదుపులోకి తీసుకోగా.. ఆమె తీరు వల్ల పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూకు చెందిన ఓమికా సోని(34) కొంతకాలంగా హైదరాబాద్‌లోని పుప్పాలగూడలో ఉంటున్నారు. క్యాప్‌జెమినీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన ఓమికా 2022లో భర్త నుంచి విడాకులు తీసుకున్నారు. అప్పట్నించి ఒంటరిగా ఉంటున్న ఆమె 3 నెలల క్రితం ఉద్యోగం పోగొట్టుకున్నారు. అయితే, గురువారం తెల్లవారుజామున తన కియా సోనెట్ కారులో ఇంటి నుంచి బయలుదేరిన ఓమికా.. రంగారెడ్డి జిల్లా కొండకల్ రైల్వేగేట్ వద్ద కారును పట్టాలపైకి ఎక్కించి బుల్కాపూర్, చిన్నశంకర్‌పల్లి మీదుగా శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ వరకు సుమారు 7కి.మీలు రైల్వే ట్రాక్‌పై నడిపారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు పట్టాలను క్రాసింగ్ చేసి కారు ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. రైల్వే సిబ్బంది కారు అద్దాలను ధ్వంసం చేసి ఆమెను బయటికి లాగే యత్నం చేయగా.. తన వద్ద ఉన్న నాన్‌చాక్‌తో ఓమికా వాళ్లని బెదిరించారు. మారథాన్ రన్నర్ అయిన ఓమికా తీవ్రంగా ప్రతిఘటించడంతో అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ఆపసోపాలు పడ్డారు. ఆమె చేతులను తువ్వాలుతో కట్టేసి శంకర్‌పల్లి పోలీసు స్టేషన్‌కి తరలించి విచారించారు. ఓమికా తండ్రి ఫోన్ నెంబర్ తప్ప మరే వివరాలను పోలీసులు రాబట్టలేకపోయారు. అనంతరం ఓమికాను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. సహకరించకపోవడంతో వైద్యులు ఆమెను ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి తరలించాలని సూచించారు. అయితే, రైల్వే పోలీసులు ఆమెను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఓమికా సోని ఆత్మహత్య చేసుకోవడానికే కారుతో రైల్వే ట్రాక్‌పైకి వెళ్లారని.. ఈ మేరకు కేసు నమోదు చేశామని నాంపల్లి రైల్వే సీఐ శ్రీనివాస్ తెలిపారు. విధులకు ఆటంకం కలిగించడంతోపాటు పోలీసులను దుర్భాషలాడినందున ఆమెపై శంకర్‌పల్లి పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఓమికా సోని రెండు నెలలుగా తమతోనూ సరిగా మాట్లాడటం లేదని, మతి భ్రమించినట్లు వ్యవహరించేదని ఆమె తల్లిదండ్రులు వాపోయారు. ఓమికా సోని కారుతో రైలు పట్టాలపైకి రావడంతో.. ఆ సమయంలో ఆ ట్రాక్‌పై వెళ్లాల్సిన రైళ్లను శంకర్‌పల్లి స్టేషన్‌మాస్టర్ వెంటనే ఆపేశారు.


ఓమికా సోనిని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న పోలీసులు

ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

- ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- పోలీసులే ట్యాప్ చేసి.. వాళ్లే విచారణ చేస్తారా?
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



సుభాష్‌నగర్/ఖమ్మం/హైదరాబాద్/సిటీ/న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించి సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి చాటుకోవాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలని పదే పదే కోరారని.. అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. రేవంత్ బీఆర్ఎస్‌తో కుమ్మక్కు కాకపోతే ఆ కేసును వెంటనే సీబీఐకి ఇవ్వాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ట్యాపింగ్ విషయంలో బీజేపీ తరఫున హైకోర్టులో కేసు వేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసులే ఫోన్ ట్యాపింగ్ చేశారని, ఇప్పుడు వారి చేతనే విచారణ ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. పసుపు బోర్డు ఏర్పాటు నిజామాబాద్ జిల్లా రైతుల దశాబ్దాల కల అని, కాంగ్రెస్ హయాంలో ఆ డిమాండ్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. పసుపు బోర్డును ప్రారంభించేందుకు 29న కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయల్ వస్తున్నారని తెలిపారు. అదే రోజు డీఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నగరంలోని బైపాస్‌రోడ్డు చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ డే ఫొటో ఎగ్జిబిషన్‌ను కిషన్ రెడ్డి తిలకించారు. కాగా, నిజామాబాద్‌లోని ఆర్యనగర్‌లో ఏర్పాటు చేయనున్న పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని కిషన్ రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రారంభోత్సవానికి త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించనున్న రైతు సమ్మేళన సభ ప్రాంగణాన్ని పరిశీలించారు.

ఇందిర పేరు పెట్టినా.. ఇళ్లకు నిధులిస్తాం: ఎంపీ ఈటల

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో ఇళ్లు నిర్మించినా కేంద్రం వాటికి ఇచ్చే నిధులను ఆపబోదని ఎంపీ ఈటల తెలిపారు. పేదలకు గూడు నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ విధానమని చెప్పారు. గరీబోళ్లకు రేషన్ బియ్యం కూడా కేంద్రమే ఇస్తోందని అన్నారు. ఎమర్జెన్సీ డే సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఈటల పాల్గొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని నాటి ప్రధాని ఇందిరాగాంధీ అపహాస్యం చేశారని, నేడు కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ పుస్తకాలను పట్టుకుని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు.

గోవధ నిషేధ చట్టాలను అమలు చేయాలి: రాజాసింగ్

గో సంరక్షణ కోసం ఏడాది పొడవునా గోవధ నిషేధ చట్టాలను అమలు చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. కేవలం బక్రీద్ సమయంలో హడావుడి చేసి ఆ తర్వాత నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. బక్రీద్ సమయంలో గోవధ విషయంలో చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం డీజీపీకి రాజాసింగ్ లేఖ రాశారు. కాగా, కేసీఆర్ హయాంలో జరిగిన కుంభకోణాలపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కైనందున కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల దర్యాప్తు ముందుకు సాగడం లేదని విమర్శించారు.

ఎంపీ రఘునందన్‌కు భద్రత పెంపు..

మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో సాయుధ పోలీసులతో భద్రత కల్పిస్తూ పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎంపీ కాన్వాయ్‌లో ఎల్లప్పుడూ సాయుధ పోలీసులతో కూడిన ఎస్కార్టు వాహనం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు ఆంధ్రజ్యోతి ఎండీ వాంగ్మూలం

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా మీ వాంగ్మూలం అవసరం ఉందని నోటీసులో పేర్కొన్నారు. సిట్ అధికారులు ఇచ్చిన నోటీసు మేరకు శుక్రవారం రాధాకృష్ణ విచారణకు హాజరుకానున్నారు. ఇదే విధంగా చేవెళ్ల ఎంపీ, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని, విచారణకు రావాలని ఆయనకు కూడా సిట్ నుంచి పిలుపు అందినట్లు సమాచారం. 2023 నవంబర్ నెలలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఫోన్ నెంబర్‌ను ట్యాపింగ్ చేసినట్లు సిట్ గుర్తించింది.

రివ్యూ కమిటీ లేఖలతోనే చిక్కిన ముఠా..

నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దలు చెప్పారంటూ వారు, వీరు అనే తేడా లేకుండా సొంత పార్టీ నేతలు మొదలు ప్రతిపక్ష పార్టీల నేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేసిన ప్రభాకర్‌రావు నేతృత్వంలోని ఎస్ఐబీ బృందం అతి తెలివితో అసలైన ఆధారాలను వదిలివేసి సిట్‌కు చిక్కింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి అనధికారికంగా కొండంత చేయగా, అధికారికంగా చేసిన ట్యాపింగ్‌లోనే నాటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు దొరికి పోయారని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు.



మావోయిస్టుల సమాచారం కోసమంటూ ప్రముఖుల ఫోన్ నెంబర్లను రివ్యూ కమిటీకి పంపిన ప్రభాకర్‌రావు తెలిసే నేరానికి పాల్పడ్డారని, ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారని దర్యాప్తులో వెల్లడైంది. 2023 నవంబర్ నెలకు సంబంధించి 615 మంది ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ చేయడానికి రివ్యూ కమిటీకి తప్పుడు సమాచారం ఇచ్చి అనుమతి పొందిన విషయాన్ని న్యాయస్థానంలో రుజువు చేయడం కోసమే సిట్ అధికారులు ఆయా బాధితుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారు. ప్రభాకర్‌రావు బృందం తమ టార్గెట్ అయిన వారి ఫోన్ నెంబర్లకు వచ్చిన కాల్స్ వినడమే కాకుండా ఇంటర్నెట్ ప్రొటోకాల్ డేటా రికార్డు(ఐపీడీఆర్)ను కూడా ఉపయోగించారని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక టూల్స్ ద్వారా వాట్సాప్ కాల్స్, వాట్సాప్ చాట్స్ ప్రభాకర్‌రావు ముఠా తెలుసుకుందని, వాటి ఆధారంగా పలు బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులొచ్చాయి. మావోయిస్టుల పేరుతో అనుమతులు తీసుకుని ట్యాపింగ్ చేసినదే కాకుండా ఇజ్రాయిల్ నుంచి తెప్పించిన పెగాసస్ సాఫ్ట్‌వేర్‌ను ప్రైవేట్ వార్ రూమ్స్‌లో పెట్టి సిగ్నల్, ఫేస్‌బుక్ కాల్స్‌ను సైతం ప్రభాకర్‌రావు ముఠా విన్నారని ఆరోపణలు వస్తున్న సంగతి విదితమే. అయితే, ప్రభాకర్ రావు ముఠా పెగాసస్ స్పైవేర్ ఉపయోగించి విన్న, రికార్డు చేసిన సంభాషణల డేటాను పూర్తిగా ధ్వంసం చేసినట్లు సిట్ అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు.

ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలి!

35 ఏళ్లుగా పట్టా భూమికి పరిహారం ఇవ్వని అధికారులు

- కోర్టును ఆశ్రయించిన చిన్నకోడెపాక బాధితులు
- ఆర్డీవో కార్యాలయ సామగ్రి జప్తునకు కోర్టు ఆదేశం
- ఆర్డీవో గడువు కోరడంతో జప్తు ప్రక్రియ వాయిదా


విజయలక్ష్మి

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అవసరాల నిమిత్తం 35 ఏళ్ల క్రితం పట్టా భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ మహిళ కోర్టును ఆశ్రయించింది. దీంతో ఆమెకు ఇవ్వాల్సిన పరిహారం కింద ఆర్డీవో కార్యాలయంలోని ఫర్నిచర్, ఇతర వస్తువులను జప్తు చేయాలని కోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జప్తు చేయడానికి వచ్చిన సిబ్బంది... ఆర్డీవో కొంత సమయం ఇవ్వాలని కోరడంతో వెనుదిరిగారు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం చిన్నకోడెపాక గ్రామానికి చెందిన కుంటపల్లి విజయలక్ష్మి కథనం మేరకు.. ఆమెతో పాటు సంబంధీకులైన కుంటపల్లి లక్ష్మి, పెండ్యాల వసంత నుంచి వారి వారసత్వ ఆస్తి అయిన 11 ఎకరాల 20 గుంటల భూమిని ప్రభుత్వ అవసరాలకు 1988లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎకరానికి రూ.17 వేలు పరిహారం ఇస్తామని చెప్పినా.. జాప్యం చేస్తూ వచ్చారు. దీంతో విజయలక్ష్మి జిల్లా కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆమెకు రావాల్సిన పరిహారం సొమ్ము వడ్డీ కలిపి మొత్తం రూ.22, 65,253 చెల్లించాలని ఈ నెల 12న ఆదేశించింది. చెల్లించని పక్షంలో కార్యాలయంలోని ఫర్నిచర్, బొలేరో వాహనం, ఇతరత్రా వస్తువులు జప్తు చేయాలని పేర్కొంది. దీంతో గురువారం ఆమె, కోర్టు సిబ్బంది ఆర్డీవో కార్యాలయానికి వచ్చారు. ఉన్నతాధికారులకు సమస్యను నివేదించేందుకు వచ్చే నెల 8 వరకు తనకు గడువు ఇవ్వాలని ఆర్డీవో కోరడంతో జప్తు చేయడానికి వచ్చిన సిబ్బంది వెనుదిరిగారు. ఉన్నతాధికారులు చొరవ చూపి తనకు న్యాయం చేయాలని విజయలక్ష్మి కోరారు.

జీవో 49 రద్దు చేయాలి

- మావోయిస్టు నేత జగన్

ఏటూరునాగారం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 49 తక్షణమే రద్దు చేయాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థల కొమ్ము కాసేందుకే ఈ జీవోను తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీల ఉద్యమ స్ఫూర్తి కొమురంభీం పేరుతో ఈ జిల్లా ఏర్పాటైందన్నారు. సుమారు 339 గ్రామాల్లో ప్రజలను ఖాళీ చేయించేందుకు ఈ జీవో ఉద్దేశించిందని, ఇది జంతువుల సంరక్షణ కోసం కాదని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని 5, 6వ షెడ్యూల్ ప్రాంతాలను, సంపదను దొంగిలించడానికి టైగర్ ఫారెస్ట్ కారిడార్ పేరుతో కుట్ర చేస్తున్నారని జగన్ ఆరోపించారు. ఏన్నో ఏళ్లుగా అడవులతో సహజీవనం చేస్తున్న ఆదివాసులను అడవికి దూరం చేసే కుట్ర జరుగుతోందని అన్నారు. ఈ జీవో వల్ల తెలంగాణలోని కొమురంభీం, ములుగు, భద్రాది వంటి మూడు జిల్లాలు తెలంగాణ చిత్రపటం నుంచి పూర్తిగా అదృశ్యమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదివాసీ సంఘాలతో చర్చించి వారి చట్టబద్ధమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఆదివాసీ బిడ్డ, మాజీ నక్సలైట్‌గా ప్రాచుర్యంలో ఉన్న మంత్రి తన సొంత నియోజకవర్గంలో ఇలాంటి దుశ్చర్యలు జరగడం సిగ్గుచేటని, అవమానకరమని ఆయన విమర్శించారు.

పాలమూరు బయోసైన్స్ లైసెన్స్ సమీక్షించాలి

- పరిశోధనల పేరిట కంపెనీలో జంతుహింసను నిర్మూలించాలి
- కేంద్ర కమిటీ నివేదికను బహిర్గతపరచాలి: పెటా డిమాండ్

మహబూబ్‌నగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం కర్వెన, మద్దిగట్ల గ్రామాల శివారులో ఉన్న పాలమూరు బయోసైన్స్ లైసెన్స్ పనితీరును సమీక్షించడంతోపాటు పరిశోధనల పేరిట ఆ సంస్థ యాజమాన్యం చేస్తున్న జంతుహింసను నిర్మూలించాలని పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్ (పెటా) ఇండియా డిమాండ్ చేసింది. నియమ విరుద్ధ ప్రయోగాలతోపాటు జీవ భద్రతా లోపాలు, మందులూ వెటర్నరీ సిబ్బంది కొరతతోపాటు పాలమూరు బయో సైన్స్ పలు ఉల్లంఘనలకు పాల్పడుతున్నదని ఆరోపించింది. కాంట్రాక్ట్ ల్యాబోరేటరీ, బీగల్ బ్రీడర్‌నని చెప్పుకుంటూ కార్యకలాపాలు నిర్వహిస్తున్న పాలమూరు బయోసైన్స్‌లో జరుగుతున్న జంతుహింసను గతేడాది అక్టోబర్‌లో పరిశీలించిన పెటా విజిల్‌బ్లోయర్.. వీడియోలు, ఫొటోలతో కేంద్రానికి ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరిపి.. పాలమూరు బయోసైన్స్‌లో ఉన్న 1200 జంతువులను రక్షించడంతోపాటు పునరావాసం కల్పించాలని, ఆ సంస్థ లైసెన్సును సమీక్షించాలని సిఫారసు చేస్తూ నివేదిక సమర్పించింది. నివేదిక ఇచ్చి వారం దాటినా కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆ నివేదికలోని సిఫారసులను దాచి పెట్టేందుకు యత్నిస్తున్నారన్న పెటా.. వెంటనే ఆ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేసింది. మరోవైపు, ఈ నెల 16న తమ ఫిర్యాదుతో భూత్పూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైనా చర్యలు తీసుకోకపోవడం ఆక్షేపణీయమని పేర్కొంది. క్లినికల్ ట్రయల్స్‌తోపాటు పాలమూరు బయో సైన్స్‌లో పొట్టిజాతి వేటకుక్కలు, మినీ పిగ్స్, గొర్రెలు, కోతులపై జంతు హింసకు పాల్పడుతున్నారని తెలిపింది. అడవుల్లోని కోతులపై పరిశోధనలు తప్ప, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోకపోవడం నిత్యకృత్యంగా మారిందని పెటా ఆరోపించింది.

ఇదెక్కడి న్యాయం!

- నిందితులకు పోలీసు అధికారి కొమ్ముకాస్తారా?
- న్యాయం కోసం సీఎం, డీజీపీని కలుస్తాం
- ఎన్నారై నవీన్‌రెడ్డి భార్య శ్రావ్య

ఇల్లెందు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): "ఇదెక్కడి న్యాయం..! నిందితులకు పోలీసు ఉన్నతాధికారి కొమ్ముకాస్తారా? ఎన్నారై భర్త వేధింపులకు గురిచేసి, అన్యాయం చేస్తే.. ఇల్లెందు పోలీసులను న్యాయం చేయాలని కోరాం. పోలీసు ఉన్నతాధికారి మాత్రం నిందితులకే కొమ్ముకాస్తున్నారు. ఏకంగా.. కౌన్సెలింగ్ నిర్వహించి, విచారణ జరుపుతున్న సీఐని సస్పెండ్ చేయడం ఏమిటి?" అని ఎన్నారై పెండ్లి నవీన్‌రెడ్డి భార్య.. దుబ్బాక శ్రావ్య నిలదీశారు. పోలీసు కౌన్సెలింగ్‌కు రాకుండా తప్పించుకుంటున్న తన భర్తను అమెరికా నుంచి రప్పించి, తనకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంలో ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ తమను వేధించారంటూ నవీన్‌రెడ్డి తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుతో.. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సీఐని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే..! ఈ నేపథ్యంలో శ్రావ్య ఇల్లెందు ఠాణా ఎదుట విలేకరుల సమావేశం నిర్వహించారు. "నన్ను వీసా స్టాంపింగ్ పేరుతో భారత్‌కు పంపిన నవీన్‌రెడ్డి.. ఆ తర్వాత కాపురానికి తీసుకెళ్లడం లేదు. నాకు సంతానం కలగడం లేదని, నాలో లోపం ఉందంటూ తోటికోడలు, ఆమె భర్త హరీశ్‌రెడ్డి నన్ను ఆస్పత్రులు, ఫెర్టిలిటీ సెంటర్లకు తీసుకెళ్లి, వైద్య పరీక్షలు చేయించారు. వైద్యులు నాలో ఎలాంటి లోపం లేదని, నా భర్తకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అయితే.. అత్తింటివారు నాపైనే నిందలు వేస్తూ.. మానసిక క్షోభకు గురిచేశారు" అని శ్రావ్య వివరించారు. తన కొడుకు ఇండియాకు రాడని, అతనిలో ఏ లోపం లేదని తన మామ ఉపేందర్‌రెడ్డి తేల్చి చెప్పారని, తమకు ఐజీ అండగా ఉన్నారని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శ్రావ్య తండ్రి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 20 రోజులుగా న్యాయం కోసం తిరుగుతున్న తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, నవీన్‌రెడ్డి విషయంలో మాత్రం ఐజీ వెంటనే స్పందించారని ఆరోపించారు. తన కూతురికి న్యాయం చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీని కలుస్తానని వివరించారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను చెల్లనివిగా ప్రకటించాలంటూ దాఖలైన ఒక పిటిషన్‌ను బోంబే హైకోర్టు గురువారం కొట్టివేసింది. గత ఏడాది నవంబరు 20వతేదీ సాయంత్రం ఆరుగంటల తరువాత 76లక్షల బోగస్ ఓట్లు పోలయ్యాయన్న పిటిషనర్ వాదనను న్యాయస్థానం అంగీకరించలేదు. జాబితాలో అవకతవకలు జరిగాయన్న, పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లువేశారన్న ఆరోపణలను రుజువు చేసే కచ్చితమైన, ప్రత్యక్ష రికార్డులేమీ లేనందున న్యాయస్థానం సదరు పిటిషన్‌ను కొట్టిపారేసింది. మరోపక్కన, ఈసీతో తన యుద్ధాన్ని కొనసాగిస్తూ మహారాష్ట్ర ఓటరు జాబితాల డిజిటల్ ప్రతిని కాంగ్రెస్ గురువారం డిమాండ్ చేసింది.

మహారాష్ట్ర ఎన్నికలు ముగిసి ఏడునెలలుదాటినా అకారణంగానో, సకారణంగానో వార్తల్లో ఉంటోంది. ఎన్నికలు జరిగినప్పటినుంచి, ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది, నిలదీస్తోంది. పోలింగ్‌బూతుల వెలుపల భారీ క్యూలైన్లు ఏమీ లేకుండానే, ఆఖరునిముషంలో పడిన లక్షలాది దొంగ ఓట్లతో బీజేపీ కూటమి అధికారంలోకి రాగలిగిందని రాహుల్ కొన్ని లెక్కల ఆధారంగా విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల సంఘంతో వ్యవహారాలూ, అవసరమైతే వివాదాలూ నడిపేందుకు నాయకులు, నిపుణులతో కూడిన 'ఈగిల్' గ్రూప్‌ను కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈగిల్, ఈసీల మధ్య ఉత్తరప్రత్యుత్తరాల యుద్ధం సాగుతోంది. మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని సాధించి, శోధించి, మధించి ఈసీని నిలదీయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పోతోంది. ప్రధానంగా లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి పెద్దగా ఓట్లుపడని స్థానాల్లో ఓటర్లసంఖ్య అసెంబ్లీ ఎన్నికల నాటికి ఒక్కసారిగా హెచ్చిందని, ఈ రెండు ఎన్నికల మధ్యకాలంలో రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 92.9 మిలియన్ నుంచి 97 మిలియన్‌కు పెరిగిందని, ఐదునెలల్లోనే ఈ పెరుగుదల 4.1 మిలియన్ ఉన్నదని కాంగ్రెస్ లెక్కలు విప్పుతోంది. అంతకుముందు ఐదేళ్ళ

ఈసీపై ఈగిల్ పోరు!

కాలంలో ఈ పెరుగుదల 3.1 మిలియన్ మాత్రమే ఉన్నందున కాంగ్రెస్ విమర్శ పూర్తిగా కాదనలేనిది. ఈ ఆరోపణలు నిరాధారమని వివరంగా మాట్లాడుకుందాం రమ్మని రాహుల్‌ను ఈసీ పిలిచినా ఆయన వెళ్ళలేదు. ఓటర్ డేటా, సిసిటీవీ ఫుటేజ్ ఇత్యాది కీలక వివరాలు దక్కేవరకూ ఈసీ మెట్లు ఎక్కేది లేదని కాంగ్రెస్ అంటోంది.

ఐదునెలల్లోనే ఓటర్ల సంఖ్య అంతగా ఎలా పెరిగిందన్న ప్రశ్న కంటే, పోలింగ్ సమయం ముగిసిన ఐదుగంటలకు తాత్కాలిక అంచనాల ప్రకారం పోలైన ఓట్ల శాతం 58.22 ఉండగా, మర్నాడు ఉదయానికి అది 66.05శాతం ఎలా అయిందన్నది మంచి ప్రశ్న. ఇంకా ఓట్లు వేయాల్సి ఉన్నవారి భారీ క్యూలైన్లు కనిపించకున్నా, 7.83శాతం పెరుగుదల నమోదైందని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. అంటే, పోలింగ్‌వేళలు ముగిసిన తరువాత 76లక్షలమంది ఓటేశారని అర్థం. పోలింగ్ గడువు ముగిసే సమయానికి ఓట్లేసిన, ఆ తరువాత ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్ల సంఖ్య మధ్య తేడా గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒకశాతం లోపే ఉండటం గమనార్హం. మహారాష్ట్రలోని లక్షపోలింగ్ కేంద్రాల్లో కేవలం 85 నియోజకవర్గాల్లోని 12వేల పోలింగ్ బూత్‌లలో మాత్రమే అదనపు పోలింగ్ జరగడం కాంగ్రెస్ విమర్శలకు కారణం. లోక్‌సభ ఎన్నికలలో ఈ నియోజకవర్గాల్లోనే ఎన్డీయే కూటమి వెనుకంజవేయడం, అసెంబ్లీ ఎన్నికల్లో ఈ 85సీట్లలోనే ఆ కూటమి అత్యధికస్థానాలు గెలుచుకోవడం కాంగ్రెస్ అనుమానాలకు కారణం.

పోలింగ్ బూతులకు సంబంధించిన సిసిటీవీ ఫుటేజ్, డిజిటల్ ఓటర్ లిస్ట్ కోసం కాంగ్రెస్ పట్టుబడుతున్న ఈ నేపథ్యంలోనే, ఎన్నికల సంఘం మే30వతేదీన జారీ చేసిన ఆదేశాలు ఆశ్చర్యం కలిగించాయి. ఫలితాలు ప్రకటించిన నలభైఐదురోజుల్లోగా కోర్టుల్లో కేసులేమీ నమోదుకాని పక్షంలో అన్ని రకాల విడియో ఫుటేజ్‌ను ధ్వంసం చేయవచ్చునని రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు ఇచ్చింది. విడియోల దుర్వినియోగాన్ని నివారించడానికే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈసీ చెప్పింది. కాంగ్రెస్ ఆరోపణలను కొట్టివేయడం వల్లనో, ప్రతివిమర్శలతో సరిపుచ్చడం వల్లనో ఈసీకి ఒనగూరే లబ్ధి ఏమీ ఉండదు. ఎన్నికల ప్రక్రియమీద ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని వమ్ముచేసే అధికారం కాంగ్రెస్ సహా ఏ పార్టీకీ లేదు. మహారాష్ట్రలో అంతా సవ్యంగానే జరిగిందని ఈసీ నమ్మకంలో నిజం ఉండవచ్చు. కాంగ్రెస్ ఆరోపిస్తున్న అక్రమాలు, కుట్రలకు తావులేకుండా ఆ ఎన్నికలు జరిగివుండవచ్చు. కానీ, కాంగ్రెస్ ప్రస్తావిస్తున్న అన్ని రకాల డేటా, విడియోలతోనే ఈసీ ఆ విమర్శలను తిప్పికొట్టినప్పుడు ప్రజల్లో నమ్మకం కలుగుతుంది, ఈసీ ప్రతిష్ఠ ఇనుమడిస్తుంది.

ఆర్థిక పరిపుష్టికి కీలకం 'ఎమ్ఎస్ఎమ్ఈ'లే!

దేశ ఆర్థిక మూలాలను నిలబెడుతున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎమ్ఎస్ఎమ్ఈలకు) నేటికీ తగిన ప్రభుత్వ ప్రోత్సకాలు అందటం లేదు. నిజానికి భారత స్థూల జాతీయోత్పత్తిలో సూక్ష్మ–చిన్న–మధ్యతరహా పరిశ్రమల వాటా 30 శాతం. ఇది రాబోయే రెండేళ్లలో, అంటే 2027 వరకు, 35శాతం వరకు పెరగవచ్చునని నిపుణుల అంచనా. దేశ మొత్తం ఎగుమతుల్లో వీటి వాటా 40శాతం. అలాగే ఉద్యోగ కల్పనలో కూడా వీటి వాటా సింహభాగమే. దాదాపుగా 11 కోట్ల మందికిపైగా సూక్ష్మ–చిన్న–మధ్యతరహా పరిశ్రమలలో ఉపాధి పొందుతున్నారు. రాబోయే ఐదేళ్ళల్లో ఈ సంఖ్య 15 కోట్లకు చేరుతుందని అంచనా. అంతేగాక మొత్తం పారిశ్రామిక ఉత్పత్తుల్లో 45శాతం వీటి నుంచే వస్తున్నాయి. వీటి పాత్ర ఆర్థిక గణాంకాలకే పరిమితం కాదు. ఇవి ఎక్కువగా చిన్న లేదా మధ్య తరహా పట్టణాల్లో విస్తరించి ఉండటం వలన ఆయా ప్రాంతాల స్థానిక ఆర్థిక సామాజిక అభివృద్ధిలోనూ, ఉద్యోగ ఉపాధి కల్పనలోనూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. అభివృద్ధి వికేంద్రీకరణలో ముఖ్యపాత్ర పోషిస్తూ ఆయా ప్రాంతాల్లో సామాజిక ఆర్థిక అంతరాలను తగ్గిస్తున్నాయి.

దేశీయ అంతర్జాతీయ వ్యాపార ప్రపంచం, మార్కెట్ అవసరాలు రోజు రోజుకీ చాలా వేగంగా మార్పు చెందుతున్న ప్రస్తుత కాలంలో ఆ మార్పులకు అనుగుణంగా, అంతే వేగంతో అందుబాటులో ఉన్న స్థానిక మానవ వనరులతో, తక్కువ పెట్టుబడితో నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు చేయడం కూడా ఎమ్ఎస్ఎమ్ఈల వల్లనే సాధ్యం. వేగంగా మారుతున్న వినియోగదారుల, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తక్షణమే స్పందించి అంతే వేగంగా సునిశితమైన సృజనాత్మకతతో ఉత్పత్తులను, సేవలను అందించగల నిర్మాణ సామర్థ్యం గలవి ఈ ఎమ్ఎస్ఎమ్ఈలే. అలాగే ఆర్థిక మాంద్యం వంటి ప్రతికూల పరిస్థితులలోనూ వేగంగా తిరిగి నిలబడే శక్తి సామర్థ్యాలు వీటికే ఉన్నాయి.



చైనా లాంటి దేశాలు ఈ రంగం ప్రాధాన్యతను ఎంతో ముందుగానే గుర్తించాయి. అక్కడ ఈ రంగానికి తక్కువ వడ్డీతో తక్షణ రుణాల మంజూరు, పన్ను మినహాయింపులు, సాంకేతిక శిక్షణ, అంతర్జాతీయ మార్కెట్‌కు చేరువ చేసేలా డిజిటల్ మేళాల నిర్వహణ, భూమి నీరు విద్యుత్ రహదారి మార్గాల వంటి మౌలిక సదుపాయాల కల్పన... ఇవన్నీ ప్రభుత్వమే అందించి స్థానికంగా పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేసింది. ఈ చర్యల వల్ల చైనా నేడు రాజకీయంగా, ఆర్థికంగా యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేయగలిగే స్థితిలో ఉంది.

కానీ మన దేశంలో ఈ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, పథకాలు, సబ్సిడీలు ఇంకా క్షేత్ర స్థాయికి చేరడానికి ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు ఉన్నాయి. అందువలనే ఈ రంగం నుంచి పూర్తి స్థాయిలో ఫలితాలు పొందలేకపోతున్నాం. బ్యాంకుల నుంచి రుణాల మంజూరులో జాప్యతని తగ్గించి, తగిన మౌలిక సదుపాయాలు కల్పించి, స్థానికంగా లభించే ముడి సరుకుని బట్టి పారిశ్రామిక క్లస్టర్‌లను ఏర్పాటు చేసి, డిజిటల్ వర్చువల్ మేళాలు నిర్వహించడం వంటి చర్యలు ఇక్కడ కూడా చేపట్టాలి. వాటిని వ్యవస్థీకృత మార్కెట్‌కి అనుసంధానించే చర్యలు చేపట్టాలి.

ఈ రంగానికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తమ తమ బడ్జెట్లలో ఇతోధిక స్థాయిలో కేటాయింపులు జరపాలి. దేశ యువత ఉద్యోగార్థులుగా మాత్రమే మిగిలిపోకుండా, ఉద్యోగదాతలుగా మారేందుకు అన్ని సదుపాయాలు కల్పించాలి. పాఠశాల కళాశాల స్థాయి నుంచి అవగాహన, ప్రోత్సాహం అందించాలి. సూక్ష్మ–చిన్న–మధ్యతరహా సంస్థల విజయగాథలను పౌరులు పాఠశాల దశ నుండే తెలుసుకునేట్టు వాటిని పాఠ్యాంశాలుగా చేర్చాలి. ఈ రంగానికి ప్రభుత్వాలు, విద్యావ్యవస్థ, బ్యాంకింగ్ రంగం, వ్యాపార సంఘాలు, మీడియా కూడా తమ వంతు సహాయాన్ని అందిస్తే మన దేశానికి ఉన్న అపరిమిత సహజ మానవ వనరులతో అనతి కాలంలోనే భారత్ ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించగలదు.

– కందుల నరేంద్రనాథ్ దత్

లఘు ఉద్యోగ భారతి జనరల్ సెక్రెటరీ, తెలంగాణ

(నేడు అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవం)

ప్రజాస్వామ్య త్రాసులో మోదీ, ఇందిర



ఈ జూన్ తొలినాళ్లలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన దైనందిన ట్వీట్లలో Emergency@11 అనే హ్యాష్ ట్యాగ్‌ను ఉపయోగించడం ప్రారంభించారు. అధికారంలో ఉన్నవారు వివిధ తప్పులు, పొరపాట్లు, నేరాలకు పాల్పడ్డారని ఆ పోస్ట్‌లలో ఆయన ఆరోపించారు. ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితికి ఈ జూన్ ఆఖరివారంలో యాభై సంవత్సరాలు పూర్తవనున్న సందర్భాన్ని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం తప్పక ఉపయోగించుకుంటుందనే తెలివిడితోనే జైరామ్ రమేశ్ ఆ హ్యాష్ ట్యాగ్‌ను ఉపయోగించారు. తద్వారా, ఇందిర అమలుపరిచిన ఎమర్జెన్సీ రెండేళ్ల కంటే తక్కువ కాలంలోనే ముగిసిందని, మోదీ నిరంకుశాధికార పాలన ఒక దశాబ్దానికి పైగా విస్తరించి, కొనసాగుతోందని రమేశ్ అభిప్రాయపడ్డారు.

ఇందిర ప్రధానమంత్రిత్వ కాలంలో నేను యుక్త వయస్కుడినయ్యాను. మోదీ ఏలుబడి రోజుల్లో వృద్ధాప్యంలోకి ప్రవేశించాను. నా వ్యక్తిగత అనుభవాలు, విద్యా విషయిక పరిశోధనల ఆధారంగా ఇందిర, మోదీ పరిపాలనా తీరుతెన్నులను తులనాత్మకంగా విశ్లేషించేందుకు ఈ కాలమ్‌ను ఉద్దేశించాను. రెండు భిన్న భావజాలాల నేపథ్యమున్న ఈ ఇరువురు ప్రధానమంత్రుల పరిపాలనల మధ్య ఐదు పోలికలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. తొలుత ప్రస్తావించవలసిన సామ్యం– ఇందిర వలే మోదీ సైతం రాజకీయ అధికారాన్ని తన వ్యక్తిపూజను పెంపొందించడానికి పూర్తి స్థాయిలో వినియోగించారు. పార్టీ, ప్రభుత్వం, రాజ్యం, జాతికి తానే సర్వస్వమని, వాటి మూర్తీభవించిన రూపమే తాను అన్న ప్రచారాన్ని ప్రోత్సహించారు. ఇందుకు పన్నుల రూపేణా ప్రజలు చెల్లించిన సొమ్మును విచ్చలవిడిగా వినియోగించారు.

రెండోది–ప్రజాస్వామిక పాలనకు కీలకమైన రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తిని బలహీనపరిచేందుకు ఇందిర వలే మోదీ సైతం దీక్షగా పనిచేశారు. 'నిబద్ధ న్యాయవ్యవస్థ' 'నిబద్ధ ఉద్యోగ స్వామ్యం' గురించి మొట్టమొదట మాట్లాడిన దేశ పాలకురాలు ఇందిర. మోదీ ఆ భావాలను అంగీకరించారు; తన సొంత రీతుల్లో అమలుపరిచారు. మోదీ లాంఛనంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించకపోయినప్పటికీ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం పట్ల ఇందిర వలే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సత్యాలు, వాస్తవాలను వెల్లడించవద్దని పత్రికారంగాన్ని ఇందిర బెదిరించారు; అబద్ధాలు చెప్పాలని మీడియాను మోదీ బలవంతపెట్టారు.

మూడవది– మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధాన మంత్రిని 'సమానులలో ప్రథముడు'గా పరిగణిస్తారు. అమెరికా అధ్యక్షుడు వలే మన ప్రధాన మంత్రి సర్వాధికారాలు చెలాయించేందుకు ఆస్కారం లేదు. అయితే ఇందిర తన కేబినెట్ సహచరులతో చర్చలు, సంప్రదింపులతో కాకుండా ఏకపక్ష నిర్ణయాలతో పాలన చేశారు. అధికార బాధ్యతల నిర్వహణలో ఆమె కేవలం ఒకే ఒక్క వ్యక్తి సలహాలు తీసుకునేవారు, పాటించేవారు. ఆ ఏకైక వ్యక్తి తొలుత పీఎన్ హక్సర్ కాగా ఆ తరువాత సంజయ్‌గాంధీ. ఇందిర వలే మోదీ సైతం ఒకే ఒక్క వ్యక్తిని సంప్రదిస్తారు, అతడి సలహాలనే తీసుకుంటారు. ఆ ఒకే ఒక్కడు అమిత్ షా. షాను మాత్రమే మోదీ విశ్వసిస్తారు. అమిత్ షా సైతం తన బాస్ వలే అపారదర్శక, నిరంకుశ పాలనాపద్ధతులకు అనుకూలుడు.

స్వతంత్ర భారతదేశ ప్రధానమంత్రులలో నిరంకుశత్వ స్వభావం సహజ ప్రవృత్తిగా ఉన్న ఇద్దరు ప్రధానమంత్రులు ఇందిరాగాంధీ, నరేంద్ర మోదీ. ఇందిర ప్రధానమంత్రిత్వంలో చీకటి అధ్యాయం–ఎమర్జెన్సీ పరిణామాలలో ఒకటైన 'వంశపారంపర్య అధికార హానికర ప్రభావం' వర్తమాన భారత రాజకీయాలపై కొనసాగుతూనే ఉంది. నిరంకుశాధికారిత, మెజారిటీవాద ధోరణుల ఏకీకరణ నరేంద్ర మోదీ పాలనా శైలి ప్రధాన లక్షణంగా ఉన్నది.

నాల్గవది– ఇందిర వలే మోదీ సైతం భారతీయ సమాఖ్య పాలనా విధానాన్ని నిస్సారం చేశారు. కాంగ్రేసేతర పార్టీల ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వాలను తొలగించేందుకు ఇందిర రాజ్యాంగ అధికరణ 356ను విచక్షణారహితంగా ప్రయోగించేవారు; పక్షపాత రహితంగా రాజ్యాంగ విధులు నిర్వర్తించాల్సిన గవర్నర్లను బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేసేందుకు లేదా విధేయంగా చేసుకునేందుకు మోదీ సర్కార్ ఉపయోగించుకుంటోంది.

ఐదవది– తన పాలనను సుస్థిరం చేసుకునేందుకు దేశ ప్రజలలో తీవ్ర జాతీయవాద భావోద్వేగాలను మోదీ రగిలించారు. భారతీయుల ఆకాంక్షలను తాను మాత్రమే నెరవేర్చగలనే భావాన్ని ప్రజల మనస్సుల్లో పాదుకొల్పేందుకు ఇందిర వలే మోదీ కూడా పార్టీని, రాజ్య వ్యవస్థను, మీడియాను పూర్తిగా ఉపయోగించుకున్నారు. శ్రుతిమించిన దేశ భక్తిని రెచ్చగొట్టడం ద్వారా తనపై వస్తున్న విమర్శలు దురుద్దేశపూర్వకమైనవని, వాటి వెనుక విదేశీ ప్రభుత్వాల ప్రమేయముందని మోదీ పదే పదే ఆరోపిస్తుంటారు. ఈ విషయంలో ఇందిర మరింత ముందుకు వెళ్లి మహోన్నత దేశభక్తుడు లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌ను 'పాశ్చాత్య దేశాల ఏజెంట్' అని ఆరోపించారు.



▪ రామచంద్ర గుహ

ఇందిర నియంతృత్వ పద్ధతులలో పాలించినప్పటికీ రాజ్యాంగం నిర్దేశించిన బహుళత్వ భారత్ భావనను మనసా వాచా కర్మణా సమర్థించారు. దేశ పౌరసత్వాన్ని భాష, మతం, జాతి పరంగా నిర్వచించని విశాల భావన అది. జవహర్‌లాల్ నెహ్రూ నిస్సందేహంగా నియమబద్ధమైన లౌకికవాది. ఆయన సైతం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఒక ముస్లిం నాయకుడు ముఖ్యమంత్రిగా నియమితుడు అయ్యేందుకు దోహదం చేయలేకపోయారు. తండ్రికి భిన్నంగా ఇందిర తన పాలనలో నలుగురు ముస్లిం నేతలను ముఖ్యమంత్రి పదవిలో నియమించారు. ఆపరేషన్ బ్లూస్టార్ అనంతరం సిక్కు మతస్తులు అయిన తన అంగరక్షకులను తొలగించేందుకు ఆమె నిర్ద్వంద్వంగా నిరాకరించారు.

ఇందిరకు పూర్తిగా భిన్నమైన పాలకుడు నరేంద్ర మోదీ. మెజారిటీవాదాన్ని మినహాయింపులు లేకుండా విశ్వసించే నాయకుడు. సహచర స్వయం సేవక్‌ల వలే హిందూ రాష్ట్ర నిర్మాణానికి దీక్షాదక్షతలు చూపుతున్న పాలకుడు. ఆయన సంకల్పించిన హిందూ రాష్ట్రంలో దేశ రాజకీయాలు, సాంస్కృతిక విలువలు, పాలనా పద్ధతులు ఎలా ఉండాలో పూర్తిగా మితవాద హిందువులు మాత్రమే నిర్ణయిస్తారు, నిర్దేశిస్తారు. ఈ హిందూ రాష్ట్రంలో ముస్లింలే కాకుండా క్రైస్తవులు సైతం ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉండాల్సిందే. మోదీ 11 సంవత్సరాల పాలన ఆయన నినాదం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' ఎంత కపటమైనదో బయల్పరిచింది. బీజేపీ 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికలలో లోక్ సభకు పంపించిన 800 మందికి పైగా ప్రజాప్రతినిధులలో ముస్లిం సభ్యుడు ఒక్కడంటే ఒక్కడు కూడా లేడు!

ఇందిర నికార్సయిన లౌకికవాది. మెజారిటేరియన్ మోదీకి పూర్తిగా భిన్నమైన నాయకురాలు. ఇక వారిరువురి మధ్య ఉన్న మరో ప్రధాన వ్యత్యాసం ఆమెకు అపకీర్తిని తెచ్చింది. అత్యవసర పరిస్థితి కాలంలో పార్టీలోను, ప్రభుత్వంలోను సంజయ్‌గాంధీని తనకు వారసుడుగా ప్రకటించారు. 1980లో విమాన ప్రమాదంలో ఆయన దుర్మరణం పాలయ్యారు. ఆ తరువాత ఆమె తన పెద్ద కుమారుడు రాజీవ్‌గాంధీని తనకు వారసుడుగా రాజకీయాలలోకి తీసుకువచ్చారు. అలా వారసత్వ రాజకీయాలను ఆమె కొనసాగించారు. ఈ అపాయకరమైన ఆచరణ కాంగ్రెస్ పార్టీ చరిత్ర, సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధమైనది.

భారతదేశ పురాతన రాజకీయపక్షాన్ని ఇందిర ఒక కుటుంబ సంస్థగా మార్చివేయడం ఇతర రాజకీయ పార్టీ నాయకులు కూడా అదే విధంగా వ్యవహరించేందుకు ప్రోత్సాహం కల్పించింది. శివసేన, డీఎంకే, అకాలీదళ్, టీఎంసీ అధినేతలు తమ తమ రాష్ట్రాల పేరు ప్రతిష్ఠలు పెంపొందించేందుకు ప్రథమ ప్రాధాన్యమిచ్చేవారు. ఇప్పుడు ఠాక్రే, కరుణానిధి, బాదల్, బెనర్జీ కుటుంబాల పాలనను శాశ్వతం చేసేందుకు మాత్రమే వారు ప్రాధాన్యమిస్తున్నారు!

మోదీ తల్లిదండ్రులు రాజకీయాలలో లేరు. ఆయనకు పిల్లలు లేరు. ఇది మోదీకి ఒక గొప్ప అనుకూలతను సమకూర్చింది. ఎన్నికలలో ఆయన విజయానికి తోడ్పడుతోంది. ప్రధాన మంత్రి పదవి విషయంలో ఆయనకు ప్రత్యర్థి అయిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా ఎంత సౌశీల్యుడు, సమున్నతుడు అయినప్పటికీ రాజీవ్, సోనియాగాంధీల కుమారుడు, ఇందిరాగాంధీ మనవడుగా మాత్రమే గౌరవాదరాలు పొందుతున్నారు. మోదీ స్వయం కృషితో ఎదిగిన రాజకీయ నాయకుడు అని, రాహుల్ కేవలం కుటుంబ వారసత్వంతో సమున్నత పదవికి పోటీపడుతున్న నాయకుడు అనే భావన ప్రజల్లో బలంగా ఉందన్న విషయం విస్మరించలేనిది. ఇది, గత మూడు సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి విశేషంగా తోడ్పడింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే బీజేపీని వ్యతిరేకిస్తున్న పార్టీల వంశపారంపర్య రాజకీయాల కారణంగానే మోదీ పార్టీ ప్రాభవ ప్రాబల్యాలు పెరుగుతున్నాయి. ఇదొక కఠోర వాస్తవం. హిందూ మెజారిటేరియన్ వాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నవారు కూడా ఆ వాస్తవాన్ని అంగీకరించేందుకు సుముఖంగా లేరు. ఇందిర ప్రధానమంత్రిత్వంలో చీకటి అధ్యాయం ఎమర్జెన్సీ పరిణామాలలో ఒకటైన 'వంశపారంపర్య అధికార హానికర ప్రభావం' వర్తమాన భారత రాజకీయాలపై కొనసాగుతూనే ఉంది.

స్వతంత్ర భారతదేశ ప్రధానమంత్రులలో నిరంకుశత్వ స్వభావం సహజ ప్రవృత్తిగా ఉన్న ఇద్దరు ప్రధానమంత్రులు ఇందిరాగాంధీ, నరేంద్ర మోదీ. ఎవరి పాలన ఎక్కువ చెడ్డది? భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉంది. స్వతంత్ర వెబ్‌సైట్‌లు, ప్రాంతీయ దిన పత్రికలు సత్యాన్ని ఎలా చెప్పాలో అలా చెప్పగలుగుతున్నాయి.

మే 2014 అనంతరం మితిమీరిన రాజకీయ జోక్యంతో మన రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి బాగా తగ్గిపోయింది. అధికారులు, దౌత్యవేత్తలు పాలకులతో చాలా వరకు రాజీపడ్డారు. ఉన్నతన్యాయ వ్యవస్థ స్వల్పంగా రాజీపడింది. పన్ను వసూళ్ల సంస్థలు, దర్యాప్తు సంస్థలు, రెగ్యులేటరీ ఏజెన్సీలు తమ రాజకీయ యజమానులకు మరింతగా 'నిబద్ధమయ్యాయి'. అలాగే ఎన్నికల సంఘం కూడా. బాగా ఆందోళనకరమైన విషయమేమిటంటే మోదీ పాలనలో మత సంకుచితత్వం బాగా పెచ్చరిల్లిపోతోంది. నిరంకుశాధికారితతో మెజారిటీవాద ధోరణుల కలయిక నరేంద్ర మోదీ పాలనాశైలి అత్యంత నష్టదాయక లక్షణంగా ఉన్నది. ఈ నష్టం తీవ్రమైనది, విస్తృతమైనది. ప్రధానమంత్రి పదవి నుంచి మోదీ అంతిమంగా నిష్క్రమించిన తరువాత కూడా పరిస్థితులను బాగుపరిచి పూర్వ స్థితికి తీసుకువచ్చేందుకు దశాబ్దాల కాలం పట్టవచ్చు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఆ దాడి.. వాస్తవం కాదు!

అత్యవసర పరిస్థితి అమలై యాభయ్యేళ్ళు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో నిర్బంధించిన మీసా డిటెన్యూలైన ఆర్ఎస్‌యు వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటరమణి, విరసం నేత వరవరరావుల వ్యాసాలలోని అనుభవాలకు సంబంధించి కొన్ని అంశాలను ప్రస్తావిస్తున్నాను. వెంకటరమణి చెప్పినట్లు లెఫ్ట్, రైట్ వంటి విభేదాలు లేకుండా, చివరకు ఆర్ఎస్ఎస్, జమాతే ఇస్లామి హింద్, ఆనంద్ మార్గ్ వంటి వారంతా కలిసి ఒక కుటుంబం మాదిరిగా ఉండేవాళ్లం. అయితే 50 ఏళ్ళు కావడంతో కొన్ని జ్ఞాపకాలు మసకబారి ఉండవచ్చు. వరవరరావు చెప్పినట్లు చెరబండరాజును మాజీ కేంద్ర మంత్రి ఆలె నరేంద్ర వెనుకగా వచ్చి కర్రతో కొట్టారనడం, తిరిగి నరేంద్రపై దాడి చేశారనడం వాస్తవం కాదు.

అలాగే వందేమాతరం పాటతో కోపగించుకున్నారనడం కూడా నిజం కాదు. భారతమాతను కించపరుస్తూ పాడడంతో పాతబస్తీకి చెందిన శివాజీరావు పవార్ ఆగ్రహంతో నిలదీశాడు. అయితే, సాయంత్రం వంటపాత్రలు ఇచ్చే దగ్గర జరిగిన వాగ్వివాదంలో వరవరరావు వంట చేసే పెనంపై కాలు వేయడంతో కోపం పట్టలేక, అన్నం వండే దానిపై కాలు వేస్తావా? అంటూ అందరూ ఉండగానే చెంపపై చేతితో కొట్టాడు. దాంతో కొంత అలజడి జరిగింది. తర్వాత, వీరిద్దరూ పేర్కొన్నట్లు భావజాలాన్ని బట్టి అక్కడ మెస్‌లు లేవు. వాస్తవానికి భావజాలాలు బట్టి కాకుండా వ్యక్తిగత అహంకారాలతో ఎక్కువగా వివాదాలు చెలరేగుతూ ఉండేవి. స్వాతంత్ర్య పోరాటంలో తన జైలు జీవితం గురించి రాస్తూ టంగుటూరి ప్రకాశం "నేను జైలులో పెద్దవారి చిన్న మనస్సులను, చిన్నవారి పెద్ద మనసులను చూశాను" అన్నారు. అంటే, బయట ఎంతో ప్రఖ్యాతులైన వారు జైలులో చిన్న చిన్న విషయాలలో సంకుచితంగా, మొండిగా వ్యవహరిస్తూ ఉండేవారు. ఇక్కడ కూడా అటువంటి ఘటనలు కొన్ని జరిగినా కొట్లాటల వరకు వెళ్లలేదు. ప్రతిరోజూ అందరం కలిసి చర్చాగోష్ఠులు నిర్వహించుకొనేవాళ్ళం. ఆ ప్రక్రియలోనే తరిమెల నాగిరెడ్డి మరణం సందర్భంగా సంతాప సభ జరిగింది. ఆ సభలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ వివిల్ దేశముఖ్ మాట్లాడటం అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

– చలసాని నరేంద్ర

సరిహద్దులు లేని సహానుభూతి

ప్రతి ఉదయం కాఫీ పెట్టుకుంటూ, 'గడచిన రాత్రి ఉక్రెయిన్, గాజా, కశ్మీర్, ఇజ్రాయెల్, ఇరాన్‌లో ఏమి జరిగి ఉండవచ్చు' అని ఆలోచనామగ్నుడనవుతాను. ట్యాబ్ ఓపెన్‌చేస్తే, కాంతులు విరజిమ్ముతూ ఆకాశంలో దూసుకువెళుతోన్న బాంబులు, క్షిపణులు దృశ్యమానమవుతాయి. ఆ కాంతులు రంగుల రంగేళీ కాదు, మృత్యుపాశాలంటూ నేలమట్టమైన భవనాలు, అంబులెన్స్‌లు, రక్తాలోడుతున్న చిన్నారులు, ఆసుపత్రులు, మృతదేహాలు నాకు గుర్తు చేశాయి. కాఫీ ముగించాను, బ్రౌజర్ విండో మూసివేశాను. ఆలోచనలను నా దైనందిన వ్యాపకాల మీదకు మళ్లించాను. సుదూర సంఘటనలపై కలతచెందుతున్న నేను ఒక్కసారిగా నా సొంత జీవితంలో లీనమయ్యాను, లిప్తపాటులో పరివర్తన చెందాను. దూర శ్రవణ సాధనంలో మరణమృదంగాన్ని చూశాను; అది 'గుండెల కొండలలో మారుమ్రోగుతుండగానే' బతికే క్షణాలలోకి వెళ్లిపోయాను.

మనం మన నిత్య జీవన కార్యకలాపాలను వదిలివేయాలని గానీ, సొంత భద్రత, ఆనందాల ఆరాటాన్ని ఆపివేయాలని కానీ నేను అనడం లేదు. మరి, ధ్వంసమవుతోన్న మానవతకు దిగ్భ్రాంతి చెందుతూనే ఇలా నిర్లిప్తంగా ఉండిపోవడం వివేకశీలురు చేయవలసిన పనేనా? కాదు. ఆత్మసంరక్షణ ప్రభావంలో హింసనచణ, ధ్వంసరచన దారుణాల నుంచి మానసికంగా దూరతీరాలకు వెళ్లిపోతాం. సామాజిక వేర్పాటు, భౌగోళిక ఎడబాటు సమకూర్చిన వెసులుబాటు ఇది. ఈ రక్షణాత్మక సౌలభ్యమే విశాల ప్రపంచ వేదనకు పరితాపం చెందడం నుంచి స్వీయ జీవితంలోకి వెళ్లేందుకు మనలను పురిగొల్పుతుంది.

ఆ అమానుషాలు, అకృత్యాలన్నీ భౌమ రాజకీయాలు, చారిత్రక వైరుధ్యాలు ప్రేరేపించిన ఘర్షణలనీ, వాటిని నివారించేందుకు మనమేమీ చేయలేమని రాజకీయవేత్తలు, రాజనీతిశాస్త్రవేత్తలు వక్కాణిస్తారు. అదొక అనివార్య, చారిత్రక పరిణామమని, నివారించలేని హాని అని మనసు లోలోతుల్లో ఒప్పుకున్నాం కనుక ఘర్షించుకుంటున్న వైరిపక్షాలలో ఒకదాని వైపు మొగ్గుతాం. భౌమ రాజకీయ వైఖరి తీసుకుంటాం. వెన్వెంటనే లోకం బాగోగులను పూర్తిగా ఉపేక్షించి నిత్య జీవన వ్యవహారాలలో తలమునకలవుతాం. సాగుతున్న యుద్ధాలు సజ్జనులు, దుర్జనుల మధ్య చెలరేగుతున్నవేనని మనకు మనం సంజాయిషీ ఇచ్చుకుంటూ 'అంతా ప్రారబ్ధం, విధిని ఎవరు తప్పించగలరు?' అన్న నిట్టూర్పుతో ఇది ముగుస్తుంది.

ఒక్కక్షణం మనలను వేరు చేస్తున్న ఈ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, భాషాసంబంధ, చారిత్రక నిర్దేశాలను తొలగించి చూడండి. అటువంటి అంతరాలు ఏవీలేవని, 'అంతరంగం అట్టడుగున అంతమందిమీ మానవులమే' అని స్పష్టమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతోన్న ఈ యుద్ధాలు, ఇతర బాధాకర సంఘటనలు మీకు, నాకు సంబంధించినవేనని అర్థమవుతుంది. వాతావరణ మార్పు మన విశ్వజనీనతను మనకు ఇప్పటికీ గుర్తుచేస్తున్నది. మనకు మనం కట్టుకున్న సకల అడ్డుగోడలకు అతీతంగా అది సర్వత్రా పరివ్యాప్తమై ప్రతి ఒక్కరినీ సతమతం చేస్తోంది. మన సంకుచిత మనస్తత్వం, కూపస్థ మండూక స్వభావం, అత్యాశలు, అధికార ఆరాటాలు, మరీ ముఖ్యంగా సహానుభూతి లేకపోవడమే మనం ఎదుర్కొంటున్న విపత్తులకు మూలమని క్లైమేట్ ఛేంజ్ విశదం చేస్తోంది. భౌమ రాజకీయ సమస్యలు సమస్తమూ మన వ్యక్తిగత (విలువలు, రాజకీయ అభిప్రాయాలు మొదలైనవి), స్థానిక (పర్యావరణ భద్రత, సామాజిక గతిశీలత, ఆర్థిక స్థితిగతులు మొదలైనవి) అంశాల నుంచే ప్రభవిస్తున్నాయి.

గాజా ఒక సుదూర సీమ కాదు,
ఉక్రెయిన్ ఒక్క రష్యా సమస్య కాదు.
కశ్మీర్ సంక్షోభం కేవలం ఉగ్రవాద
దుర్మార్గాల పర్యవసానమే కాదు.
ఎల్లెడలా అసంఖ్యాక ప్రజల
దురవస్థలకు మానవీయ
సంవేదనలతో ప్రతిస్పందించడంలో
మన అశక్తతను గాజా,
ఉక్రెయిన్ యుద్ధాలు
ఎత్తి చూపుతున్నాయి.



గత నెలలో మూడు విభిన్న స్థానిక ఘటనలు నా అనుభవంలోకి వచ్చాయి. ప్రజలను, ధరిత్రిని, విశాల ప్రపంచాన్ని ఎలా చూడాలో అవి నాకు నేర్పాయి. ఇటీవల ప్రముఖ తమిళ రచయిత, అనువాదకుడు ఎమ్ఎల్ తంగప్ప సన్మాన కార్యక్రమంలో పాల్గొనేందుకు పుదుచ్చేరి వెళ్లాను. ఈ సందర్భంగా 'ప్రజల సంగీత' కార్యక్రమం చూస్తారని నాకు చెప్పారు. ఆ కచేరీ ఒక భవనం టెర్రస్ మీద జరిగింది. నాకు అది ఒక సంగీత సమారాధన జరిగే ప్రదేశంలాగా కన్పించలేదు. ఈ అభిప్రాయం, బహుశా, నా సొంత సామాజిక పరిసరాలతో ప్రభావితమయి ఉండవచ్చు. కానీ, పలు సామాజిక, సౌందర్యాత్మక అవధులను అధిగమించిన సంగీతంతో ఆ కచేరీ శ్రోతలను అలరించింది. శాస్త్రీయ, జానపద, లలిత మొదలైన సంప్రదాయ రీతులను ఆ విలక్షణ సంగీత కచేరి విస్మరించింది. సాంస్కృతిక, ఉద్వేగాత్మక విభజనలన్నిటిని అధిగమించి విభిన్న శ్రోతలనందరినీ అలరించిన ఆ సంగీతం నాకొక విశాల భావోద్వేగ అనుభవం.

కలశపాక్కం తమిళనాడులో ఒక చిన్న గ్రామం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు ఆ పల్లెలోని 'సంప్రదాయ విత్తన కేంద్రం' నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నాను. దేవాలయం వెనుక భాగంలో ఉన్న ఒక సరస్సు తీరాన వేప వృక్షం నీడలో సమావేశమయ్యాం. పాతికేళ్లుగా ఆ చుట్టుపక్కల ప్రాంతానికి చెందిన సేంద్రియ వ్యవసాయదారులు ప్రతి నెలా అక్కడ సమావేశమై నైతిక వ్యవసాయం (ఆర్థిక ప్రయోజనాలతో పాటు జంతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యమిచ్చే సేద్యం), విత్తనాలు, సాగు విజ్ఞానాన్ని ఉచితంగా పంచుకోవడం, అవగాహనను పెంపొందించుకోవడం, సుస్థిర వ్యవసాయాభివృద్ధిని సాధించడం మొదలైన అంశాలపై మాటామంతీ జరుపుతారు. పేరాశకు తావులేని జీవన విధానాన్ని ఈ రైతులు దృఢంగా విశ్వసిస్తారు. తమ ఫలసాయాన్ని ఉచితంగా పంచుకుంటారు. భిన్నాభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేస్తారు, చర్చిస్తారు. వారి మధ్య రాజీ చేయ వీలులేని విభేదాలున్నా క్రమం తప్పకుండా సమావేశమవుతారు.

చెన్నైలో హైకోర్టు బార్ కౌన్సిల్ ఆడిటోరియంలో సమాఖ్య పాలనా విధానంపై జరిగిన ఒక సమావేశంలో పాల్గొన్నాను. వేదికపై పలువురు రిటైర్డ్, ప్రస్తుత న్యాయమూర్తులు ఉన్నారు. సభికులలో యువ న్యాయవాదులు, విభిన్న సామాజిక నేపథ్యాల నుంచి వచ్చిన వారున్నారు. ఆ యువ న్యాయవాదులలో అనేక మంది ప్రజాఉద్యమాలలో కార్యకర్తలుగా పనిచేస్తున్నవారు. చర్చ శక్తిమంతంగా జరిగింది. లోతైన రాజకీయ వివేచన, చారిత్రకవిశ్లేషణతో రాజ్యాంగ సంస్థల పనితీరులో లోపాలు, లొసుగులు ఎత్తి చూపుతూ ప్రసంగాలు జరిగాయి. పాలనా పద్ధతిగాను, సామాజిక సూత్రంగాను సమాఖ్య విధానంలో తమ విశ్వాసాన్ని దృఢంగా వ్యక్తం చేస్తూ పలువురు వెలువరించిన ప్రసంగాలను విన్నాను.

ఈ మూడు సంఘటనలూ– సంగీతకళాకారుల కచేరీ, వ్యవసాయదారుల సమాలోచన, న్యాయశాస్త్ర విజ్ఞుల చర్చ– ఒకదానితో ఒకటి సంబంధం లేనివిగా కనిపించవచ్చు. కానీ, తమతమ రంగాలలో కృషి చేస్తున్న వారిని సమైక్యపరిచేందుకు, సమష్టి కార్యాచరణకు ఒక ఉమ్మడి ప్రాతిపదికను కనుగొనేందుకు, జీవనసూత్రాలలో భాగమయ్యేందుకు జరిగిన విశిష్ట ప్రయత్నాలవి. వారందరూ విభిన్న 'స్థానిక' అంశాలతో వ్యవహరిస్తున్నవారే. సంగీతాన్ని సృష్టించడమేకాకుండా, ఆ శ్రావ్య కళను సృష్టించిన, ప్రదర్శించిన, వినియోగించిన సామాజిక, సాంస్కృతిక సందర్భాలలో మౌలిక గుణశీల మార్పును సాధించడమే పుదుచ్చేరిలోని యువ సంగీత కళాకారుల లక్ష్యం; ఆరోగ్యకరమైన, స్వయం పోషకమైన జీవన విధానం విషయమై తమ అనుభవాలు, పాఠాలను విశాల సమాజంతో పంచుకోవడమే కలశపాక్కం వ్యవసాయదారుల మనోరథం; సమాఖ్య పాలనా విధానంపై తమ చర్చలు, వాదనలు, నిర్ణయాలు న్యాయస్థానాలకే పరిమితమవకూడదనేది న్యాయమూర్తుల, న్యాయవాదుల ఆకాంక్ష.


గాజా సుదూర సీమ కాదు, ఉక్రెయిన్ రష్యా సమస్య మాత్రమే కాదు. కశ్మీర్ సంక్షోభం కేవలం ఉగ్రవాద దుర్మార్గాల పర్యవసానమే కాదు. బతుకు పరుగుల్లో పడి మన చుట్టుపక్కల సంభవిస్తున్న విషాదాలను విస్మరిస్తున్నాం, దురదృష్టకర పరిణామాలను ఉపేక్షిస్తున్నాం. అసంఖ్యాక ప్రజల దురవస్థలకు మానవీయ సంవేదనలతో ప్రతిస్పందించడంలో మన అశక్తతను గాజా, ఉక్రెయిన్ యుద్ధాలు ఎత్తి చూపుతున్నాయి. మన ఆలోచనలు మానవతా సంస్పర్శతో సాగాలంటే మన స్థానిక నిమగ్నతలు, బాంధవ్యాలు కేవలం స్వీయ సామాజిక ప్రపంచానికి పరిమితం కాకూడదు. విశాలమైనవి, పరిపూర్ణమైనవిగా అవి వర్ధిల్లాలి.



• టి.ఎమ్. కృష్ణ

కర్ణాటక సంగీతవేత్త

(ది టెలిగ్రాఫ్)





నేత్రపర్వంగా..



- ఘనంగా ప్రారంభమైన భద్రకాళిమాత శాకంబరీ ఉత్సవాలు
- తన్మయభరితం చేసిన సహస్ర కలశాభిషేకం
- తొలి రోజు కాళీక్రమం, కామేశ్వరీ పూజ
- లాంఛనంగా ప్రారంభించిన 'కుడా' చైర్మన్ ఇనగాల

6



అమ్మవారికి కలశపూజ చేస్తున్న అర్చకులు



భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

బాగోతం బట్టబయలు

- భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు
- డాక్యుమెంట్ రైటర్ల వద్ద లభించిన రూ. 96,800 సీజ్
- కొన్ని డాక్యుమెంట్లు మాయమైనట్టు గుర్తింపు



ఏసీబీ అధికారులు సీజ్ చేసిన నగదు

భీమదేవరపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లతో అక్రమ వసూళ్లకు కార్యాలయ సిబ్బంది పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు డీజీ(డైరెక్టర్ జనరల్) విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ డీస్పీ సాంబయ్య బృందం తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని డాక్యుమెంట్లను పరిశీలించారు.

అనంతరం ఏసీబీ డీఎస్పీ సాంబయ్య విలేకరులతో మాట్లాడారు. భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొంత కాలంగా డాక్యుమెంట్ల రైటర్లతో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల సందర్భంగా నలుగురు డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్నారన్నారు. కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు ప్రవేశం నిషేధం. అయినా నిబంధనలు ఉల్లంఘించి కార్యాలయంలో సిబ్బంది సహకారంతో ప్రవేశించారన్నారు. వారి వద్ద నుంచి రూ. 96,800 నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. 2023-24 సంవత్స రానికి సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లు మాయమయ్యాయని తేలిందన్నారు. ఈ డాక్యుమెంట్లు ఏమయ్యాయనే విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నామన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సైతం విచారణ జరుపుతున్నామన్నారు. ప్రభుత్వాధికారులు ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందిం చాలన్నారు. గురువారం రాత్రి 8 గంటల వరకు కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో శిథిలావస్థలో ఉన్న కొండ దేవాలయం


కోటలో గుళ్లు.. వెలిగేనా మళ్లీ!

కాకతీయుల కాలం నాటి ఓరుగల్లు కోటలోని అతి పురాతనమైన 20 గుళ్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవ తీసుకుంటున్నా.. కేంద్ర పురావస్తుశాఖ మాత్రం అనుమతి ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. ఈ గుళ్లకు మరమ్మతులు చేసి ధూప, దీప నైవేద్యం పథకం కిందకు తీసుకు వచ్చి నిత్యపూజలు జరిగేలా చర్యలు తీసుకునేందుకు దేవాదాయశాఖ ముందుకు వచ్చింది. కానీ కేంద్ర పురావస్తుశాఖ అధికారుల వైఖరి వల్ల అడుగు ముందుకు పడడటం లేదు. వారి తీరు కోటలోని గుళ్లకు శాపంగా మారింది.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ



లక్ష్మీ కొండల గుడి



వేంకటేశ్వర దేవాలయం

శిథిలావస్థలో వున్న ఆలయాల అభివృద్ధికి ప్రణాళిక

- పునరుద్ధరణ చేయాలంటే కేంద్ర పురావస్తుశాఖ అనుమతి తప్పని సరి
- ఏడాది కిందటే లేఖ రాసిన దేవాదాయ శాఖ.. ఇప్పటికీ కానరాని స్పందన
- అనుమతి వస్తే డీడీఎన్ వర్తింప చేయాలని మంత్రి సురేఖ నిర్ణయం
- వరంగల్ కోటలో జీర్ణోద్ధరణకు మొత్తం 20 ఆలయాల గుర్తింపు
- పునరుద్ధరణ జరిగితే కోటలో మళ్లీ వెలుగొందనున్న ఆధ్యాత్మిక వైభవం

మట్టికోటలోని లక్ష్మీకొండ గుడిని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ సెక్రెటరీ శైలజ అయ్యర్, వరంగల్ కలెక్టర్ సత్యశారద (ఫైల్)



వివరాలు : 7లో..

యువత మత్తుకు బానిసలుగా మారొద్దు

- మాదకద్రవ్యాల వాడకం, రవాణా నేరం
- దురలవాట్లతో విద్యార్థులు భవిష్యత్ నాశనం చేసుకోవద్దు
- సీపీ సన్‌ప్రీత్ సింగ్



మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమంలో పాల్గొన్న సీపీ సన్ ప్రీత్ సింగ్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

హసన్‌పర్తి, జూన్26(ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిసలుగా మారొద్దని పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ పోలీసుల ఆధ్వర్యంలో బీమారం ఎస్‌వీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సునుద్దేశించి సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడారు. మత్తు పదార్థాల వాడకం, రవాణా నేరమని వాటికి విద్యార్థులు ఎంతదూరంగా ఉంటే అంత మంచిదని సూచించారు. డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు అంధకారంగా మారడమే కాకుండా ఎంతోమంది నేరస్తులుగా మారి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల, వారి ప్రవర్తన పట్ల దృష్టిసారించి చెడు సహవాసాలకు దూరంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల క్రయ విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు యుద్ధం చేస్తున్నారని వారికి ప్రజలు సంపూర్ణ సహకారాన్ని అందించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. దురలవాట్లతో విద్యార్థులు తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు నర్సింహరావు, కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, శివకుమార్, రంజిత్‌కుమార్, రచయిత అంపశయ్య నవీన్, అచార్య రవికుమార్, అనిత, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూయార్క్‌లో జిగేల్‌మన్న 'రామప్ప'

- బిల్‌బోర్డుపై ఆలయ చిత్రాల పద్రర్శన
- నలిమెల అరుణ్ కుమార్‌కు అరుదైన గౌరవం

8

ఆటోడ్రైవర్ దారుణహత్య

- డబ్బుల బాకీ విషయమై గొడవలు
- పక్కా ప్లాన్‌తో బయటకు పిలిచి హత్య
- వడ్డెపల్లి ఎన్జీవోస్‌కాలనీలో అర్ధరాత్రి కలకలం

6



మహ్మద్ సాదిక్ (ఫైల్‌ఫోటో)

లేబర్ కోర్టు అదనపు గవర్నమెంట్ ప్లీడర్‌గా వెంకటరమణారెడ్డి



వరంగల్ లీగల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు అదనపు గవర్నమెంట్ ప్లీడర్‌గా నూకల వెంకటరమణారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామానికి చెందిన రమణారెడ్డి 1993 నుంచి జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు.

తెలుగులో పైడికి డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వలుస పైడికి సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న పర్యవేక్షణలో 'తెలంగాణలోని మాల ఉపకులాల సామాజిక సాంస్కృతిక జీవితం - సాహిత్య పరిశీలన' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి తెలుగు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ హనుమంతరావు పైడికి డాక్టరేట్‌ను ప్రకటించారు. కాగా పైడి రచయితగా ఇప్పటికే 11 పుస్తకాలు రచించగా, 2017లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని పొందారు.

కేయూ డిగ్రీ 5, 6వ సెమిస్టర్ ఫలితాలు వెల్లడి



ఫలితాలను వెల్లడిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల 5, 6వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మేరకు గురువారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లు పరిపాలన భవనంలో ఫలితాలను విడుదల సీడీని విడుదల చేశారు. ఐదవ సెమిస్టర్‌లో బీఎస్సీ, బీకామ్స్ బీఏ, బీసీఏ బీబీఏ కోర్సుల్లో 50.26 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. అలాగే 6వ సెమిస్టర్‌లో బీఎస్సీ, బీకామ్స్ బీఏ, బీసీఏ బీబీఏ కోర్సుల్లో 50.16 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. పరీక్షల ఫలితాలను కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, డాక్టర్ బి.నాగరాజు,డాకటర్ ఆసీం ఇక్బాల్, డాక్టర్ పద్మజ, కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, డాక్టర్ వి.మహేందర్, ఏఆర్ రామా వెంకటేశ్వర్లు, నాయకపు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలై 27 నుంచి కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలోని ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర రెగ్యులర్ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు జూలై 27 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 27, 28, 30, ఆగస్టు 1, 4, 6వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

అవినీతి ఊబిలో 'సొసైటీ'

- ఇన్‌చార్జి సీఈవోపై వసూళ్ల ఆరోపణలు
- నిధుల దుర్వినియోగంపై గత పాలకవర్గానికి నోటీసులు
- పీఏసీఎస్‌ను వెంటాడుతున్న వివాదాలు
- పట్టించుకోని సొసైటీ ఉన్నతాధికారులు
- రైతులకు దూరమవుతున్న సేవలు



శాయంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

శాయంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : శాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వివాదాలకు అడ్డాగా మారింది. సొసైటీ ఇన్‌చార్జి సీఈవో శంకర్ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఓవైపు.. సొసైటీలో అవినీతికి పాల్పడ్డారని పాత సీఈవో, చైర్మన్‌కు రికవరీ నోటీసులు మరో వైపుతో సొసైటీ నిత్యం వార్తల్లో నిలుస్తోంది. అయితే సొసైటీని జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆరోపణలు.. నోటీసులు..

తన వద్ద వసూళ్లకు పాల్పడ్డాడని ఇన్‌చార్జి సీఈవో పెరుగు శంకర్‌పై రేణుకుంట్ల పృథ్వీరాజ్ అనే రైతు డీసీవో సంజీవ్ రెడ్డికి ఫిర్యాదు చేశాడు. దీనిపై అధికారులు విచారణ చేశారు. ఇది జరుగుతుండగానే కొత్త లోన్‌కు వడ్డీలు కట్టాలని, లోన్ మాఫీ సమయంలో వడ్డీ సర్దుబాటు చేస్తానని ముగ్గురు రైతుల వద్ద శంకర్ వసూళ్లకు పాల్పడ్డారని ఇటీవల ఆరోపిస్తూ మందు డబ్బాలతో నిరసన చేసి, పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. అనంతరం ఇటీవల కలెక్టర్‌కు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గతంలో సీఈవోగా పనిచేసిన మోహన్, సొసైటీ చైర్మన్ కుసుమ శరత్‌లు వరిధాన్యం కొనుగోలులో ఎక్కువ ఖర్చు చూపి అవినీతికి పాల్పడ్డారని రూ.3లక్షల రికవరీకి నోటీసులు జారీ అయ్యాయి. గత పాలకవర్గం అవినీతికి పాల్పడిందని ఆడిట్‌లో బయటపడ్డా చర్యలు తీసుకోలేదని, కనీసం సొసైటీ నిధులు రికవరీ చేయలేని స్థితిలో ఉన్నతాధికారులు ఉన్నారని మండల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. నిధులు రికవరీ చేసి, చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దూరమవుతున్న సొసైటీ సేవలు

శాయంపేట సొసైటీ నుంచి రైతులకు గతంలో అతి తక్కువ ధరలకు యూరియా, డీఏపీ, సీడ్స్, ఫర్టిలైజర్స్ విక్రయించేవారు. ఈ క్రమంలోనే రూ.కోటి వరకు బిజినెస్ చేసేవారు. ఇందుకోసం 2028 వరకు సొసైటీకి లైసెన్స్ ఉంది. అయినప్పటికీ రైతులకు అత్యంత అవసరమైనవి తక్కువ ధరలో పొందే అవకాశం ఉన్నా సీఈవో, చైర్మన్ పట్టించుకోలేదు. వెంటనే సొసైటీ నుంచి విక్రయాలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సొసైటీని జిల్లాఅధికారులు పట్టించుకోవడం లేదని, జిల్లా కలెక్టర్ స్పందించి, సొసైటీని ప్రక్షాళన చేసి, రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కేశవమూర్తికి ఎన్టీఆర్ అవార్డు



కేశవమూర్తికి ఎన్టీఆర్ అవార్డును ప్రదానం చేస్తున్న మంత్రి సీతక్క

వడ్డెపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని విజయవాడకు చెందిన ఎక్స్‌రే సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ సీనియర్ జర్నలిస్టు, రచయిత గడ్డం కేశవమూర్తికి ఎన్టీఆర్ అవార్డును గత నెలలో ప్రకటించింది. అయితే అనివార్య కారణాల వల్ల ఆయన ఆ అవార్డును స్వీకరించలేదు. ఈ క్రమంలో సంస్థ వారు పంపించిన అవార్డును.. గురువారం ములుగులో మంత్రి సీతక్క చేతుల మీదుగా అందుకున్నారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క కేశవమూర్తిని శాలువాతో ఘనంగా సత్కరించి మెమొంటోతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, అధికారులు ఈ సందర్భంగా కేశవమూర్తిని అభినందించారు. ఈ అవార్డుకు సినీనటుడు రాజేంద్రప్రసాద్ కూడా ఎంపికయ్యారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో వాహనదారుడికి 10 రోజుల జైలుశిక్ష

మట్టెవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో వాహనదారుడికి 10 రోజుల జైలు శిక్ష, 18 మంది వాహనదారులకు రూ.26,200 జరిమానాను వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు గురువారం వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాజుకు 10 రోజుల జైలుశిక్ష విధించారు. రాజును హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. రాజస్థాన్‌కు చెందిన జేసీబీ వాహనం డ్రైవింగ్ చేస్తూ వరంగల్ ట్రాఫిక్ పోలీసులకు డ్రైవర్ రాజు పట్టుపడ్డారు. అతడిని బ్రీత్ అనలైజర్ మిషన్‌తో పరిశీలిస్తే రక్తంలో ఆల్కాహాల్ కంటెంట్ 550 ఎంజీ రీడింగ్ వచ్చిందని ట్రాఫిక్ సీఐ తెలిపారు. అదే విధంగా డ్రైవర్ రాజుకు డ్రైవింగ్ లైసెన్స్ లేదని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరు వాహనదారులకు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

28న స్పోర్ట్స్ పాఠశాలల్లో ప్రవేశాలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 28న జిల్లా స్థాయిలో క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించడానికి మరోసారి విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. రెండు రోజులుగా హనుమకొండ జిల్లా క్రీడా సమాఖ్య(డీఎస్ఏ) ఆధ్వర్యంలో జేఎన్ఎస్ వేదికగా ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీల్లో ఆశించిన మేర విద్యార్థులు హాజరు కాకపోవడంతో మరోసారి జిల్లా స్థాయిలో క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండల స్థాయిలో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోని వారు 1 సెప్టెంబరు 2016 నుంచి 31 ఆగస్టు 2017 మధ్య జన్మించిన బాలబాలికలు హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీల్లో నేరుగా పాల్గొనవచ్చన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను త్వరలో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపిక పోటీల్లో పాల్గొంటారని అశోక్‌కుమార్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు తమ ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, పాఠశాల నుంచి జారీచేసిన 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, 10 పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు వెంట తీసుకొని ఈనెల 28న ఉదయం 8 గంటలకు జేఎన్ఎస్‌లో హాజరు కావాలని అశోక్‌కుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9392997668 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫర్టిలైజర్ షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- రూ.15లక్షల విలువైన పురుగుల మందులు పట్టివేత
- గడువు తీరిన మందులను సీజ్ చేసిన అధికారులు



రేలకుంటలో ఫర్టిలైజర్ షాపు వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులు

నల్లబెల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామంలో సుధీర్ ఫర్టిలైజర్ షాపుపై టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్థానిక పోలీసులు గురువారం దాడులు చేసిన సంఘటన చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసుల, వ్యవసాయాధికారుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రేలకుంట గ్రామంలో సుధీర్ ఫర్టిలైజర్ షాపు గత 20 ఏళ్లుగా నడుస్తోంది. ఇక్కడి నుంచి డివిజన్, జిల్లా వ్యాప్తంగా ఎరువుల, పురుగుల మందుల రవాణా నడుస్తోంది. అయితే గడువు తీరిన పురుగుల మందులను గదుల్లో నిల్వ ఉంచినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలుసుకొని గురువారం దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో నానో యూరియా నిమాయిల్, ఫైటిసైడ్ తదితర లాంటి సుమారుగా రూ.15 లక్షల విలువ చేసే గడువు తీరిన పురుగుల మందులు ఉన్న రూమ్‌లను సీజ్ చేశారు. కాగా, ఫర్టిలైజర్ షాపు యాజమాని సుధీర్ అందుబాటులో లేడు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై వంశీకృష్ణ, స్థానిక ట్రైనీ ఎస్సై తేజ, మండల వ్యవసాయాధికారి బన్న రజిత, ఏఈవో శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా శివాలయం నిర్మాణం

- శ్రీశైలం ఆలయ ప్రధాన అర్చకుడు పూర్ణానందస్వామి
- తాటికొండలో ప్రత్యేక పూజలు



తాటికొండలో శివాలయం నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీశైలం ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణానందస్వామి

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : చరిత్రలో నిలిచిపోయేలా శివాలయం నిర్మాణం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయం ప్రధాన అర్చకులు పూర్ణానందస్వామి తెలిపారు. గురువారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ గ్రామ శివారులో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న శివాలయం పునర్నిర్మాణ పనులను పూర్ణానందస్వామి పరిశీలించారు. పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల గ్రామస్తులు ఆలయంలోని భారీ శివలింగంను ప్రత్యేక పూజలు ఆచరించి వెలికి తీసిన విషయం తెలిసిందే. ఆ శివలింగానికి ప్రత్యేక పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి పూర్వస్థలం బలంగా ఉందని పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ఆలయం నిర్మాణం జరుగుతుందన్నారు. ఎంతో పవిత్ర ప్రదేశమైనందును ఆలయం పూర్తయ్యాక భక్తుల ఇలవేల్పుగా ఆలయం మారుతుందని పూర్ణానందస్వామి తెలిపారు. అనంతరం ఆలయం పరిసరాలను, శ్రీసీతారామచంద్ర ఆలయంను పరిశీలించి స్వామివారిని దర్శించుకున్నారు. రామాలయంను దర్శించుకోవడానికి గాను గతంలో ఉన్న మెట్లు తొలగించడం సరికాదని వాటిని పునరుద్ధరించాలని సూచించారు. ప్రతీ ఆలయంకు ద్వారపాలకులను పూర్వకాలంలో నిర్మించారని, వాటిని తొలగించి ఆలయం ఎదుట మండపం నిర్మించడం వలన ఆలయానికి దోషం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. వచ్చే నెల 6న బావి పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో బేతి రాజిరెడ్డి, పండుగ బుచ్చయ్య, సుదర్శన్, వెంకటనర్సు, నారగోని శ్రీనివాస్ కిరణ్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అమ్మవారి శాకంబరీ ఉత్సవాలను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ ఇనగాల

నేత్రపర్వంగా...

- ఘనంగా ప్రారంభమైన భద్రకాళిమాత శాకంబరీ ఉత్సవాలు
- లాంఛనంగా ప్రారంభించిన 'కుడా' చైర్మన్ ఇనగాల

వరంగల్ కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక ఓరుగల్లులో ప్రసిద్ధి గాంచిన భద్రకాళి దేవస్థానంలో ఆరాధ్య దేవత భద్రకాళి అమ్మవారికి శాకంబరీ నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. 15 రోజుల పాటు కొనసాగే శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా అర్చకులు ఉదయం 4.30 గంటలకు నిత్యపూజ నిర్వహించి, ఉత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం హోమాలను నిర్వహించారు. మొదటి రోజు భద్రకాళి అమ్మవారికి ఉత్సవాల్లో భాగంగా మూల మంత్రంతో శాంతి హోమం, 1008 కలశాలతో సహస్ర కలశాభిషేకాన్ని, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలు, పసుపు కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని ఉదయం కాళీక్రమంలో పూజలు నిర్వహించారు.

అభిషేకం అనంతరం అమ్మవారికి మహా అలంకరణ చేసి సాయంత్రం కామేశ్వరీ మాతగా అలంకరించి మహా మంగళహారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సహస్ర కలశాభిషేకం హోమానికి బాసని విశ్వప్రకాష్ శోభ దంపతులతో పాటు పలువురు వైద్యులు సేవా దాతలుగా పాల్గొన్నారు. ఉదయం నుంచి పలువురు ప్రముఖులు, వ్యాపారులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం కమర్షియల్ ట్యాక్స్ డైరెక్టర్ హరిత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు, చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, పూర్ణచందర్, క్రాంతి, సతీష్, మయూరి, స్రవంతి, సుగుణ, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావుతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పీవీ విజ్ఞాన వేదిక పనులు

- రేపు వంగరలో పీవీ జయంతి ఉత్సవాలు



వంగరలోని పీవీ విజ్ఞాన వేదిక

భీమదేవరపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగర గ్రామంలో పీవీ విజ్ఞాన వేదిక పనులు యుద్ధ ప్రతిపాదికన కొనసాగుతున్నాయి. ఈ నెల 28న పీవీ జయంతి ఉత్సవాలు వంగరలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, జిల్లా అధికారులు హాజరు కానున్నారు. వంగరలో రూ. 7కోట్లతో పీవీ విజ్ఞాన వేదికకు నిధులు మంజూరయ్యాయి. గత ఐదేళ్లుగా వంగరలో పీవీ విజ్ఞాన వేదిక పనులు కొనసాగుతున్నాయి. ఈ సారి జయంతి వేడుకలకు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఈ మేరకు యుద్ధ ప్రతిపాదికన టూరిజం, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఐకేపీ తదితర అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. పీవీ విజ్ఞా న వేదికలో గార్డెనింగ్, విద్యుదీకరణ, రంగులు వేయడం, తదితర పనులను పూర్తి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఇప్పటికే పనులను తనిఖీ చేశారు. ఈనెల 28న పీవీ జయంతి ఉత్సవాలు జరగనుండగా, 27వ తేదీ సాయంత్రం వరకు పనులు పూర్తి చేసే విధంగా అధికారులు అందుబాటులో ఉండి పెద్దఎత్తున కూలీలతో పనులు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ దారుణ హత్య

- డబ్బుల బాకీ విషయమై గొడవలు
- పక్కా ప్లాన్‌తో బయటకు పిలిచి హత్య
- వడ్డెపల్లి ఎన్జీవోస్‌కాలనీలో అర్ధరాత్రి కలకలం



మహ్మద్ సాదిక్ మృతదేహం

హనుమకొండ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : డబ్బుల వివాదం ఒకరి హత్యకు కారణమైంది. హతుడు గతంలో ఒకరికి డబ్బులు అప్పు ఇవ్వగా అతడు మరణించడంతో ఆయన కుమారులపై ఒత్తిడి తెచ్చాడు. ఈ విషయమై కొన్నిరోజులుగా గొడవలు జరుగుతుండగా.. వారు బండరాళ్లు, ఇటుకలతో అతి కిరాతకంగా హత్యకు పాల్పడ్డారు. హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లి టీఎన్‌జీవోస్ కాలనీలో ఈ దారుణ హత్య జరిగింది. గురువారం సుబేదారి సీఐ ఎం. రంజిత్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లిలోని టీఎన్‌జీవోస్ కాలనీకి చెందిన మహ్మద్ సాదిక్(48)కు ఐదేళ్ల కిందట వివాహం జరిగింది, కుటుంబ గొడవలతో విడాకులు తీసుకున్న సాదిక్.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన ఓ వివాహితతో పరిచయం ఏర్పడి సహజీవనం చేస్తున్నారు. సాదిక్ నగరంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు.

ఇదిలా వుండగా, హనుమకొండకు చెందిన ఖాదర్ అనే వ్యక్తికి మహ్మద్ సాదిక్ రూ.3లక్షలు అప్పుగా ఇచ్చాడు. కొంతకాలానికి ఖాదర్ రూ.లక్ష తిరిగి ఇచ్చాడు. అయితేతర్వాత ఖాదర్ మరణించడంతో మిగతా డబ్బుల కోసం ఖాదర్ కుమారులు మహ్మద్ సొహైల్, మహ్మద్ బషీర్‌లపై మహ్మద్ సాదిక్ ఒత్తిడి తీసుకువచ్చాడు. దీనిపై వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి టీఎన్‌జీవోస్ కాలనీలోని అద్దె ఇంట్లో మహ్మద్ సాదిక్ నిద్రలో ఉండగా.. రాత్రి 11:30గంటల సమయంలో ఖాదర్ కుమారులు సొహైల్, బషీర్‌లు వచ్చారు. ఇంటి తలుపు కొట్టి మాట్లాడే పనిఉన్నదని చెప్పి సాదిక్‌ను తీసుకెళ్లారు. సిగ్మా కాలేజీ సమీపంలో ఉన్న శ్మశానవాటిక పక్కన ఉన్న సీసీరోడ్డుపై మాట్లాడుతుండగా వారి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. ఈ గొడవ జరుగుతున్న క్రమంలో సొహైల్ తన బాబాయి మహ్మద్ అక్రమ్‌కు ఫోన్ చేసి అక్కడికి రప్పించాడు. అక్కడికి వచ్చిన అక్రమ్‌తో కలిసి సొహైల్, బషీర్‌లు సాదిక్‌పై బండలు, ఇటుకలతో మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో సాదిక్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న సుబేదారి సీఐ రంజిత్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని హత్యకు సంబంధించిన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. హత్యకు గురైన సాదిక్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మహ్మద్ సొహైల్, బషీర్, అక్రమ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.రంజిత్‌కుమార్ తెలిపారు. నిందితులు పరారీలో ఉండగా, హత్యకు గురైన సాదిక్ మృతదేహానికి పోస్టుమార్టం కోసం ఎంజీఎంకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



వ్యాధుల కాలం.. జాగ్రత్త!

- దోమలు, ఈగలతో అప్రమత్తంగా ఉండాలి
- ఆహార పదార్థాలపై మూతలు తప్పనిసరి
- పొంచి ఉన్న ప్రాణాంతక రోగాలు
- ముందు జాగ్రత్తలతోనే ఆరోగ్య పరిరక్షణ

వర్ధన్నపేట రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో రకరకాల సీజనల్ వ్యాధులు ప్రజల్ని చుట్టుముడుతుంటాయి. నీటి కాలుష్యంతో జలుబు, దగ్గు, తుమ్ములు, వాంతులు, నీళ్ల విరేచనాలు వంటి రోగాలు అతలాకుతలం చేస్తాయి. దోమకాటుతో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, మెదడువాపు, చికెన్ గున్యాలాంటి విష జ్వరాలతో పాటు పైలేరియా వ్యాధులు వస్తాయి. వీటి బారిన పడి చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు అనేక ఇబ్బందులకు గురవుతారు. ఇప్పటికే ఆయా వ్యాధుల బారిన పడిన వారు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో క్యూ కడుతున్నారు. జ్వరం, గొంతునొప్పి, వాంతులతో ఆస్పత్రుల మెట్లు ఎక్కుతున్నారు. వాతావరణంలో జరిగిన మార్పులతోనే అధిక శాతం సీజనల్ రోగాల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. జ్వరం ఇతర లక్షణాలు ఎక్కువగా ఉంటే వెంటనే ఆస్పత్రులకు వెళ్లాలని లేకపోతే ప్రాణానికే ముప్పని చెబుతున్నారు.

టైఫాయిడ్ లక్షణాలు

ఎక్కువ రోజుల పాటు జ్వరం తీవ్రత, నీళ్ల, చీముబంక విరేచనాలు శరీరంలో ఉండే నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. దీనిని టైఫాయిడ్ లక్షణాలుగా గుర్తించాలి.

కలరా లక్షణాలు

నీళ్ల విరేచనాలు, వాంతులు, కావడం తద్వారా శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ అవుతుంది.

పచ్చ కామెర్ల లక్షణాలు

కాలేయానికి వాపు రావడం, కళ్లు పసుపు పచ్చగా మారడం, ఆకలి లేకపోవడం, నీరసంగా ఉండడం, పచ్చ కామెర్ల వ్యాధిగా గుర్తించాలి.

దోమకాటుతో విషజ్వరాలు



వర్షాకాలంలో దోమల బెడత తీవ్రమవుతుంది. ఎడతెరిపిలేని వానల కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారతాయి. ఖాళీ ప్రదేశాలు, మురికి గుంత లు, డ్రైనేజీల్లో నీటి నిల్వలు పేరుకుపోయి దోమల ఉత్పత్తి పెరిగిపోతుంది. దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి విష జ్వరాలతో పాటు పైలేరియా వంటి రోగాలు వస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కాచి చల్లార్చి వడపోసిన నీటిని మాత్రమే తాగాలి.
- వాంతులు, విరేచనాలు(కలరా)తో బాధపడుతున్న వ్యక్తికి గ్లాస్ నీటిలో ఒక స్పూన్ చక్కెర, చిటికెడు ఉప్పు, కలిపిన ద్రావణాన్ని లేదా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరచూ తాగించాలి.
- వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి.
- కలరా. టైఫాయిడ్, పచ్చకామెర్ల వ్యాధులతో బాధపడే రోగులను విడివిడిగా ఉంచాలి.
- రోగులకు సంబంధించిన గ్లాస్‌లు, ప్లేట్లు, కూడా విడిగా ఉండేలా చూసుకోవాలి.
- చిన్న పిల్లలకు మలం కడిగిన తల్లులు తమ చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- ఇంటి పరిసరాలతో పాటు ఇంటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి.
- నివాసాల సమీపంలోని మురుగు గుంతలను పూడ్చాలి. ఇంటిలో ఫినాయిల్‌తో ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి.
- వర్షాకాలంలో బయటి ఆహార పదార్థాలను తీసుకోకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- ఆహార పదార్థాలపై ఈగలు, క్రిములు వాలకుండా ఎప్పుడు మూతలు పెట్టి ఉంచుకోవాలి.
- వీధుల వెంట విక్రయించే తినుబండారాలను వర్షాకాలంలో దూరం పెట్టాలి.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

డాక్టర్ సోమశేఖర్, సీనియర్ సివిల్ సర్జన్



వర్షాకాలంలో పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు దూరం చేయవచ్చు. నివాసాలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవడంతో పాటు వేడి పదార్థాలను మాత్రమే తినాలి. ముఖ్యంగా చిన్న పిల్లల విషయంలో చాలా జాగ్రత్త తీసుకోవాలి. అస్వస్థతకు గురైనా వెంటనే సమీప వైద్యుడిని సంప్రదించాలి.

ఈగలతోనూ తప్పదు ముప్పు



వర్షాకాలంలో దోమల కంటే ఈగల కారణంగానే అనేక మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఈగలను చంపే మందు ప్రత్యేకంగా లేదు. ఈగకు కుట్టే గుణం లేకున్నా మెడికల్ ట్రాన్స్‌ఫర్ విధానం వల్ల రోగాలను తెచ్చిపెడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈగ ఎక్కడ వాలితే అక్కడ ఉమ్మేసే గుణం ఉండడంతో ప్రజల వద్దకు ప్రాణాంతక వ్యాధులను ఈ రకంగా మోసుకెళ్తుంది. వీటితో కలరా, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడతారు. దోమకాటుకు గురైన రోగులకు వ్యాక్సిన్ ద్వారా నయం చేయడానికి అవకాశాలున్నాయి.

ఈగల ద్వారా వచ్చే వ్యాధులను నివారించడానికి తలకుమించిన భారంగా మారుతుందని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలంలో ఈగలు వాలకుండా ఆహార పదార్థాలపై నిత్యం మూతలు పెట్టి ఉంచాలి. చల్లని పదార్థాల కంటే వేడి పదార్థాలనే ఎక్కువగా తీసుకోవడం మంచిది.

డ్యూటీకీ రాకుండానే హాజరు పట్టిలో సంతకాలు

- వారంలో రెండు మూడు రోజులే విధులు
- ఆర్జేడీ కార్యాలయంలో ఏ.డి తీరు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆర్జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అసిస్టెంట్ డైరెక్టర్ తీరు మారడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. విధులకు హాజరు కాకుండానే హాజరైనట్లు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నట్టు, వారంలో రెండు లేదా మూడు రోజులే హాజరవుతున్నా అన్ని రోజులకు సంతకాలు చేస్తున్నట్టు తెలిసింది. స్పౌజ్ కేటగిరిలో పనిచేస్తున్న సదరు అధికారి హైదరాబాద్ నుంచి వస్తూ ఇక్కడ విధులు నిర్వర్తించడం మరో చర్చనీయాంశంగా మారింది. వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే ఆఫీస్‌కు వస్తారని, వచ్చిన రోజైనా పూర్తిగా విధులు నిర్వర్తించకుండానే మధ్యాహ్నం 2, 3 గంటల మధ్యలో వెళతారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. ప్రైవేటు పాఠశాలలు, సర్వీస్ మ్యాటర్లు తదితర అంశాల్లో తనకు వచ్చే లెక్కలు మాత్రం పక్కాగా చూసుకొని వెళ్తారనే ఆరోపణలున్నాయి. సదరు అధికారి ఎఫ్ఆర్ఎ (ఫేస్ రికగ్నిషన్ యాప్) వివరాలను తనిఖీ చేస్తే అసలు విషయం బయటపడుతుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు అంటున్నారు. ఆర్జేడీ కార్యాలయం ఉత్తర తెలంగాణలోని 19 జిల్లాలకు పర్యవేక్షక కార్యాలయంగా కొనసాగుతోంది. ఆర్జేడీ నిత్యం జిల్లాల పర్యటనల్లో ఉంటుండటం ఈ అధికారికి అవకాశంగా మారిందనే విమర్శలున్నాయి. ఈ అధికారి గైర్హాజరు తీరుపై ఓ ఉపాధ్యాయ సంఘం హైదరాబాద్‌లోని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. అయితే అవేమీ పట్టనట్లు ఆమె వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

కటాక్షపూర్ బ్రిడ్జి నిర్మాణమయ్యేనా?



పునాది దశలోనే ఉన్న కటాక్షపూర్ బ్రిడ్జి నిర్మాణం

- కొనసా..గుతున్న నిర్మాణం
- మత్తడి వద్ద తరచూ ప్రమాదాలు
- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం
- వాహనదారులకు తప్పని తిప్పలు
- కాంట్రాక్టర్ కాలయాపన
- పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కటాక్షపూర్ మత్తడిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం నత్తకంటే అధ్వానంగా పనులు సాగుతున్నాయి. పెద్ద చెరువు మత్తడిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రధాన జాతీయ రహదారి కావడంతో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ రహదారి గుండానే నిత్యం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఉన్నతాధికారులు ప్రయాణిస్తుంటారు. వర్షాకాలం వచ్చిందంటే రెవెన్యూ అధికారులు, పోలీసులకు భయం.. భయంగా ఉంటుంది. ప్రతీ సంవత్సరం వాహనాలు మత్తడి దాటుతుండగా ప్రమాదాలు జరుగుతుంటాయి. రెవెన్యూ అధికారులు, పోలీసులు వానకాలమంతా ఇక్కడే ఉండి గజ ఈతగాళ్లు, తాళ్లు ఏర్పాటు చేసుకొని కంటిమీద కునుకు లేకుండా 24 గంటలు కాపాలా కాస్తుంటారు. వాహనదారులు కూడా మత్తడి దాటే సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దాటుతారు. ఈ పరిస్థితిని అప్పటి ఎమ్మెల్యే, ఇప్పటి మంత్రి కొండా సురేఖ మత్తడి పై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని 20 ఏళ్ల కిందటే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కటాక్షపురం మత్తడిని పలుమార్లు పరిశీలించారు. మంత్రి సీతక్క కూడా ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని భరోసా ఇచ్చారు. బీజేపీ నాయకులు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వంగాల సమ్మిరెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌గౌడ్‌లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఇక్కడి సమస్య తీవ్రతను వివరించారు. కిషన్‌రెడ్డి చొరవతో నాలుగు లేన్ల రోడ్డుతో పాటు మత్తడిపై బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రెండు సంవత్సరాల క్రితం వృద్ధి ప్రైవేట్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ కంపెనీ పనులు చేపట్టింది. ఇంతవరకు ఫోర్ లేన్ల రోడ్డు పనులు పూర్తి కాలేదు. నత్తకంటే అధ్వానంగా నిర్మాణం పనులు నాసిరకంగా నడుస్తున్నాయని హౌజుబుజుర్గు, కటాక్షపురం గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు లేకుండానే పనులు చేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. సైడ్ డ్రైనేజీలు మూడు నాళ్లకే విరిగిపోతున్నాయి. రోడ్డుపై వేసిన బీటీ లేచిపోతోంది. ప్యాచ్‌లుగా పగిలిపోతోంది. దీన్ని చూస్తున్న వాహనదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మాణం చేసే పనుల్లో నాణ్యత లేక పోతే మూడు నాళ్లకే శిథిలమవుతాయని వాపోతున్నారు. ఈ యేడు ఎన్ని ప్రమాదాలు జరుగుతాయేనని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సదరు కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకొని పనులను వేగవంతం చేయాలని వాహనదారులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గూడెప్పాడ్ క్రాస్ వద్ద దెబ్బతిన్న బీటీ రోడ్డు

అనుమతులు రావడం ఆలస్యమైంది

కటాక్షపురం మత్తడి 120 మీటర్ల పొడవు ఉంటుంది. దామెర మండలం నుంచి ములుగు జిల్లా గట్టమ్మ వరకు దాదాపు రూ.210 కోట్ల పైచిలుకుతో రోడ్డు నిర్మాణంతో పాటు కటాక్షపూర్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణమూ జరుగుతుంది. బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు రావడం ఆలస్యం కావడం వల్లనే నిర్మాణంలో జాప్యమవుతుంది. వచ్చే సంవత్సరం వరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుంది.

చేతన్, నేషనల్ హైవే ఏఈ

కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..



జాతీయ రహదారి రోడ్డు నిర్మాణం పనులకు కేంద్రం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణం పనుల్లో నాణ్యత లేకపోవడంపై అగ్రనేతల దృష్టి తీసుకెళ్తా. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని నాణ్యతతో కూడిన పనులు చేయిస్తాం. కటాక్షపూర్ మత్తడి నిర్మాణం పనులు ఆలస్యమయ్యే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ముత్యాల శ్రీనివాస్‌గౌడ్



కేసముద్రంలో తహసీల్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహిస్తున్న నారాయణపురం రైతులు

ఇకనైనా పట్టాలివ్వండి మహాప్రభో..

నారాయణపురం రైతుల డిమాండ్ - కేసముద్రం తహసీల్ ఆఫీస్ వద్ద వంటావార్పు

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం నారాయణపురంలో ఎంజాయ్‌మెంట్ సర్వే ఆధారంగా పట్టాదారు పాస్‌పుస్తకాలివ్వాలనే డిమాండ్‌తో ఆ గ్రామ రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట పొయ్యి ఏర్పాటు చేసి, భోజనం వండారు. ఈ సందర్భంగా పలువురు రైతులు బాధిత మాట్లాడారు. తాము 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను 2017 భూ ప్రక్షాళనలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామంలోని 1827 ఎకరాలను అటవీశాఖ భూములుగా పేర్కొంటూ పట్టాలన్నీ రద్దు చేసిందని తెలిపారు. అప్పటి నుంచి పలుమార్లు ఆందోళనల ఫలితంగా కొంతమందికి పట్టాలు వచ్చాయని, ఇంకా వెయ్యి ఎకరాల్లో సుమారు 700 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు రావాల్సిఉందని తెలిపారు.

ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో తమకు పట్టాలు రావడంలేదని ఆరోపించారు. ఇప్పటికే తాము ఏడేళ్లుగా రైతుబంధు, రైతుభరోసా, రైతుబీమా, రుణమాఫీ పథకాల్లో కోట్ల రూపాయలను నష్టపోయామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, మిర్యాల యాకూబ్ రెడ్డి, కొయగూరి రాంరెడ్డి, జాటోత్ వెంకన్న, బానోత్ భాషా, గుగులోత్ లక్‌పతి, బానోత్ శంకర్ పాల్గొన్నారు. రైతుల వంటావార్పు నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య పర్యవేక్షణలో ఇద్దరు ఎస్ఐలతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మెడికల్ కాలేజీ హాస్టల్‌లో పాము

భయంతో పరుగులు తీసిన విద్యార్థులు

మహబూబాబాద్ క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల బాలుర వసతి గృహంలో బుధవారం రాత్రి నాగుపాము కలకలం సృష్టించింది. బయ్యారం రోడ్డులో ఉన్న బాలుర వసతి గృహం గదిలోకి నాగుపాము సంచారాన్ని గమనించిన విద్యార్థులు భయంలో పరుగులు తీసి, ప్రిన్స్‌పాల్ లకావత్ వెంకటేష్‌కు సమాచారం అందించారు. వెంటనే ప్రిన్సిపాల్ స్నేక్ క్యాచర్ ఇమామ్‌కు సమాచారం అందించారు. స్నేక్ క్యాచర్ గంటపాటు శ్రమించి నాగుపామును పట్టుకొని సీసాలో బంధించాడు. దీంతో వసతి గృహంలో ఆశ్రమం ఉంటున్న మెడికల్ విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, జూన్ 3న ఇదే వసతి గృహంలోకి నాగుపాము వచ్చి చేరింది. తరుచూ నాగుపాములు, విష సర్పాలు, పురుగులు వసతి గృహంలోకి వస్తుండడంతో మెడికల్ విద్యార్థులు భయంతో వణికిపోతున్నారు. అధికారులు చొరవ తీసుకొని మెడికల్ కళాశాల హాస్టల్ ప్రాంగణంలో చెత్త తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.



బాలుర వసతి గృహంలో నాగుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ ఇమామ్

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

- కేసముద్రంలో నాలుగు కోర్సుల్లో 240 సీట్లు
- పూర్తిస్థాయిలో స్టాఫ్ ఏర్పాటుకు సన్నాహాలు
- ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ వెల్లడి

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో నూతన పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను నాలుగు రకాల కోర్సుల్లో పాలిసెట్ కౌన్సిలింగ్ ద్వారా విద్యార్థులు ప్రవేశం పొందే అవకాశం ఉందని కళాశాల ఓఎస్‌డీ బైరి ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ కళాశాలలో డిప్లొమా స్థాయి కోర్సుల్లో ప్రస్తుతం మంచి డిమాండ్ ఉన్న ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ, ఎంబేడెడ్ సిస్టమ్స్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. ఒక్కో కోర్సులో 60 చొప్పున 240 సీట్లు ఉన్నాయని, పాలిసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియలో ఈనెల 26 నుంచి వచ్చేనెల 1 వరకు ఆప్షన్ల ఎంపికలో కేసముద్రం కళాశాలను ఎంచుకొని ఆయా కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశం ఉందని తెలిపారు. కళాశాలలో అన్ని కోర్సులకు సంబంధిత సబ్జెక్ట్ లెక్చరర్లను పూర్తిస్థాయిలో నియమిస్తున్నారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల భవనాల నిర్మాణాలకు రూ.70కోట్లు మంజూరయ్యాయని, ఈ ఏడాది కళాశాల తరగతులు మాత్రమే ఉంటాయని, వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో గురుకులం ప్రారంభిస్తామని తెలిపారు.



కేసముద్రంలోని పాలిటెక్నికల్ కళాశాల బోర్డు

కోటలో గుళ్లు.. వెలిగేనా మళ్లీ!

- శిథిలావస్థలో వున్న ఆలయాల అభివృద్ధికి ప్రణాళిక
- ఏడాది క్రితమే లేఖ రాసిన దేవాదాయ శాఖ
- అనుమతి వస్తే డీడీఎన్ వర్తింపజేయాలని మంత్రి సురేఖ నిర్ణయం
- కోటలో జీర్ణోద్ధరణకు 20 ఆలయాల గుర్తింపు

(ఆంధ్రజ్యోతి, హనుమకొండ)

శత్రుదుర్భేద్యంగా నిర్మించిన ఓరుగల్లు కోటలో 365 శివాలయాలు అనేక గోపురాలతో ఆకాశమంత వ్యాపించి, మంగళబేరుల ధ్వనులతో నిండి దేవతా భవనాలతోనూ, వాటి విమానాలతోనూ కిక్కిరిసి ఓరుగల్లు నగరం శోభిల్లుతున్నది అని క్రీ.శ. 1290 నాటి ఖండవల్లి శాసనం చెబుతోంది. ఏకశాల, ద్విశాల, త్రికూట, చతుష్కూట, పంచకూట అనే వివిధరకాల ప్రణాళికలతో ఎరుపు, జేగురు, నల్ల రాతితో ఆలయ నిర్మాణాలు జరిగినట్టు అందులో పేర్కొన్నారు. దీనిని బట్టి కాకతీయుల కాలంలో ఆలయాల నిర్మాణానికి అలనాటి రాజులు ఎంత ప్రాధాన్యత ఇచ్చేవారో అర్థమవుతోంది. కాలగతిలో ఆ ఆలయాల్లో చాలా వరకు శిథిలమైపోయాయి.ఇప్పటికీ వాటి ఆనవాళ్లు కనిపిస్తాయి.

కనుమరుగైపోగా ఇప్పటికీ కొన్ని ఆలయాలు మిగిలి ఉన్నాయి. ఇవి పూర్తిగా జీర్ణావస్థకు చేరుకున్నాయి. అలాంటి ఆలయాలనే సుమారు 21వరకు కేంద్ర పురావస్తు శాఖ అధికారులు, చరిత్రకారులు చాలా కాలం కిందటే గుర్తించారు. ఆ ఆలయాలు ఏ దేవుళ్లకు సంబంధించినవి, వాటి చారిత్రక నేపథ్యం, ఎన్ని ఏళ్ల కిందట నిర్మాణమైంది? తదితర వివరాలతో రికార్డు చేశారు. వీటిని పునరుద్ధరించాల్సిన అవశ్యతను గుర్తుచేస్తూ ఐదేళ్ల కిందట చరిత్రకారులు కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలకు లేఖలు రాశారు.

మంత్రి సురేఖ చొరవ

ఓరుగల్లు కోట ప్రాంతం తూర్పు నియోజకవర్గం పరిధిలో ఉండడంతో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఈ ప్రాచీన గుళ్లపై దృష్టిసారించారు. వీటిని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. మంత్రి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ అధికారులు పరిశీలన జరిపి అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉన్న పద్నాలుగు గుళ్లను గుర్తించారు. రాతి కోట, మట్టికోటలో ఉన్న గుళ్లలో ఎక్కువగా శివాలయాలే ఉన్నాయి. నేలశంభుని గుడి, కొండగుడి, లక్ష్మికొండల గుడి వెంకటేశ్వరాలయం, రామాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలు గుర్తించిన వాటిలో ఉన్నాయి.



అభివృద్ధి చేయడానికి గుర్తించిన కోటలోని హనుమాన్ గుడి

కమిషనర్ సందర్శన

మంత్రి ఆదేశాల మేరకు కిందటేడు సెప్టెంబర్‌లో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శైలజా అయ్యర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వరంగల్ కోటలోని ఈ గుళ్లను పరిశీలించారు. వాటి ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేశారు. పునరుద్ధరణకు తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు.

గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలు జరపడంతో దాదాపు అన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. వేటిలోనూ దేవతా మూర్తులు లేరు. సంరక్షణ లేక ఇవన్నీ పూర్తిగా కనుమరుగయ్యే దశలో ఉన్నాయి. వీటిచుట్టూ దట్టంగా చెట్లు, ముళ్లపొదలు పెరిగాయి. కొన్ని గుళ్లకు వెళ్లడానికి దారే లేదు. శివాలయాల్లో శివలింగం ఒకచోట, పానవట్టాలు ఇంకో చోట చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. ఈ గుళ్లకు మరమ్మతులు చేసి వాటిని పూర్వస్థితికి తీసుకువచ్చి, నిత్యపూజల నిర్వహణకు గాను ధూప, దీప నైవేద్యం పథకం కిందకు తీసుకురానున్నట్టు మంత్రి సురేఖ పలు సందర్భాల్లో ప్రకటించారు. ఇటీవల వరంగల్ కోటను ప్రపంచ సుందరీమణులు సందర్శించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, భద్రకాళిగుడి సమీపంలో వేదపాఠశాల భవన శంకుస్థాపన సందర్భంగానూ వెల్లడించారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

శిథిలావస్థలో..

ఈ గుళ్లలో కొన్నిటిలో విగ్రహాలు విచ్ఛిన్నమయ్యాయి. మరికొన్నిటిలో అసలు విగ్రహాలే లేవు. గుళ్ల అభివృద్ధిలో వీటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలి. ఆ తర్వాత ఉత్సవమూర్తులకు ప్రాణప్రతిష్ఠ చేయాలి. అప్పుడే నిత్యపూజారాధనలకు అవకాశం ఉంటుంది. దీంతోపాటు ఈ గుళ్ల వద్దకు చేరుకోవడానికి రహదారులను నిర్మించాల్సి ఉంటుంది. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయా లి. వీటిలో ధూప, దీప నైవేద్యం పథకం కింద అర్చకులను నియమించినట్లయితే నిత్యపూజలు జరిగి కళకళలాడుతూ కనిపిస్తాయి. ఇవన్నీ చేయాలంటే ముందు కేంద్ర పురావస్తుశాఖ అనుమతి కావాలి. అప్పుడే అవిపూర్వవైభవాన్ని సంతరించుకుంటాయి. అయితే కేంద్ర పురావస్తుశాఖ అనుమతివ్వడంపైనే సందేహాలు నెలకొన్నాయి. ఈ శాఖ తన పరిధిలో ఉన్న ఆలయాలను తన సొంత నిధులతో తమ శాఖకు చెందిన ఇంజనీరింగ్ నిపుణులతోనే మరమ్మతులు చేస్తోంది. హనుమకొండలోని వేయిస్తంభాల గుడి ఆవరణలోని కళ్యాణ మండపం పునరుద్ధరణే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. కేంద్ర పురావస్తుశాఖ అంత తేలిగ్గా అనుమతిచ్చే అవకాశాలు లేనందువల్ల కోటలోని గుళ్ల అభివృద్ధిపై నీలినీడలు పరుచుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తే తప్ప.. ఇది సాధ్యం కాదని ఖిలా వరంగల్ వాసులు అభిప్రాయపడుతున్నారు.

కేంద్ర పురావస్తు శాఖకు లేఖ

కోటలోని గుళ్లన్నీ కేంద్ర పురావస్తుశాఖ పరిధిలో ఉన్నాయి. వీటికి జీర్ణోద్ధరణ చేయాలంటే ముందుకు ఆ శాఖ అనుమతి తీసుకోవలసి ఉంటుంది. ఈ మేరకు వరంగల్ కలెక్టర్ కోటలోని పాడుబడిన దేవాలయాల పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలతో దేవాదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. కమిషనర్ ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి ఈ గుళ్ల పునరుద్ధరణకు అనుమతి కోరుతూ ఢిల్లీలోని కేంద్ర పురావస్తు శాఖకు లేఖ రాసింది. ఇప్పటికీ ఏడాదవుతున్నా శాఖ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో ఈ ఆలయాల అభివృద్ధిలో జాప్యం జరుగుతోంది. కేంద్ర పురావస్తుశాఖ అనుమతి ఇస్తే తప్ప ఈ గుళ్లను దేవాదాయశాఖ ముట్టుకునే అవకాశం లేదు.

కేయూ స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్

కేయూ క్యాంపస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ ఇన్‌చార్జిగా కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, వర్సిటీ పరిపాలన భవనంలో నిరంజన్ శ్రీనివాస్‌కు వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులను అందచేసి అభినందించారు.

ఆర్వోబీపై ట్రాఫిక్ జామ్

కాజీపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఆర్వోబీపై గురువారం ట్రాఫిక్ జామ్ అయింది. బ్రిడ్జిపై బస్సు మరమ్మతుకు గురై ఆగిపోయింది. దీంతో బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించే వారికి ఆటంకం ఏర్పడింది. స్కూల్ వదిలిపెట్టే సమయం కావడంతో బ్రిడ్జికి ఇరువైపులా కిలో మీటర్ల దూరంలో ట్రాఫిక్ జామైంది. ట్రాఫిక్ పోలీసులు దెబ్బతిన్న బస్సును కిందకు తీసుకువచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు. సుమారు గంట పాటు ట్రాఫిక్ జామైంది.

ఉజ్వల భవిష్యత్‌ను డ్రగ్స్‌కు బలిపెట్టొద్దు

- కాకతీయ యూనివర్సిటీ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- పలుచోట్ల సదస్సులు, ర్యాలీలు
- మాదకద్రవ్యాలతో దుష్ఫలితాలను వివరించిన టీచర్లు, పోలీసులు, అధికారులు

కేయూ క్యాంపస్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత ఉజ్వల భవిష్యత్‌ను డ్రగ్స్‌కు బలిపెట్టవద్దని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. గురువారం కేయూ సెనెట్ హాల్‌లో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ కె.పట్టాభిరామారావు, పాలక మండలి సభ్యులు డాక్టర్ కరుకాల అనితారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. కేయూ డ్రగ్స్‌ఫ్రీ వర్సిటీ అని చెప్పారు. డ్రగ్స్ కుటుంబం, సమాజం, దేశంపై ప్రభావం చూపుతుందని అన్నారు. జడ్జి కె.పట్టాభిరామారావు మాట్లాడుతూ.. డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ.. డ్రగ్స్‌పై యువత అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు కనిపెడుతూ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన షార్ట్‌ఫిలిమ్ ఆకట్టుకుంది. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్స్ అందచేసి అభినందించారు. 'యాంటీ డ్రగ్స్‌సే-నో టూ డ్రగ్స్' ఆవిష్కరించారు. డ్రగ్స్‌పై 1908 ఫోన్ చేయాలని కోరారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ టి.రాధిక స్వాగతం పలుకగా డాక్టర్ సుజాత వందన సమర్పణ చేశారు.



కేయూలో మాట్లాడుతున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



మడికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

- అంతర్జాతీయ డ్రగ్స్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కేయూ గ్రంథాలయం మెంబర్ ఇన్‌చార్జి డాక్టర్ బి.రాధికారాణి నేతృత్వంలో డ్రగ్స్ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, గ్రంథాలయ అధికారులు ఇసాక్ ప్రభాకర్, జావీర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరంగల్ మెడికల్ : అంతర్జాతీయ మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గురువారం కూరపాటి హాస్పిటల్, కాకతీయ మెడికల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీ కేఎంసీ వద్ద ప్రారంభమై పోచమ్మమైదాన్ మీదుగా ఎంజీఎం వరకు సాగింది. ఈ ర్యాలీని కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. మత్తుపదార్థాల వాడకాన్ని వ్యతిరేకంగా అందరు ఏకంగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ నవీన్, వైద్యులు, వైద్య విద్యార్థులు, సామాజిక వేత్తలు, కూరపాటి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మడికొండ: మాదక ద్రవ్యాల నిరోధంపై గురవారం మడికొండ పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల, కాలేజీ విద్యార్థులతో మడికొండ పోలీస్‌స్టేషన్ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఇన్‌స్పెక్టర్ పి.కిషన్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు అలవాటుతో జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ జయరాజు, జంపయ్యతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి: మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత ముందుండాలని పింగిళి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, యాంటీ డ్రగ్స్ కమిటీ కోఆర్డినేటర్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ బండారి సువర్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మమత, కవిత, రమ రత్నమాలతోపాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- కలెక్టర్ స్నేహ శబరీష్
- డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిస కావొద్దని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీసు, తదితర ప్రభుత్వ శాఖలతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లతో నక్కలగుట్ట నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. ర్యాలీని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్‌పాండే జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ అదాలత్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. 15 ఏళ్ల కిందట మాదకద్రవ్యాల వినియోగం ఇంతగా లేదన్నారు. సమాజానికి మహమ్మారిలా మారిన మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా పాఠశాలల నుంచే అవగాహన కార్యక్రమాలు ప్రారభించాలన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ముందుగానే వాటికి దూరంగా ఉంటే మంచిదన్నారు. అధికారులు మత్తు పదార్థాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మత్తు పదార్థాల జోలికి వెళ్లబోమని, వాటికి దూరంగా ఉంటామని విద్యార్థులు, యువతతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, డీఈవో వాసంతి, సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయంతి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- విద్యా శాఖ అధికారులతో సమీక్ష

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో విద్యార్థుల నమోదుపై గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పాఠశాల విద్య, ఇంటర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ గురుకులాల అధికారులు, ఎంఈవోలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో గత, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంతమంది విద్యార్థుల నమోదు జరిగిందనే వివరాలను జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గురించి సమాచారాన్ని డీఈవో వాసంతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల చేరికల గురించి ఇంటర్ విద్యాశాఖ సూపరింటెండెంట్ చంద్రమౌళి కలెక్టర్‌కు ఈ సందర్భంగా వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులు ఎంత శాతం ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి తరగతిలో చేరారు అనే సమాచారాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల నమోదు శాతం ఇంకా పెరగాలన్నారు. మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

వరంగల్ మెడికల్: ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, వారు చెప్పే సమస్యలను ఓపిగ్గా విని అందుకు తగిన విధంగా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. హనుమకొండ పోచమ్మకుంటలోని పట్టణ ప్రాథమిక కేంద్రాన్ని గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఓపీ విభాగం, వ్యాక్సిన్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, ల్యాబ్‌ను పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి ప్రతీరోజు ఎంతమంది ఓపీ సేవలకు వస్తుంటారని అడిగారు. ఫార్మసీలో ఉన్న మందులను పరిశీలించి, ఇండెంట్ నమోదును ఏ విధంగా చేస్తున్నారని తెలుసుకున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులలో అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దీప్తి, డెమో అశోక్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మోదీ పాలనలో పారదర్శకంగా దేశాభివృద్ధి

రాంనగర్ (ఆంధ్రజ్యోతి): మోదీ పాలనలో దేశంలో పారదర్శకంగా అభివృద్ధి జరుగుతోందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. యూపీఏ పాలనలో దేశంలో కుంభకోణాలు జరిగాయని విమర్శించారు. 11 ఏళ్ల మోదీ పాలనపై గురువారం 7, 30, 31 డివిజన్‌లలో జోనల్‌స్థాయి రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావు పద్మ హాజరై మాట్లాడారు. మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళుతోందన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ కన్వీనర్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సంద్ర మధు, జంపాల హరీశ్, కళ్యాణ్, శ్రీనువాస్‌రావు, రత్నా లక్ష్మీ, నాను నాయక్, ధనలక్ష్మీ, నిఖిల్ చోప్రా, జెండా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం

వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాలు, కులాలకు సముచిత స్థానం లభించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నేత, 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు నీలం రాజ్‌కిశోర్ అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్నూరుకాపుల కలను సాకారం చేసేందుకోసం మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఎంతో కృషి చేసి మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి రూ.5.55 కోట్లను మంజూరు చేయించారని పేర్కొన్నారు. శంకుస్థాపన చేసిన మున్నూరుకాపు భవనానికే మళ్లీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు పెరికారి శ్రీధర్, నీలం సుహాస్, వరుణ్, నవీన్, బచ్చు అనిల్, వేణుగోపాల్, నగేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

11 మందిపై కేసు నమోదు

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్డేపల్లి ప్రాంతంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 11 మందిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.రంజిత్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన వారికి పోలీస్‌స్టేషన్‌లో సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఫణిందర్ తదితరులు పాల్గొన్నారు

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 13 మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా వారిలో ముగ్గురికి న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్‌చారి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 10 మందికి రూ. 10,000 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఇద్దరి వ్యక్తులకు రూ.1,600 జరిమానా విధించామన్నారు.

ఫైనాన్షియల్ యాక్ట్‌ను రద్దు చేయాలి

రాంనగర్ (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫైనాన్షియల్ యాక్ట్- 2025ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న అన్నారు. గురువారం 53వ డివిజన్ ఆదర్శకాలనీలో జరిగిన పెన్షనర్ల సమావేశంలో వీరన్న మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జనవరి 2026కు ముందు రిటైర్‌మెంట్ అయ్యే ఉద్యోగుల పీఆర్సీ, డీఏల ఎగవేతకు సివిల్ సర్వీస్ రూల్స్ సవరణ పేరుతో ఫైనాన్షియల్ యాక్టు తీసుకురావడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టబోయే ధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బ్రహ్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, ఆర్థిక కార్యదర్శి గంగారపు యాదగిరి, సభ్యులు బుచ్చిరెడ్డి, బాబు, సదాశివయ్య, జార్జి, భాస్కర్‌రెడ్డి, ఎల్లగౌడ్, కొటేశ్వర్, కుమారస్వామి, సుమతి, శకుంతలదేవి పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): విద్యారంగ నిర్వీర్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నేడు (శుక్రవారం) హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. గురువారం కాజీపేట మండలంలోని పలు పాఠశాలల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్‌టీపీ పనులు త్వరగా పూర్తి చేయండి

- నగర మేయర్ గుండు సుధారాణి



ఎఫ్ఎస్‌టీపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం (ఎఫ్ఎస్‌టీపీ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. నగర పరిధిలోని 44వ డివిజన్ అమ్మవారిపేటలో బల్దియా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కేఎల్‌డీ (ఎఫ్ఎస్‌టీపీ) కేంద్ర పనులను కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి గురువారం పర్యవేక్షించారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్లాంట్ నిర్మిత పనులను నెలలోగా పూర్తిచేసి ట్రయల్ రన్‌ను నిర్వహించాలని అన్నారు. అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. పనుల నిర్మాణంలో పారదర్శకత పాటించాలని అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం 2015 ప్రకారం ప్రతీ సెప్టిక్ ట్యాంక్‌ను మూడేళ్లకోసారి శుభ్రం చేసుకోవాలని అన్నారు. 40 కేఎల్‌డీ సామర్థ్యంతో పనిచేస్తున్న ప్లాంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, డీఈ సారంగం, ఏఈ సంతోష్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, సైట్ ఇంజనీర్ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. గురువారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో వరంగల్ కమిషనర్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెప్మా విభాగానికి సంబంధించిన అన్ని పథకాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌జీలకు నైపుణ్య శిక్షణ కేంద్రాలలో శిక్షణ ఇచ్చేందుకు సీఈవోలు చొరవ చూపాలన్నారు. వారికి బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించడం, ఇందిరా మహిళా శక్తి రుణాల గ్రౌండింగ్ చేయించేలా చూడాలన్నారు. వికలాంగుల కోసం ప్రత్యేకంగా స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. వీధి వ్యాపారుల గ్రూపులను ఏర్పాటు చేయడంతో పాటు పీఎం విశ్వకర్మ పథకం అమలుకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు రుణాలు ఇప్పించాలని అన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు మెప్మా కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, టీఎంసీ కంజర్ల రమేష్, సీవోలు రమేష్, ప్రవీణ్, సఫియా, శ్రీలత, రమా, సుజాత, శ్రీనివాసులు, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలు



విద్యుత్‌షాక్‌కు గురై స్తంభంపై తలకిందులుగా వేలాడుతున్న లైన్‌మన్ చంద్రమూర్తి

హసన్‌పర్తి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్‌లో అసిస్టెంట్ లైన్‌మన్ విద్యుత్ షాక్ గురైన ఘటన గురువారం స్థానిక రైతులను ఆవేదనకు గురిచేసింది. లైన్‌మన్ నిర్లక్ష్యమే అసిస్టెంట్ లైన్‌మన్ ప్రాణాలమీదికి వచ్చిందని స్థానికులు మండిపడుతున్నారు. స్థానిక రైతులు, విద్యుత్ సిబ్బంది కథనం ప్రకారం..

జయగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి అనంతసాగర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం లేదని రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అసిస్టెంట్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న మడిపల్లికి చెందిన బొల్లోజు చంద్రమూర్తి తన పైఅధికారైన లైన్‌మన్ కుమార్ ద్వారా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కోసం ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు. ఎల్‌సీ ఇచ్చినట్లు లైన్‌మన్ కుమార్ అసిస్టెంట్ లైన్‌మన్‌కు తెలియజేశాడు. దీంతో చంద్రమూర్తి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి మరమ్మతు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే అసిస్టెంట్ లైన్‌మెన్ చంద్రమూర్తికి విద్యుత్ ప్రసారమైంది. షాక్‌కు గురై సొమ్మసిల్లి విద్యుత్ స్తంభంపై తలకిందులుగా వేలాడాడు. స్థానిక రైతులు కిందకు దించి 108లో ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం అతడి ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ విషయంపై విద్యుత్ అధికారులు విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

న్యూయార్క్‌లో జిగేల్‌మన్న రామప్ప

- బిల్‌బోర్డుపై ఆలయ చిత్రాల ప్రదర్శన
- నలిమెల అరుణ్ కుమార్‌కు అరుదైన గౌరవం

హనుమకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ బిల్‌బోర్డుపై ప్రదర్శించిన రామప్ప గుడి చిత్రాలు ఆకట్టుకున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ డిజిటల్ డిస్‌ప్లేపై భూపాలపల్లి పట్టణానికి చెందిన ప్రసిద్ధ ఫొటోగ్రాఫర్ నలిమెల అరుణ్ కుమార్ తీసిన మూడు ఫొటోగ్రాఫ్‌లను ఎన్ఎఫ్‌టీ ఎన్‌వైసీ-2025 కార్యక్రమంలో భాగంగా ఈనెల 24, 25 తేదీల్లో రాత్రి 9 నుంచి 9.30 గంటల వరకు ప్రదర్శించారు. మిస్‌వరల్డ్-2025లో భారత దేశం పక్షాన ప్రాతినిధ్యం వహించిన మిస్ ఇండియా-2023 విజేత నందిని గుప్తా రామప్ప గుడిని సందర్శించిన సందర్భంగా తీసిన చిత్రాలు ఇవి. అలాగే మహిళలు సంప్రదాయ పద్ధతిలో తయారుచేసిన బతుకమ్మ చిత్రాన్ని, కాకతీయ శిల్పకళావైభవానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన రామప్ప ఆలయాన్ని మారియట్ మార్క్విస్ టౌమ్స్ స్క్వేర్‌లోని ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించారు. తన చిత్రాలను ప్రపంచ ప్రసిద్ధిచెందిన వేదికపై ప్రదర్శించడం ఆనందంగా ఉందని అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ అంతర్జాతీయ గుర్తింపుతో తన కెమెరా ద్వారా మన కళలు, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యతను మరింతగా పెంచిందన్నారు.



న్యూయార్క్‌లో బిల్‌బోర్డుపై ప్రదర్శించిన రామప్ప గుడి ముందు మిస్ ఇండియా నందినిగుప్తా ఉన్న ఫొటో

దంచికొట్టిన వాన

- గీసుగొండ మండలంలో అత్యధికంగా 63.8 మి.మీ

హనుమకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో బుధవారం రాత్రి వర్షం దంచికొట్టింది. రాత్రి 12గంటల తర్వాత సుమారు గంటపాటు ఒక మోస్తరు భారీ వర్షం కురిసింది. ఈ రెండు జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షం కురియగా మహబూబాబాద్ జిల్లాలో కూడా రెండు, మూడు మండలాలు మినహా అంతటా వర్షం పడింది. జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒకటీ రెండు మండలాలు మినహా మిగతా ప్రాంతంలో పెద్దగా వర్షం పడలేదు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో రికార్డు స్థాయిలో వర్ష పాతం నమోదైంది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో అత్యధికంగా 62.1 మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలోని మొత్తం 14మండలాల్లో 60.2 మి.మీ. మధ్య వర్షపాతం రికార్డయింది. వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలంలో రికార్డు స్థాయిలో 63.8 మి.మీ. వర్షం పడింది. పర్వతగిరి, రాయపర్తి మండలాలు మినహా జిల్లాలోని మిగతా 11 మండలాల్లో 60.1 మిమీ వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో అత్యధికంగా 57.1 మి.మీ., ములుగు జిల్లాలోని మల్లంపల్లిలో 33.5 మి.మీ., జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో అత్యధికంగా 50 మి.మీ., జనగామ జిల్లాలోని ఒక్క కొడకండ్ల, జఫర్‌గడ్ మండలాల్లో 40 మి.మీ. వర్షం పడింది. మిగతా మండలాల్లో పెద్దగా వర్షం లేదు.

అధికార పార్టీ కార్పొరేటర్‌పై కేసు

నకిలీ నోట్లు చలామణి చేసే వాడని ఫిర్యాదు

వరంగల్ క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నకిలీ నోట్ల చలామణికి సంబంధించి హనుమకొండకు చెందిన అధికార పార్టీ కార్పొరేటర్‌పై హైదరాబాద్‌లో కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయమైన సమాచారం మేరకు.. పశ్చిమ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడిగా ఉన్న కార్పొరేటర్‌కు హైదరాబాద్‌లో స్థిరపడ్డ మహబూబాబాద్ ప్రాంతానికి చెందిన శ్రీను అనే వ్యక్తికి మధ్య స్నేహం ఉంది. శ్రీనుకు పోలీస్ ఉన్నతాధికారులతో పరిచయం ఉండటంతో.. 'హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తా హనుమకొండలో ఎవరైనా ఉంటే చెప్పు' అని 2016-17 సంవత్సరంలో కార్పొరేటర్‌కు చెప్పడంతో తన దగ్గర ఉన్న డ్రైవర్‌కు ఇప్పించమని చెప్పాడు. సదరు డ్రైవర్ కార్పొరేటర్ సహాయంతో శ్రీనుకు రూ.2లక్షలు ఇవ్వగా ఇప్పటి వరకు ఉద్యోగం ఇప్పించకపోవడమే కాకుండా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో విరక్తిచెందిన కార్పొరేటర్ డ్రైవర్.. హైదరాబాద్‌లో శ్రీను ఇంటికి వెళ్లి గొడవ చేసి దాడిచేసి చంపేందుకు ప్రయత్నం చేసినట్లుగా తెలుస్తోంది. దీంతో సదరు వ్యక్తి డ్రైవర్‌తోపాటు కార్పొరేటర్‌పై హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. ఫిర్యాదులో కార్పొరేటర్ నకిలీ నోట్లను చలామణి చేసేవాడని, చాలా మందిని మోసం చేసి డబ్బులు కూడబెట్టుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నకిలీ నోట్ల విషయంలో కేసు అయిందా..? లేదా సదరు వ్యక్తి చంపుతానని బెదిరించిన నేపథ్యంలో హత్యాయత్నం కింద కేసు నమోదు అయిందా..? అనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, కార్పొరేటర్‌పై గతంలో పలు కేసులు ఉండటం గమనార్హం.

ఆంధ్రజ్యోతి
9
నవ్య
నివేదన
శుక్రవారం • 27 జూన్ 2025

ఆలయ దర్శనం

సద్గతులనిచ్చే క్షేత్రం... వ్యాఘ్రేశ్వరం

ఏకాదశ రుద్రులుగా పేరు పొందిన ఈశ్వర రూపాల్లో... తొమ్మిది కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మండలంలో కొలువుతీరాయి. వాటిలో ఈశ్వరుడు స్వయంభువుగా వెలిశాడు. ఎంతో మహిమ కలిగిన ఈ క్షేత్రాలను సందర్శిస్తే పాపవిముక్తి, సద్గతి ప్రాప్తి కలుగుతాయనే విశ్వాసం ఉంది. వీటన్నిటిలో అత్యంత శక్తిమంతమైన క్షేత్రంగా వ్యాఘ్రేశ్వరంలోని శ్రీబాలాత్రిపురసుందరీ సమేత శ్రీవ్యాఘ్రేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది.

ఈశ్వరుడే వ్యాఘ్రరూపంలో...

స్థల పురాణం ప్రకారం... పూర్వం ఈ ప్రాంతమంతా దట్టమైన అడవులతో నిండి ఉండేది. ఆ అడవులనుంచి భక్తులు ప్రతిరోజూ శివపూజ కోసం బిల్వ పత్రాలను (మారేడు దళాలను) తెచ్చుకొనేవారు. ఒకసారి మహా శివరాత్రి నాడు మారేడు దళాల కోసం ఒక పేద బ్రాహ్మణుడు ఆ అడవికి వెళ్ళాడు. అక్కడ అతణ్ణి ఒక పెద్ద పులి తరమడంతో... భయంతో పరుగులు పెడుతూ ప్రాణ రక్షణ కోసం ఒక మారేడు





చెట్టు ఎక్కి కూర్చున్నాడు. ఆ పులి చెట్టు కిందే కాచుకొని ఉంది. దాంతో చెట్టు దిగలేక, మరోవైపు శివరాత్రి మహా పుణ్యకాలం సమీపిస్తూ ఉండడంతో... ఆ చెట్టు ఆకులను ఒక్కొక్కటిగా కోసి, మంత్రాలు చదువుతూ పూజ నిర్వహించాడు. తెల్లవారిన తరువాత చూస్తే... ఆ చుట్టుపక్కల పులి కనిపించలేదు. ఈ వృత్తాంతాన్ని ప్రాంతాన్ని పాలించే పిఠాపురం రాజుకు అతను వివరించాడు. ఆ రాజు భటులను పంపించి, బ్రాహ్మణుడు పూజించిన మారేడు దళాలు గుట్టగా ఉన్న చోట తవ్వించగా... ఒక పెద్ద శబ్దం వినిపించింది. ఆ ప్రదేశంలో ఒక శివలింగం బయటపడింది. మహా శివరాత్రి రోజున పరమశివుడే.. వ్యాఘ్రం (పెద్ద పులి) రూపంలో వచ్చాడని అందరూ భావించారు. ఆ తరువాత రాజు కలలో శివుడు సాక్షాత్కరించి... ఆ వృత్తాంతాన్ని గుర్తు చేశాడు. అప్పుడు రాజు ఆ ప్రదేశంలో ఒక ఆలయాన్ని నిర్మించి, నిత్య దీప ధూప నైవేద్యాలకు తగిన ఏర్పాట్లు చేశాడు. ఆ ప్రాంతం 'వ్యాఘ్రేశ్వరం'గా ప్రసిద్ధి చెందింది. నాటి నుంచి నేటివరకూ ఇక్కడ వ్యాఘ్రేశ్వరుడిగా శివుడు పూజలందుకుంటున్నాడు.

ఇంటింటా ఆ పేరే...

ఈ ప్రాంతం వారు వ్యాఘ్రేశ్వరుణ్ణి తమ ఇలవేలుపుగా కొలుస్తారు. నేటికీ ప్రతి కుటుంబం తమ ఇంట పుట్టిన ప్రథమ సంతానం పేరులో తప్పనిసరిగా 'వ్యాఘ్రేశ్వర' లేదా 'వ్యాఘ్రి' అనే పదాన్ని చేరుస్తారు. మరో విశేషం ఏమిటంటే... భక్తులు తమ కోర్కెలు తీరడం కోసం ఆలయ ప్రాంగణంలో ఒక కొబ్బరి మొక్కను నాటుతారు. అలా చేస్తే తాము కోరుకున్నవన్నీ నెరవేరుతాయని వారి విశ్వాసం. ప్రతి సంవత్సరం మాఘమాసంలో బహుళ ఏకాదశి రోజు నుంచి ఆరు రోజులపాటు స్వామివారి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతాయి. వాటితోపాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీమదన గోపాలస్వామి కళ్యాణ వేడుకలను కూడా వైభవంగా నిర్వహిస్తారు.

• సి.ఎన్. మూర్తి, 8328143489

విశేషం

జగన్నాథుడి రథయాత్ర... భక్తులు అంగరంగంగా జరుపుకొనే ఒక మహోత్సవం. సాక్షాత్తూ శ్రీకృష్ణుడి ప్రతిరూపమైన శ్రీజగన్నాథస్వామి... బలభద్ర, సుభద్రలతో కలిసి... భక్తులను అనుగ్రహించడానికి ఆలయం నుంచి బయటకు వచ్చే దివ్యమైన సందర్భం అది. జగన్నాథుడి రథోత్సవం జనన మరణ చక్రానికి అడ్డుకట్ట వేసి, మోక్షమార్గాన్ని సులభంగా అనుగ్రహించగలదని పురాణాలు చెబుతున్నాయి.



పతితపావనుడు శ్రీ జగన్నాథుడు

ఒడిశాలోని పూరీలో ఉన్న, అత్యంత పురాతనమైన శ్రీ జగన్నాథుడి ఆలయంలో ప్రతి సంవత్సరం జరిగే కన్నుల పండుగ... జగన్నాథ రథయాత్ర. ఇది ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ విదియ నాడు ప్రారంభమవుతుంది. భగవంతుణ్ణి ఆలయంలో దర్శించుకోలేని భక్తులకు... ఆ జగన్నాథుడే స్వయంగా రథంపై వచ్చి దర్శన భాగ్యం కల్పిస్తాడు. అందుకే ఆయనను 'పతిత పావనుడు' అంటారు. 'రథస్థం కేశవం దృష్ట్వా.. పునర్జన్మ న విద్యతే... రథంపై కొలువై ఉన్న జగన్నాథ స్వామిని దర్శించినవారు పునర్జన్మ నుంచి విముక్తి పొందుతారు' అనేది శాస్త్రవాక్యం. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర అసంపూర్ణమైన కరచరణాలతో, ప్రత్యేక రూపాలతో కనిపించడం వెనుక ఒక లీల ఉంది. ఒకసారి కురుక్షేత్రంలో, సూర్యగ్రహణ సమయంలో... శ్రీకృష్ణుడు, బలరాముడు, సుభద్ర తమ బాల్య లీలలను రోహిణీ మాత నుంచి వింటూ పరవశించిపోయారు. అప్పుడు వారి దేహాలు విశాలమైన కళ్ళతో, లోపలికి చొచ్చుకుపోయిన కరచరణాలతో రూపాంతరం చెందాయి. అవి వ్రజ వాసుల మాధుర్య, ప్రేమ భావనలకు ప్రతిరూపాలుగా పూజలందుకుంటున్నాయి.

గుండిచాలో విడిది

రథయాత్రలో జగన్నాథుడు (సాక్షాత్తు శ్రీకృష్ణుడు), బలభద్రుడు (బలరాముడు), సుభద్ర (శ్రీకృష్ణుని సోదరి) వేర్వేరు రథాల మీద కొలువై కదులుతారు. జగన్నాథుడి రథాన్ని 'నందిఘోష' అంటారు ఇది 16 చక్రాలతో 44 అడుగుల రెండంగుళాల ఎత్తులో ఉంటుంది. బలభద్రుడి రథాన్ని 'తాళధ్వజం' అంటారు. దానికి 14 చక్రాలుంటాయి ఎత్తు 43 అడుగుల మూడంగుళాలు. సుభద్ర రథం పేరు 'దేవదళన'. దీనికి 12 చక్రాలుంటాయి, ఎత్తు 42 అడుగుల మూడంగుళాలు ఉంటుంది. ఈ రథయాత్ర ప్రధాన ఆలయం దగ్గర మొదలై గుండిచా మందిరం వరకూ సాగుతుంది. జగన్నాథ, బలభద్ర, సుభద్రలు తొమ్మిదిరోజుల పాటు గుండిచా మందిరంలో బస చేస్తారు. మూడు రోజుల తరువాత 'హేరా పంచమి' ఉత్సవం జరుగుతుంది. ఆ రోజు లక్ష్మీదేవి గుడించా మందిరానికి వెళ్ళి, స్వామిని తిరిగి రమ్మని చెప్పి, కోపంగా వెనక్కు తిరిగి వస్తుంది. చివరకు స్వామివారు తమ మందిరానికి చేరుకొని, బంగారు ఆభరణాలతో దర్శనమిచ్చే 'సోనాబేష'తో రథయాత్ర ముగుస్తుంది.

జగన్నాథ నామం... విశ్వవ్యాప్తం

హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదుల కృషి ఫలితంగా ఇప్పుడు ప్రపంచంలోని అన్ని ఖండాలలో, ప్రతి ప్రఖ్యాత నగర వీధుల్లో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నారు. 1967లో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో తొలిసారిగా అంతర్జాతీయ రథయాత్రను నిర్వహించారు. కుల, మత, వర్గ భేదం లేకుండా.. ప్రతి ఒక్కరికీ భగవంతుణ్ణి సేవించే అవకాశాన్ని ఈ ఉత్సవం అందిస్తుంది. ప్రజలంతా 'హరేకృష్ణ... హరేరామ' మహామంత్రాన్ని జపిస్తూ ఉత్సవంలో పాల్గొంటారు. ఈ రథయాత్రలు జగన్నాథుని నామాన్ని, ప్రేమను ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చేస్తున్నాయి. సామాజిక ఐక్యతను పెంపొందిస్తున్నాయి. శ్రీల ప్రభుపాదులు శ్రీ జగన్నాథుణ్ణి విశ్వమంతా పరిచయం చేశారు. ఆయనకు చిన్ననాటి నుంచే రథయాత్రపట్ల అమితమైన ఆసక్తి ఉండేది. కాగా... నవద్వీపంలో అవతరించిన శ్రీచైతన్య మహాప్రభువు 24వ యేట సన్యసించిన తరువాత... జగన్నాథపురినే తన భక్తి ఉద్యమ ప్రచార కేంద్రంగా చేసుకొని, హరినామ సంకీర్తనను వ్యాపింపజేశారు. శ్రీల ప్రభుపాదులు కూడా చైతన్య మహాప్రభువుల గౌడీయ సంప్రదాయ మార్గ నిర్దేశాలను అనుసరించి... ఈ రథోత్సవాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళారు. ప్రపంచవ్యాప్తంగా రాధా-కృష్ణ దేవాలయాలు స్థాపించాలని, రథయాత్రలు నిర్వహించాలని తన శిష్యులను కోరారు. ఆయన అనుగ్రహం వల్లనే నేడు జగన్నాథుని నామం ప్రపంచమంతటా మారుమోగుతోంది.

ఎలా పాల్గొనాలి?

శ్రీ జగన్నాథ రథయాత్ర... భగవంతుడికి సేవ చేసేందుకు ప్రతి ఒక్కరికీ లభించే ఒక గొప్ప అవకాశం. భగవంతుడితో మనకున్న సనాతనమైన సంబంధాన్ని మళ్ళీ తెలుసుకోవడానికి ఈ ఉత్సవం సహాయపడుతుంది. రథయాత్రలో పాల్గొనడం ద్వారా శ్రీకృష్ణునితో ప్రత్యక్షంగా అనుబంధం ఏర్పడుతుంది. ఎంత గొప్పవాడినైనా భగవంతుడి సర్వోత్తత్వాన్ని అంగీకరించాలనే ఆలోచనను రథయాత్ర కలిగిస్తుంది. రథయాత్ర సమయంలో రథాన్ని తాడు పట్టుకొని లాగడం, స్వామిని దర్శించడం, హారతులు ఇవ్వడం, నృత్య సంకీర్తనలు చేయడం, రథ మార్గంలో ముగ్గులు వేయడం, ప్రసాదాలు నివేదించడం లాంటి సేవలు భక్తులు చేయవచ్చు. ఇవి వారిని ఆధ్యాత్మికంగా మరింత పురోగమింపజేస్తాయి.





• శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషాలు ఎన్నెన్నో...

పూరీలోని జగన్నాథ ఆలయం అనేక విశేషాల సమాహారం. శ్రీకృష్ణుని హృదయం ఇప్పటికీ ఈ ఆలయంలోని పవిత్రమైన గోడల లోపల కొట్టుకుంటూ ఉంటుందనేది భక్తుల నమ్మకాల్లో ఒకటి. కృష్ణుడి అవతార సమాప్తి తరువాత... అతని హృదయం నాశనం కాకుండా ఉండేందుకు ఈ ఆలయం లోపల ఒక దైవిక అవశేషంగా భద్రపరిచారని చెబుతారు.


- ఈ ఆలయం గోపురంపైన సుదర్శన చక్రం ఉంటుంది. అన్ని టన్నుల బరువైన లోహపు నిర్మాణాన్ని అంతపైకి ఎలా చేర్చారనేది ఇప్పటికీ అంతుపట్టని విషయం. అలాగే స్వామి మందిరాన్ని ఏ కోణం నుంచి చూసినా ఒకే విధంగా కనిపిస్తుంది. అలాగే నగరంలోని ఏ దిశ నుంచి చూసినా... ఆలయం పైన ఉన్న చక్రం ఒకే మాదిరిగా దర్శనం ఇస్తుంది.
- జగన్నాథ ఆలయంలోని దారు (కలప) విగ్రహాల స్థానంలో 8, 12, 19 ఏళ్ళకు ఒకసారి నిర్వహించే నవకళేబర యాత్ర సందర్భంగా కొత్త వాటిని ఏర్పాటు చేస్తారు. దీనికోసం నిర్దిష్టమైన లక్షణాలు కలిగిన వేప చెట్లను జాగ్రత్తగా ఎంపిక చేస్తారు. విగ్రహాలను చెక్కే పని 21 రోజుల పాటు నిపుణులైన కళాకారులు రహస్యంగా చేస్తారు. కొత్త విగ్రహాల ప్రతిష్ఠ తవాత.. పాత విగ్రహాలను ఖననం చేస్తారు. ఇంతకుముందు... 2015లో నవ కళేబర యాత్ర జరిగింది. మళ్ళీ 2034లో దీన్ని నిర్వహిస్తారు.
- జగన్నాథుడి ఆలయం మీద ఏ పక్షులూ ఎప్పుడూ ఎగరవు. అలాగే విమానాలకు కూడా ఆలయం మీదుగా ఎగరడానికి అనుమతి లేదు.
- నలభై అయిదు అంతస్తుల ఎత్తున ఉండే ఆలయ గోపురం పైకి అర్చకులు ప్రతిరోజూ ఎక్కి, 20 అడుగుల వెడల్పు ఉండే త్రిభుజాకార పతాకాన్ని ఎగురవేస్తారు. గత 1800 ఏళ్ళుగా ఇది నిరంతరాయంగా కొనసాగుతోంది. దీనికి ఒక్క రోజు అంతరాయం కలిగినా... పద్ధెనిమిదేళ్ళు ఆలయాన్ని మూసేయాలనే నియమం ఉంది. కాగా... గాలి ఒక దిశలో వీస్తూ ఉంటే... దానికి వ్యతిరేక దిశలో జగన్నాథ గోపుర పతాకం ఎగరడం విస్మయం కలిగించే మరో విశేషం.
- రోజులో ఏ సమయమైనా, ఆకాశంలో ఎండ ఎంత తీవ్రంగా కాస్తున్నా... జగన్నాథ ఆలయం నీడ నేల మీద పడదు. ఇది నిర్మాణపరమైన అద్భుతం అనేది కొందరి అభిప్రాయం కాగా... మరికొందరి దృష్టిలో ఇది జగన్నాథుడి లీల.
- శ్రీ జగన్నాథుడికి అయిదు విడతలుగా... 56 రకాల ప్రసాదాలను నిత్యం సమర్పిస్తారు. ఇరిరెండు రకాలు. వీటిలో పొడిగా ఉండే రకాలు కొన్ని, అన్నం, పప్పు లాంటి పదార్థాలు కొన్ని ఉంటాయి. మహా ప్రసాదం తయారీలో వేలాది మంది నిమగ్నం అవుతారు. ఏడు కుండలను ఒకదానిపై ఒకటి పెట్టి కట్టెల పొయ్యిల మీద వంట చేస్తారు. అన్నిటికన్నా పైన ఉన్న కుండలో ఉన్న పదార్థం మొదట, తరువాత మిగిలిన కుండల్లోని పదార్థాలు ఉడుకుతాయి. దీన్ని పూరీ క్షేత్రానికే ప్రత్యేకమైన విశేషంగా చెబుతారు. ప్రతిరోజూ ఒకే పరిమాణంలో ప్రసాదం తయారు చేస్తారు. అయితే భక్తుల సంఖ్య ఎక్కువైనా, తక్కువైనా... ఏ రోజూ ఆహారం వృథా కాదనీ, అలాగే భక్తులు ఎవరూ నిరాహారంగా మిగిలిపోరనీ అంటారు. •

దైవమార్గం

నీ తోటివాడూ నీలాంటివాడే...

సంపన్నుడైన ఒక బాటసారి కొండదారిలో ఒంటరిగా ప్రయాణిస్తున్నాడు. అతని దగ్గిర డబ్బు, నగలు ఉన్న పెద్ద మూట ఉంది. అది దొంగలు దారికాచి దోచుకోవడానికి అనువైన ప్రదేశమే. కాబట్టి అతను ఆ మూటను జాగ్రత్తగా పట్టుకొని నడుస్తున్నాడు. అతను భయపడినట్టే... చెట్ల చాటు నుంచి, బండల మాటు నుంచి దొంగలు వచ్చారు. అతణ్ణి చుట్టు ముట్టారు. తీవ్రంగా కొట్టారు. అతని దగ్గర ఉన్నదంతా దోచుకుపోయారు. ఆ బాటసారి స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటికి తేరుకున్నాడు. లేవలేని స్థితిలో ఉన్న అతను సాయం కోసం అరిచాడు, అర్థించాడు. అటువైపు పలువురు పలుకుబడి ఉన్న పెద్దమనుషులు, సంఘ సేవకులుగా పేరున్నవారు, సంపన్నులు, మతాచార్యులు ప్రయాణించారు. అందరూ అతణ్ణి దాటుకుంటూ పోయారు తప్ప సహాయం చేయలేదు.

కొంతసేపటికి ఒక సాదాసీదా మనిషి చిన్న గాడిదమీద అటు వచ్చాడు. ఆ బాధితుణ్ణి చూసి, 'అయ్యో పాపం' అని జాలిపడ్డాడు. అతడికి కట్లు కట్టాడు. తన గాడిద మీద ఎక్కించుకొని దగ్గరలో ఉన్న సత్రంలోకి చేర్చాడు, వైద్యం చేయించాడు. సత్రం వారికి మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళాడు. మరుసటిరోజు వచ్చి... సత్రం వారికి చెప్పిన మొత్తం చెల్లించాడు. ఆ బాటసారిని అతని ఇంటికి తీసుకువెళ్ళాడు. ఆ వచ్చిన వ్యక్తి ఒక సమరేయుడు. అంటే ఆ రోజుల్లో కడజాతివాడుగా, అంటరానివాడుగా పరిగణించే వ్యక్తి. అందరూ ఈ సడించుకొనే వర్గానికి చెందినవాడు. అయితేనేం... బాధలో ఉన్న తోటి మనిషిని అతను కాపాడి తన ఔన్నత్యాన్ని చాటుకున్నాడు.



"సాటివాడు శత్రువు కాదు. తోటివాడు తోడేలూ కాదు. వారూ మనలాంటి మనుషులే అని భావించి, ప్రేమించడం నేర్చుకోవాలి. ఎంత సంపద ఉన్నా, అధికారంలో ఉన్నా, జాతిపరంగా ఉన్నతులమని భావించేవారైనా... వారెవరూ గొప్పవారు కాదు. తోటివారికి సాయం చేసేవారు పేదలైనా, నిమ్నవర్గాలవారైనా ఉన్నతులే" అంటూ తన చుట్టూ చేరిన ప్రజలకు ఏసు క్రీస్తు చెపిన్పన కథ ఇది. 'మనల్ని మనం ప్రేమించుకోవడంలో విశేషం ఏముంది? మనల్ని మనం ఎంతగా ప్రేమించుకుంటామో మన చుట్టుపక్కలవారిని కూడా అలాగే ప్రేమించాలి' అనేది బైబిల్ సారాంశం.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

తెలుసుకుందాం

ఉలూచి... ప్రాణదాతే కానీ...

మహాభారతంలో ఉలూచి (ఉలూపి) పాత్రచిత్రమైనది. ఆమె పాతాళలోకంలో నాగులకు రాజైన కౌరవ్యుడి కూతురు. అర్జునుడి తీర్థయాత్రల సమయంలో ఈ పాత్ర పరిచయం అవుతుంది. పాండవులు ఒక నియమం పెట్టుకుంటారు. వారిలో ఎవరైనా ద్రౌపదితో ఏకాంతంగా ఉండగా... మిగిలినవారు ఆ వైపు వెళ్ళకూడదు. ఏ కారణంగానైనా ఆ నియమాన్ని ఉల్లంఘించినట్టయితే... నిర్ణీతకాలం తీర్థయాత్రలు చేయాల్సి ఉంటుంది. ఒకసారి ధర్మరాజు, ద్రౌపది ఏకాంతంలో ఉండగా... ఆర్త రక్షణ కోసం తన విల్లమ్ములు తీసుకోవడానికి ఆ మందిరంలోకి అర్జునుడు ప్రవేశించక తప్పని పరిస్థితి ఎదురవుతుంది. అందుకు పరిహారంగా అర్జునుడు తీర్థయాత్రలకు బయలుదేరుతాడు. అతను గంగానదిలో స్నానం చేస్తూ ఉండగా... నాగకన్య అయిన ఉలూచి అతడి కాలు పట్టుకొని పాతాళానికి లాక్కుపోతుంది. తనను పెళ్ళాడమని అర్జునుణ్ణి ప్రాధేయపడుతుంది. మొదట అర్జునుడు నిరాకరించినా... ఆమె అతణ్ణి ఒప్పించి వివాహం చేసుకుంటుంది. కొన్నాళ్ళకు అర్జునుడు ఆమెను విడిచిపెట్టి వెళ్ళిపోతాడు. వారికి ఇరావంతుడనే కొడుకు జన్మిస్తాడు. అతను మహాభారత యుద్ధంలో మరణిస్తాడు.



అర్జునుడి పాపం...

ఒక రోజు ఉలూచి గంగానదిలో స్నానానికి వస్తుంది. అక్కడికి వసువులు వచ్చి, గంగాదేవితో మాట్లాడడం గమనిస్తుంది. తమ వసువుల్లో ఒకరు శాపవశాత్తూ గంగాపుత్రుడైన భీష్ముడిగా జన్మించి... భారత యుద్ధంలో సాధించిన విజయాలను వారు వివరిస్తూ ఉంటే... శిఖండిని అడ్డుపెట్టుకొని భీష్ముణ్ణి అర్జునుడు చంపాడని గంగాదేవి ఆవేదన చెందుతుంది. అప్పుడు వసువులు "నీవు ఆజ్ఞాపిస్తే అర్జునుణ్ణి శాపంతో భస్మం చేస్తా"మంటారు. అందుకు గంగాదేవి సమ్మతిస్తుంది. ఆ మాటలు విన్న ఉలూచి పరుగుపరుగున పాతాళలోకానికి వెళ్ళి, అర్జునుణ్ణి కాపాడాలని తన తండ్రిని కోరుతుంది. కౌరవ్యుడు ఆమెతో కలిసి వసువుల దగ్గరకు వస్తాడు. తన కుమార్తెకు పతిభిక్ష పెట్టాలని కోరుతాడు. వారి వేదనను చూసి కరిగిపోయిన వసువులు "మేము ఊరుకున్నా అర్జునుణ్ణి ఆ పాపం వెంటాడుతూనే ఉంటుంది. అతను నరకానికి వెళ్ళక తప్పదు. అర్జునుడు తన కుమారుడి చేతిలో మరణించడమే పాపపరిహారం" అంటారు. భారత యుద్ధం తరువాత... అర్జునుడికి మిగిలిన కుమారుడు బభ్రువాహనుడు మాత్రమే. అర్జునుడు-చిత్రాంగదల కుమారుడైన అతను మణిపుర రాజ్యానికి పాలకుడు. అతనికీ, అర్జునుడికీ మధ్య యుద్ధం జరిగే సందర్భం కోసం ఉలూచి నిరీక్షిస్తూ ఉంటుంది.

యుద్ధానికి ప్రేరేపించి...

కొన్నాళ్ళకు ధర్మరాజు అశ్వమేధ యాగం చేస్తాడు. యాగాశ్వ రక్షణ కోసం దాని వెంట బయలుదేరిన అర్జునుడు.. మణిపుర రాజ్యంలోకి ప్రవేశిస్తాడు. ఇది తెలుసుకున్న బభ్రువాహనుడు తండ్రికి స్వాగతం చెప్పడానికి వెళతాడు. అతణ్ణి అర్జునుడు ఎగతాళి చేస్తాడు. వెనుతిరిగి వస్తున్న బభ్రువాహనుణ్ణి ఉలూచి కలుసుకుంటుంది. యాగాశ్వాన్ని బంధించి, వాటి వెనుక వచ్చినవారిని జయించడమే రాజ ధర్మం అని చెప్పి, అర్జునుడితో యుద్ధం చేయమంటుంది. అప్పుడు బభ్రువాహనుడు యుద్ధానికి దిగి, అర్జునుణ్ణి ఓడిస్తాడు. అతను సంధించిన ఒక అస్త్రం అర్జునుడి ప్రాణాలు తీస్తుంది. ఈ సంగతి తెలిసిన చిత్రాంగద రణరంగానికి చేరుకొని విలపిస్తూ ఉంటుంది. అప్పుడు ఉలూచి వచ్చి... తన దగ్గర ఉన్న మృతసంజీవనీ మణితో అర్జునుణ్ణి బతికిస్తుంది. అర్జునుడి పాపపరిహారం కోసం తపించిన ఉలూచి... సవతి కొడుకును భర్త ప్రాణాలు తీయడానికి ప్రేరేపించి, ఆ తరువాత భర్తను బతికించి... తన ఆశయాన్ని నెరవేర్చుకుంది. •

చింతన

హృదయంలో అన్వేషించండి


ప్రతి ఒక్కరి జీవితంలో మూడు ముఖ్యమైన నియమాలు ఉంటాయి. వాటికి అందరం లోబడి ఉంటాం. మొదటిది... జన్మించడం, రెండోది... జీవించడం, మూడోది... ఈ లోకాన్ని విడిచిపోవడం. వీటిని ఎవరూ ఉల్లంఘించలేరు. అన్ని జీవులు వీటికి కట్టుబడి ఉంటాయి. పూర్వం ఎవరో చెప్పినట్టు రాజైనా, సామాన్యుడైనా, సాధువులైనా... పుట్టినవారు గిట్టవలసిందే. కొందరు సింహాసనాన్ని అధిష్ఠించి పోతారు, మరికొందరు జీవన బంధాల్లో చిక్కుకొని కష్టాలు పడుతూ పోతారు.

అది హృదయంలో ఉంటుంది...

మనం దుఃఖాల నుంచి తప్పించుకోవాలని అనుకుంటాం. సుఖంగా బతకాలని తాపత్రయపడతాం. కానీ సుఖం అనేది ఎక్కడుంది? అది మీలోనే ఉంది. కానీ మీరేమో దాన్ని బాహ్యంగా అన్వేషిస్తున్నారు. అది మీకు బయట దొరకదు. ఈ బాహ్య సుఖాలు ఎలాంటివంటే... సుఖంలో కూడా దుఃఖాలే మిగులుతాయి. ఈ ప్రాపంచిక సుఖం ఈ రోజు ఉంటుంది, రేపు ఉండదు. రేపటి రోజున అన్నీ మారిపోతాయి. ప్రతి ఒక్కటీ మారిపోతున్నా... మారకుండా ఉండాలని మీరు శతవిధాలా ప్రయత్నిస్తారు. చాలామంది వయసు తెలియకూడదని జుట్టుకు రంగు వేసుకుంటారు. కానీ యవ్వనం అనేది జుట్టులో ఉండదు. మీ హృదయంలో ఉంటుంది.

కాలయాపన వద్దు...

బయట ఉన్నవన్నీ మారుతాయి, మారుతూనే ఉంటాయి. ఈ రోజు ఉంటాయి. రేపు లేకుండా పోతాయి లేదా మారిపోతాయి. మిత్రులు మారుతారు. ఉద్యోగం మారుతుంది. రిటైరయ్యే రోజు కూడా తప్పకుండా వస్తుంది. వాతావరణం కూడా నిరంతరం మారుతూ ఉంటుంది. కానీ ఏదీ మారకుండా ఉండాలనేది మీ ఆకాంక్ష అన్నీ ఒకేలా ఉండాలని మీరు భావిస్తారు. కానీ మార్పు సహజం. అయితే మీరు జీవించి ఉన్నంతకాలం మారనిది ఒకటుంది... అదే మీ లోపలికి వచ్చిపోయే శ్వాస. దాన్ని మీరు అర్థం చేసుకోకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మీరు ఉత్త చేతులతోనే వెనుతిరగాల్సి వస్తుంది. కాబట్టి ఆ శ్వాస సరాగాలను ఆస్వాదించండి. అందులోని ఆనందాన్ని అనుభూతి పొందండి. మీరు అన్వేషిస్తున్నది మీలోనే ఉంది. దానికోసం నిరీక్షిస్తూ కాలయాపన చేయకండి. పరమానందం మీలోనే ఉందని గుర్తించండి. అలాగే మీలోనికి శ్వాస వస్తూ, పోతూ ఉంది కాబట్టి మీరు ఎంత భాగ్యశాలి అనేది కూడా గుర్తించండి. మీ జీవితంలో చీకటి ఛాయలు అలముకున్నప్పుడు, ప్రతిదీ మీకు విరుద్ధంగా ఉన్నట్టు అనిపిస్తున్న స్థితిలో కూడా... ఈ శ్వాస మీకు తోడుగా ఉంటుంది. మీలోకి సహజంగా వస్తూ పోతూ ఉంటుంది. యావత్ ప్రపంచాన్నీ నడిపిస్తున్న ఆ దివ్య శక్తి మిమ్మల్ని ఆ స్థితిలో కూడా విస్మరించడం



లేదు. ఈ విషయాలన్నీ గుర్తించగలగడం నిజంగా ఎంతో గొప్పవిషయం. ప్రపంచమంతా తల్లకిందులై, అన్నీ అస్తవ్యస్తంగా ఉంటూ, సమయం మీకు ఏమాత్రం అనుకూలంగా లేని పరిస్థితుల్లో కూడా... శ్వాస మీలోనికి వస్తూ, పోతూ ఉంటే... అంతా సవ్యంగా ఉన్నట్టే!

అజ్ఞానానికి భయపడండి...

మీరు గుర్తుంచుకోవాల్సిన మరో విషయం... మీరు దేనికీ భయపడవలసిన అవసరం లేదు. ఒకవేళ భయపడాల్సి వస్తే... అజ్ఞానానికి భయపడండి. అజ్ఞానిలా ఉండకండి. ఎందుకంటే జ్ఞానం మీలోనే ఉంది. చీకటిని చూసి భయపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రకాశం మీలోనే ఉంది. మీ అంతరంగంలోని ఆ జ్ఞాన దీపాన్ని వెలుగొందేలా చూసుకుంటే... చీకటి మీ దరిదాపులలోకి కూడా రాదు. జీవితంలో సమస్యలు వస్తాయి. కొన్నిటిని మీరు పరిష్కరించుకోగలరు. మరికొన్నిటికి ఎలాంటి పరిష్కారం ఉండదు. కానీ జీవితం లక్ష్యం... సమస్యలను పరిష్కరించుకోవడం. కాదు. పరమానందాన్ని పొందడం, ఈ జీవితాన్ని సఫలం చేసుకోవడం. దానికోసం ప్రయత్నించండి.



ప్రేమ్‌రావత్

'కన్నప్ప' కల్పితం కాదు.. మన చరిత్ర!




- మంచు విష్ణు

'కన్నప్ప అనే శివ భక్తుడు ఉండేవాడు. ఇప్పటికీ ఆయనను ఆరాధిస్తుంటారు. 'కన్నప్ప' సినిమా కథ కల్పితం కాదు.. అది మన చరిత్ర. మన మధ్యలో జీవించిన ఓ వ్యక్తి కథ' అని అన్నారు హీరో మంచు విష్ణు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కన్నప్ప' ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. కార్యక్రమంలో మంచు విష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమాకు ఇప్పటి వరకు లక్షకు పైగా టికెట్లు తెగాయి. ఇదంతా శివ లీల అనిపిస్తోంది. కుటుంబమంతా కలసి ఈ చిత్రాన్ని హాయిగా చూడాలని కోరుకుంటున్నాను. అందుకే నేను టికెట్ రేట్లు పెంచలేదు. ఏపీలో కొన్ని చోట్ల మాత్రమే పెంచాం. నా నలుగురు పిల్లలు ఈ చిత్రంలో నటించారు. ఓ తండ్రిగా నా పిల్లల్ని తెరపై చూడటం ఆనందంగా ఉంది. దేవుడు, భక్తుడికి మధ్యలో ఎవరూ ఉండాల్సిన పని లేదు. మూఢ నమ్మకాలు అవసరం లేదు. దేవుడి మీద మనసారా భక్తి ఉంటే చాలు అని చెప్పాలని అనుకున్నాం. ఈ చిత్రంలో మోహన్‌లాల్ పాత్ర ఎవరూ ఊహించని విధంగా ఉంటుంది. ఆ శివుడి ఆశీస్సులతో ఈ శుక్రవారం నాది అవుతుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు ముఖేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ "కన్నప్ప' చరిత్రను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాం' అని చెప్పారు. నటుడు శివ బాలాజీ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తుంటాయి. ఒట్టేసి చెబుతున్నా అద్భుతంగా ఉంటుంది' అని అన్నారు. నటుడు కౌశల్ మాట్లాడుతూ 'ప్రస్తుత తరమంతా 'కన్నప్ప' చిత్రాన్ని చూడాలి' అని కోరారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

హుషారైన గీతం



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తెలుగు థియేట్రికల్ రైట్స్‌ను డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, దిల్ రాజు భారీ ధరకు సొంతం చేసుకున్నారు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్స్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో సినిమా విడుదలవుతోంది. తాజాగా చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'చికిటు'ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ హుషారైన గీతంలో వింటేజ్ స్టైల్లో అదిరిపోయే స్టెప్పులతో అభిమానుల్ని ఖుషీ చేశారు రజనీకాంత్.

సాగు చేయని భూములకు రైతు భరోసా వద్దు

▸ సర్కారుకు రియల్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సాగు చేయని, పంటలు పండించని భూములకు రైతు భరోసా ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. రాళ్ల, గుట్టలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, కంపెనీలు పెట్టడం కోసం కొనుగోలు చేసిన భూములకు రైతు భరోసా ఇవ్వడం ఎందుకని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. పంటలు వేయని భూస్వాములు, సంపన్నుల లక్షల ఎకరాలకు కోట్లాది రూపాయలు రైతు భరోసాగా ఇవ్వటం సమంజసం కాదని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని ఆక్షేపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందే.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు చేయడం బాధ్యతారాహిత్యమని, ఇప్పటికైనా రైతు భరోసా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

మంజీరా బ్యారేజీ పిల్లర్లకు పగుళ్లు

డేంజర్‌లో జంట నగరాలకు మంచినీరు అందించే డ్యామ్

▸ మేడిగడ్డ తరహాలో మంజీరా దిగువ భాగంలో కొట్టుకుపోయిన అప్రాన్

▸ బ్యారేజీకి పొంచి ఉన్న ప్రమాదం

▸ మరమ్మతులు లేక దెబ్బతిన్న గేట్లు

▸ డ్యామ్ పూర్తిగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది

▸ ఎస్డీఎస్ఓ నిపుణుల బృందం నివేదిక



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జంటనగరాలతో పాటు పరిసర గ్రామాలకు తాగునీటిని అందించే మంజీరా బ్యారేజీ ప్రమాదంలో పడింది. బ్యారేజీకి తక్షణమే మరమ్మతులు చేయకపోతే భవిష్యత్తులో ముప్పు ఏర్పడుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో బ్యారేజీలో పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఏ మాత్రం శ్రేయస్కరం కాదని రాష్ట్ర ఆనకట్టల భద్రతా సంస్థ (ఎస్డీఎస్ఓ) తేల్చిచెప్పింది. జాతీయ ఆనకట్టల భద్రతా చట్టం-2021 ప్రకారం ఏర్పాటైన ఎస్డీఎస్ఓ ఆధ్వర్యంలో నిపుణుల బృందం గత మార్చి 22న బ్యారేజీని పరిశీలించి నివేదికను సమర్పించింది. బ్యారేజీ నిర్వహణ, పర్యవేక్షణ లోపాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లర్లకు(పియర్ల)కు పగుళ్లు వచ్చాయని గుర్తించింది. తుమ్మ చెట్లు పెరిగిపోవడంతో మట్టికట్ట బలహీనమైందని, ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో గేట్లు, స్పిల్ వేలోని కొంత భాగం సైతం దెబ్బతిందని నివేదిక పేర్కొంది. వరద ఉధృతితో కోతకు గురయ్యే చోట ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోతే అది క్రమంగా డ్యామ్ వరకు విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రోజూ 10 కోట్ల గ్యాలన్ల నీరు అందించే ఈ బ్యారేజీ హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ నిర్వహణలో ఉంది.

కాళేశ్వరం బ్యారేజీలాగే...

మంజీరా బ్యారేజీ నుంచి విడుదలైన వరద ఉధృతి నుంచి రక్షణగా దిగువన అప్రాన్ (కాంక్రీట్ నిర్మాణం) కొట్టుకుపోయిందని ఎస్డీఎస్ఓ పరిశీలనలో తేలింది. కాంక్రీట్ కొట్టుకుపోవడంతో బ్యారేజీ దిగువున భారీ గుంతలు ఏర్పడ్డాయని, మిగిలి ఉన్న అప్రాన్ భాగం సైతం ఎప్పుడైనా కొట్టుకుపోవచ్చన్నట్లు బలహీనంగా ఉందని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల అప్రాన్ వరద ధాటికి కొట్టుకుపోగా, తర్వాత కాలంలో మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిపోయింది. మిగిలిన రెండు బ్యారేజీల్లో సీపేజీలు బయటపడ్డాయి. అదే తరహాలో మంజీరా బ్యారేజీ అప్రాన్ కొట్టుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. బ్యారేజీ సామర్థ్యానికి మించిన వరద ఒత్తిడితోనే పియర్లకు పగుళ్లు వచ్చినట్టు ఎస్డీఎస్ఓ పేర్కొంది. ఇది రాతి ఆనకట్ట కావడంతో ఉక్కు, కాంక్రీట్‌తో నిర్మించిన ఆనకట్టలకు ఉండే దృఢత్వం ఉండదని అభిప్రాయపడింది. తాగునీటి అవసరాల కోసం మంజీర బ్యారేజీలో ఏడాది పొడవునా నీటిని నిల్వ చేస్తుండడంతో కట్టపై ఒత్తిడి ఉంటోందని పేర్కొంది. పెద్దసంఖ్యలో తుమ్మ చెట్లు పెరిగి బ్యారేజీ మట్టికట్టలను బలహీనపరుస్తున్నాయని తేల్చింది. అడవిని తలపించేలా తుమ్మచెట్లు పెరిగిపోవడంతో 1.5 కి.మీల కట్టలను పరిశీలించకపోయినట్టు పేర్కొంది. వాటి వల్ల డ్యామ్ రివర్‌బెడ్ దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపింది. గేట్ల సీలింగ్ సరిగ్గా లేదని, భారీగా లీకేజీలు కనిపిస్తున్నాయని పేర్కొంది. బ్యారేజీ పూర్తిగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోందని అభిప్రాయపడింది. బ్యారేజీని పటిష్ఠపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఆధ్వర్యంలో అధ్యయనం జరిపించాలని సిఫారసు చేసింది.

జలాశయంలో 700 వరకు మొసళ్లు

మంజీరా జలాశయంలో 700 వరకు మొసళ్లు ఉన్నాయని, అవి నీటిని కలుషితం చేస్తున్నాయని ఎస్డీఎస్ఓ నివేదిక తెలిపింది. అవి బ్యారేజీ నిర్వహణ పనులకు ఆటకంగా మారాయని, గేట్లను దెబ్బతీస్తున్నాయని పేర్కొంది. వాటి వల్ల కూడా గేట్ల సీళ్లు కూడా పనిచేయడం లేదని పేర్కొంది. మొసళ్లను ప్రాజెక్టు నుంచి తరలించాలని సూచించింది.


జూరాలలో తెగినగేట్ల రోప్‌లు!

(మొదటిపేజీ తరువాయి)

ఊడి లీకేజీలు జరగడం, గ్రీసింగ్ లేకపోవడంతో రోప్‌లు తుప్పు పట్టడం, ఏటా పూర్తి స్థాయిలో నిర్వహణ లేకపోవడం.. ఇలా అనేక కారణాలతో క్రస్ట్ గేట్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ ఏడాది 8, 12, 19, 27, 28, 41, 45, 51 గేట్ల రోప్‌లను మార్చాలని నిర్ణయించి.. పనులు చేపట్టారు. అయితే, గేట్ల మరమ్మతులకు వినియోగించే గ్యాంటీ క్రేన్ తరచూ మొరాయిస్తుండడంతో రెండు నెలలుగా నాలుగు (28, 41, 45, 51వ నంబర్) గేట్లకు మాత్రమే కొత్త రోప్‌లను బిగించారు. మిగిలిన 28, 12, 19, 27 గేట్ల రోప్‌లను మార్చాల్సి ఉండగా.. కృష్ణా పరివాహక ప్రాంతాలలో కురిసిన వర్షాలతో ముందుగానే ప్రాజెక్టులోకి వరద వచ్చింది. దీంతో పనులకు బ్రేక్ పడింది. ఆ తర్వాత స్టాప్ లాక్ ఏర్పాటు చేసి, మరమ్మతులను మళ్లీ ప్రారంభించారు. ఈ క్రమంలో కొన్ని సార్లు లక్ష క్యూసెక్కుల కుపైగా వరద రావడం, స్టాప్‌లాక్ పై నుంచి నీరు పారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. సదరు సిబ్బంది ఆక్సిజన్ సిలిండర్ల సాయంతో నీళ్లలోకి దిగి కొన్నాళ్లు మరమ్మతులు చేపట్టారు. అయితే, అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో నీళ్లలో ఎక్కువ సేపు ఉండడం ఇబ్బందిగా మారి, పనులకు ఆటంకం కలిగింది. ఇదిలా కొనసాగుతుండగానే.. 9వ, 12వ నంబర్ గేట్లకు సంబంధించిన రోప్‌లు తెగి వేలాడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. 34వ గేటు రోప్ కూడా బలహీనంగా ఉందంటూ ప్రచారం జరిగింది. దీంతో మంత్రి జూపల్లి కృష్ణారావు.. ప్రాజెక్టు ఎస్ఈ రహిముద్దీన్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. అయితే, గేట్ల రోప్‌లు తెగిపోలేదని, సోషల్ మీడియా ప్రచారాన్ని నమ్మవద్దని ఎస్ఈ కోరగా.. వరద వస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

ఎంత వరదొచ్చినా.. ముప్పు ఏమీ లేదు

గేట్ల రోప్‌లు తెగిపోయాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండడంతో జూరాల ప్రాజెక్టు ఎస్ఈ రహిముద్దీన్ గురువారం మీడియాకు వివరణ ఇచ్చారు. గేట్ల మరమ్మతు పనులు ఇంకా కొనసాగుతున్నాయని, 9వ, 12వ నంబర్ గేట్ల రోప్స్ తెగిపోలేదని స్పష్టం చేశారు. ఎక్కువ వరద వచ్చి పనులు నిలిచిపోయినా, ప్రాజెక్టుకు వచ్చిన ప్రమాదం ఏమీ లేదని చెప్పారు. 2009లో 12లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు కూడా 50 గేట్లను మాత్రమే తెరిచామని గుర్తు చేశారు. ఒకవేళ అన్ని గేట్లను తెరవాల్సి వస్తే క్రేన్ల సాయంతో తెరుస్తామని వివరించారు. మిషన్ భగీరథ పథకం కోసం ఏడాదంతా ప్రాజెక్టులో నీరు నిల్వ చేయాల్సిన పరిస్థితి ఉంటోందని, ఈ కారణంగానే మరమ్మతు పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కాగా, జూరాల ప్రాజెక్టుపై ప్రభుత్వంతోపాటు అధికారులు కూడా అలసత్వం వహిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు.



తెగిపోయి వేలాడుతున్న 9వ నంబర్ గేటు రోప్

భూ సమస్యల పరిష్కారానికి ఫీజు చెల్లించాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాయి. 593 మండలాల్లో 10,725 సదస్సులు నిర్వహించగా సుమారు 9.16 లక్షల దరఖాస్తులు అందాయి. వీటిలో ఎక్కువగా విస్తీర్ణంలో తేడాలు, సర్వే నంబర్లు మిస్సింగ్, మ్యుటేషన్ చేయకపోవడం, అసైన్డ్ భూముల సమస్యలు, ఓఆర్సీ, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించడం, పాస్‌పుస్తకాలు ఇవ్వాలని, హక్కుల రికార్డులో తప్పుగా నమోదు చేసిన పేర్లు, సర్వే నంబర్లను సవరించాలని కోరినవే ఎక్కువగా ఉన్నాయి. ఏప్రిల్ 17 నుంచి జూన్ 20 వరకు మూడు విడతల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును ఉచితంగానే పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ ప్రకటించింది. కానీ, జూన్ 20 తర్వాత వచ్చే దరఖాస్తులకు మాత్రం నిబంధనల ప్రకారం రుసుములు చెల్లించాల్సి ఉంటుందని క్షేత్ర స్థాయి రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

భూభారతి నిబంధనల ప్రకారం..

భూ సమస్యల పరిష్కారానికి ఏ సేవకు ఎంత రుసుము చెల్లించాలనేదానిపై భూభారతి నిబంధనల్లో స్పష్టం చేశారు. భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రస్తుతం రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన ప్రకారం 7.5 శాతం స్టాంప్ డ్యూటీ చెల్లించాలి. మ్యుటేషన్ లేదా వారసత్వ సేవలకు అయితే ఎకరానికి రూ.2500 లేదా గుంటకు రూ.62.50 చొప్పున చలానా తీసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకం కావాలంటే రూ.300, హక్కుల నమోదు సవరణలు, అప్పీళ్ల కోసం రూ.1000, హక్కుల రికార్డు నకలు కోసం రూ.10, స్లాట్ రీ షెడ్యూల్‌కు తొలిసారి ఉచితం. రెండోసారి రూ.500, మూడోసారి ఆపైన ఆరు నెల లోపు రూ.1000 చెల్లించాలి.

కాళేశ్వరం రుణాల చెల్లింపుల్లో సర్కారు విఫలం

28లోపు 1,320 కోట్లు చెల్లించాలని ఆర్ఈసీ లేఖ

లేకుంటే.. దివాళాగా ప్రకటించే ప్రమాదం

రాష్ట్ర క్రెడిట్ రేటింగ్‌పైనా ప్రతికూల ప్రభావం

రేవంత్.. ఓ అవినీతి చక్రవర్తి: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. గురువారం ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్(కేఐపీసీఎల్), తెలంగాణ రాష్ట్ర జలవనరుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీఎల్) పేరుతో తీసుకున్న రుణాలకు సంబంధించి రూ.1,393.65 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ–రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ) రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిందని ఆమె వివరించారు. ఈ నెల 28లోపు ఆ బాకాయిలను చెల్లించాలని గడువు విధించిందని, లేని పక్షంలో దివాళా(నిరర్థక రుణం)గా ప్రకటించాల్సి వస్తుందని హెచ్చరించినట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్ర రుణపరపతి, క్రెడిట్ రేటింగ్‌పైనా ప్రతికూల ప్రభావం ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం రుణాల పునర్వ్యవస్థీకరణకు చేసిన విజ్ఞప్తిని ఆర్ఈసీ తిరస్కరించిందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి అవినీతి చక్రవర్తి అని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై త్వరలోనే పుస్తకాలను ప్రచురించి, రాష్ట్రమంతటా పంచుతామన్నారు. గురువారం ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 'రేవంత్ రెడ్డి కేవలం 18 నెలల్లోనే రూ.2లక్షల కోట్ల అప్పులు తెచ్చి, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చి.. కమీషన్లు తీసుకున్నారు. కొత్తగా ఒక్క పథకం కూడా అమలు చేయడం లేదు. పింఛన్లు పెంచడం లేదు. మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వకుండా.. అప్పు తెచ్చిన రూ.2 లక్షల కోట్లను ఏం చేశారు?" అని ఆమె ప్రశ్నించారు. తెచ్చిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2024 జూలై 6వ తేదీన ప్రజాభవన్‌లో రేవంత్‌రెడ్డితో సమావేశమైన తర్వాతే చంద్రబాబు పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. రేవంత్ రెడ్డి ఇప్పటికి కూడా పోలవరం - బనకచర్లపై అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ పెట్టాలని డిమాండ్ చేయడం లేదు. చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడాలంటేనే రేవంత్‌రెడ్డి భయపడుతున్నారు. చంద్రబాబుకు రేవంత్ రెడ్డి హైదరాబాద్ బిర్యానీ తినిపించి.. గోదావరి నీళ్లను గిఫ్ట్ ప్యాక్‌గా ఇచ్చారు" అని ఆరోపించారు. ఆంధ్రా బిర్యానీ ఎట్లుంటదో గతంలోనే కేసీఆర్ చెప్పారని ఆమె గుర్తుచేశారు.

జూరాల గేట్ రోప్ తెగిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

▸ ఇప్పటికైనా సీఎం, మంత్రులు మొద్దునిద్ర వీడాలి: కేటీఆర్



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు గేటు రోప్ తెగిపోవడానికి కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఒక్క ఇటుక పేర్చడం కూడా చేతకాని ముఖ్యమంత్రికి.. కనీసం ఉన్న ప్రాజెక్టుల నిర్వహణపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే జూరాల ప్రాజెక్టు ప్రమాదంలో పడిందని గురువారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఏటా వరద వస్తుందని తెలిసినా స్పిల్ వే వద్ద మెయింటెనెన్స్ పనులు చేయించడంలో రేవంత్ సర్కారు నిర్లిప్తత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జూరాలకు క్రమంగా వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడాలని సూచించారు. ఇప్పటికే ఈ ప్రభుత్వ అసమర్థత వల్ల ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దవాగుకు గండిపడి 16 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, వట్టెం ప్రాజెక్టు పంప్ హౌజ్ మునిగిపోయిందని తెలిపారు. తాజాగా జూరాల గేట్ రోప్ తెగిపోవడంతోపాటు ఇతర గేట్ల రోప్‌లు కూడా బలహీనంగా ఉన్నాయని పేర్కొన్నారు. పుణెలో మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపిన కేంద్రం.. హైదరాబాద్ మెట్రో విస్తరణను విస్మరించడమేంటనికేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బీజేపీ ఎంపీలుండి తెలంగాణకు ఏం లాభం చేకూర్చారని, వారు ఎవరి కోసం పనిచేస్తున్నారని నిలదీశారు. గుజరాత్‌కు రూ.2 లక్షల కోట్లతో బుల్లెట్ రైళ్లను ఆమోదిస్తారు కానీ హైదరాబాద్‌లో కనీసం మెట్రో ప్రాజెక్టులను కూడా ఆమోదించరా..? అని ప్రశ్నించారు.

అల్కారజ్ 2 క్రెజికోవా 17



వింబుల్డన్ సీడింగ్స్

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ చాంపియన్‌షిప్ ఈనెల 30న ప్రారంభం కానుంది. వచ్చే నెల 13 వరకు జరిగే ఈ టోర్నీకి సీడింగ్‌ల వివరాలను గురువారం వెల్లడించారు. పురుషుల డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్‌కు రెండో సీడింగ్ కేటాయించగా..మహిళల విజేత బార్బరా క్రెజికోవాకు 17వ సీడింగ్ లభించింది. గత సోమవారం విడుదలైన ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా ఈ సీడింగ్‌లు కేటాయించారు. ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ జానిక్ సినర్‌కు టాప్ సీడింగ్ లభించింది. రెండు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ సబలెంక, ఫ్రెంచ్ ఓపెన్ విజేత గాఫ్ టాప్, రెండో సీడింగ్‌లతో బరిలో దిగనున్నారు.

హ్యాట్రిక్ టైటిళ్లతో భారత్ చరిత్ర

ఆసియా స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్స్



అనాహత్ - జోష్న

కౌలాలంపూర్: ఆసియా స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ మూడు టైటిళ్లతో క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. పురుషుల, మహిళల డబుల్స్‌తోపాటు మిక్స్‌డ్ విభాగంలోనూ భారత్ జయభేరి మోగించింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో అభయ్ సింగ్-వెలవన్ జోడీ 9-11, 11-5, 11-5తో పాకిస్థాన్‌కు చెందిన నూర్-నాసిర్‌పై గెలిచింది. మహిళల డబుల్స్ తుది పోరులో జోష్న చినప్ప-అనాహత్ సింగ్ జంట 8-11, 11-9, 11-10తో మలేసియాకు చెందిన ఐన్నా అమానీ-జిన్ యింగ్‌పై, మిక్స్‌డ్‌లో అభయ్-అనాహత్ సింగ్ జోడీ 11-9, 11-7తో మలేసియా జంట రేచల్ అర్నాల్డ్-అమీషన్‌రాజ్ చంద్రన్‌పై విజయం సాధించాయి. దీంతో అభయ్, అనాహత్ డబుల్ టైటిల్స్ సాధించినట్టయింది.

టిక్కెట్లు అమ్ముడుపోయాయ్ !

నవంబరులో ఆస్ట్రేలియా x భారత్ సిరీస్

సిడ్నీ: క్రికెట్ ఆడే దేశాలలో టీమిండియాకున్న క్రేజ్ చెప్పనలవి కాదు..ఏ దేశంలో పర్యటించినా భారత జట్టు ఆడే మ్యాచ్‌లకు క్రికెట్ ఫ్యాన్స్ పోటెత్తుతారు. దటీజ్ టీమిండియా. ఇకపోతే ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌కోసం వచ్చే అక్టోబరు-నవంబరులో భారత జట్టు ఆ దేశంలో పర్యటించనుంది. ఇందులో భాగంగా ఇరు జట్లు మూడు వన్డేలు, ఐదు టీ20లలో తలపడనున్నాయి. సిరీస్‌లో మూడో వన్డే (అక్టోబరు 25)కు సిడ్నీ, తొలి టీ20 (అక్టోబరు 29)కి కాన్‌బెరా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ రెండు మ్యాచ్‌లకు సంబంధించిన టిక్కెట్లను అమ్మకానికి పెట్టగా..హాట్ కేకుల్లా అభిమానులు కొనేశారు. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) గురువారం వెల్లడించింది.

ఆర్చర్ వచ్చేశాడు..



రెండో టెస్టుకు ఇంగ్లండ్ జట్టు

బర్మింగ్‌హామ్: నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పేసర్ జోఫ్రా ఆర్చర్ ఇంగ్లండ్ టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. వచ్చేనెల 2 నుంచి భారత్‌తో జరగబోయే రెండో టెస్టు కోసం 15 మందితో కూడిన జట్టును సెలెక్టర్లు గురువారం ప్రకటించారు. 30 ఏళ్ల ఆర్చర్ రాకతో ఇప్పటికే ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్‌పై 1-0 ఆధిక్యంలో ఉన్న స్టోక్స్ సేన బౌలింగ్ మరింత పటిష్ఠం కానుంది. కొన్నేళ్లుగా గాయాలతో సతమతమవుతున్న తను చివరిసారిగా 2021, ఫిబ్రవరిలో భారత్‌పైనే టెస్టు ఆడాడు. ఇక ఆర్చర్ మినహా తొలి టెస్టుకు ఎంపిక చేసిన జట్టులో ఎలాంటి మార్పులు లేవు.

జట్టిదే: బెన్ స్టోక్స్ (కెప్టెన్), క్రాలే, డకెట్, బ్రూక్, రూట్, స్మిత్, పోప్, సామ్ కుక్, ఒవర్టన్, వోక్స్, బషీర్, ఆర్చర్, బెథెల్, టంగ్, కార్స్

ఢిల్లీ ఫ్రీస్టయిల్ చెస్‌కు స్పాన్సర్లు కరవు



న్యూఢిల్లీ: స్పాన్సర్లు ముందుకు రాకపోవడంతో భారత్‌లో జరగాల్సిన ప్రతిష్ఠాత్మక ఫ్రీస్టయిల్ చెస్ టోర్నమెంట్ తరలిపోనుంది. ఈ భారత అంచె టోర్నమెంట్ సెప్టెంబరు 17 నుంచి 24 వరకు ఇక్కడ జరగాల్సి ఉంది. కానీ ఈ టోర్నీని స్పాన్సర్ చేసేందుకు దేశంలోని ఏ సంస్థా ముందుకు రాలేదట. దీంతో వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్ ఆటను ప్రత్యక్షంగా చూడాలన్న భారత చెస్ అభిమానులకు నిరాశే మిగలనుంది. వివిధ అంచెలలో నిర్వహించే ఫ్రీస్టయిల్ చెస్ చాంపియన్‌షిప్‌లో..మూడు అంచెలు ముగిశాయి. కార్ల్‌సన్ 65 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి (16) ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. ఢిల్లీలో జరగాల్సింది నాలుగో అంచె టోర్నమెంట్.

నిస్సాంక అజేయ శతకం

లంక 290/2

కొలంబో: ఓపెనర్ పథుం నిస్సాంక (146 బ్యాటింగ్) అజేయ శతకంతో.. బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక భారీ ఆధిక్యానికి రంగం సిద్ధంచేసుకుంది. రెండో రోజైన గురువారం ఆట ముగిసేసరికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 290/2 పరుగులు సాధించింది. నిస్సాంకతోపాటు ప్రభాత్ జయసూర్య (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. నిస్సాంక, దినేశ్ చాందిమల్ (93) రెండో వికెట్‌కు 194 రన్స్ చేశారు. కాగా, ఓవర్‌నైట్ స్కోరు 220/8తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 247 పరుగులకు ఆలౌటైంది.

టెస్టుల్లోనూ స్టాప్ క్లాక్

స్లో ఓవర్ రేట్‌కు చెక్

ఐసీసీ నిర్ణయం



దుబాయ్: క్రికెట్‌ను మరింత ఆకర్షణీయంగా, పోటీతత్వం పెంచేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తమ నిబంధనలను మార్చడం పరిపాటి. ఇటీవలే వన్డేల్లో ఒకే బంతి, బౌండరీ క్యాచ్‌లు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ అంశాలపై రూల్స్‌ను సవరించిన విషయం తెలిసిందే. తాజాగా మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిలో భాగంగా టెస్టుల్లో స్లో ఓవర్ రేట్‌కు చెక్ పెట్టేందుకు స్టాప్ క్లాక్‌ను ప్రవేశపెట్టింది. ఒక రోజులో 90 ఓవర్లు పూర్తి కావాల్సి ఉండగా.. చాలాసార్లు అలా జరగకపోవడం చూస్తూనే ఉంటాం. అందుకే ఇక నుంచి ఓవర్ పూర్తయిన 60 సెకన్లలోపే తర్వాతి ఓవర్‌ను మొదలెట్టాలి. అలా జరగకపోతే ఫీల్డింగ్ జట్టు కెప్టెన్‌ను అంపైర్లు రెండుసార్లు హెచ్చరిస్తారు. మూడోసారి రిపీట్ అయితే మాత్రం పెనాల్టీ కింద ప్రత్యర్థి జట్టుకు అదనంగా ఐదు పరుగులను కోల్పోవాల్సి ఉంటుంది. 80వ ఓవర్ వరకు ఇలా ఎన్నిసార్లు జరిగినా కూడా పెనాల్టీ రన్స్ విధిస్తారు. డబ్ల్యూటీసీ కొత్త సీజన్ (2025-2027) నుంచే ఇది అమల్లోకి వస్తుందని ఐసీసీ వెల్లడించింది. వాస్తవానికి వన్డే, టీ20ల్లో గతేడాది జూన్ ఒకటి నుంచే ఈ స్టాప్ క్లాక్ రూల్ కొనసాగుతోంది.

ఉమ్మి పూసినా..

మ్యాచ్ సమయంలో బౌలర్లు బంతికి లాలాజలం పూయడంపై నిషేధం కొనసాగుతోంది. అయితే ఇక నుంచి బౌలర్లు తమ ఉమ్మి పూశారనే కారణంతో అంపైర్లు బంతిని మార్చాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కొత్త బంతి కోసం ఒక్కోసారి బౌలింగ్ జట్టు సభ్యులు కావాలనే ఉమ్మి పూస్తుంటారు. దీన్ని ఎదుర్కొనేందుకే కొత్త రూల్ తీసుకువచ్చారు. అయితే ఇంతకుముందులాగే బంతి పూర్తిగా దెబ్బతిన్నప్పుడు మాత్రమే దాన్ని మార్చాల్సి ఉంటుంది.

డీఆర్ఎస్ అవుట్ విషయంలో..

వికెట్ కీపర్ పట్టిన క్యాచ్ విషయంలో బ్యాటర్ రివ్యూకు వెళ్లినప్పుడు అల్ట్రాఎడ్జ్‌లో బంతి బ్యాట్‌కు తాకిందా? ప్యాడ్‌కు తాకిందా? అని పరిశీలిస్తారు. క్యాచ్ కాదని తెలియగానే థర్డ్ అంపైర్ వెంటనే ఎల్బీ కోసం కూడా చెక్ చేస్తాడు. అయితే బాల్ ట్రాకింగ్‌లో అవుట్‌గా తేలితే అంపైర్ కాల్ ప్రకారం బ్యాటర్ పెవిలియన్‌కు చేరాల్సిందే.

పూర్తి రన్ తీయాల్సిందే..

బ్యాటర్ ఉద్దేశపూర్వకంగా తన రన్ పూర్తి చేయకుండా (క్రీజులో బ్యాట్ పెట్టకుండా) మరో సింగిల్ కోసం వెళితే ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తారు. అలాగే తర్వాత బంతిని ఏ బ్యాటర్ ఎదుర్కోవాలనేది ఫీల్డింగ్ జట్టు నిర్ణయించవచ్చు.

నోబాల్ క్యాచ్‌పై..

గతంలో నోబాల్‌కు ఫీల్డర్ క్యాచ్ పట్టుకుంటే దాన్ని సరిగ్గా పట్టుకున్నాడా? లేదా? అని రివ్యూ చేసేవారు కాదు. కానీ ఇప్పుడు థర్డ్ అంపైర్ పరిశీలించి సరైన క్యాచ్ అని తేలితే బ్యాటింగ్ జట్టుకు నోబాల్ రన్ మాత్రమే ఇస్తారు. అదే క్యాచ్ సరిగ్గా లేకపోతే బ్యాటర్లు ఎన్ని పరుగులు చేస్తే అన్ని రన్స్ పరిగణనలోకి తీసుకుంటారు.

ఆసియా జూ. బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

టీమ్‌లో తన్వీ, వెన్నెల, ప్రణవ్

డబుల్స్‌లో భార్గవ్, కీర్తి జోడీలు

న్యూఢిల్లీ: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేసిన జట్టులో తెలుగు ప్లేయర్లు వెన్నెల కోలగట్ల, తన్వీ రెడ్డి అండ్లూరి, ప్రణవ్ రామ్‌తోపాటు భార్గవ్, కీర్తి జోడీలకు చోటు దక్కింది. మొత్తం 19 మంది జట్టు సభ్యులను భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) గురువారం ప్రకటించింది. ఈ టోర్నీ జూలై 18 నుంచి 27 వరకు ఇండోనేసియాలో జరగనుంది. టీమ్, వ్యక్తిగత విభాగాల్లో భారత షట్లర్లు తలపడనున్నారు. తెలంగాణకు చెందిన వెన్నెల, తన్వీ, ప్రణవ్ సింగిల్స్‌లో బరిలోకి దిగనుండగా.. మిక్స్‌డ్‌లో కీర్తి మంచాల-విష్ణు కేదార్ జోడీ ఆడనుంది. పురుషుల డబుల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భార్గవ్ రామ్ అరిగెల్ల-విశ్వతేజ గొబ్బూరు జోడీ సత్తాచాటనుంది. గతంలో ఇదే ఈవెంట్‌లో పీవీ సింధు, లక్ష్య సేన్ స్వర్ణాలు గెలిచారు.

విశాఖ ఇండస్ట్రీస్ కేసులో హెచ్‌సీఏకు ఎదురుదెబ్బ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో వ్యాపార ప్రకటనల హక్కులకు సంబంధించి విశాఖ ఇండస్ట్రీస్‌తో జరిగిన ఒప్పందం విషయంలో హైదరాబాద్ క్రికెట్ సంఘానికి (హెచ్‌సీఏ) ఎదురుదెబ్బ తగిలింది. విశాఖ ఇండస్ట్రీస్‌తో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయనందుకు హెచ్‌సీఏ రూ.25 92 కోట్లు చెల్లించాలని, ఈ మొత్తం చెల్లించే వరకు 18 శాతం వడ్డీ లెక్కగట్టాలని అర్బిట్రేషన్ అవార్డు జారీ అయింది. ఈ అవార్డును హెచ్‌సీఏ 2016లో కమర్షియల్ కోర్టులో సవాల్ చేయగా 2024లో కమర్షియల్ కోర్టు హెచ్‌సీఏ పిటిషన్‌ను కొట్టేసింది. కమర్షియల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హెచ్‌సీఏ హైకోర్టులో అప్పీల్ చేసింది. కాగా హైకోర్టులో సైతం హెచ్‌సీఏకు ఎదురుదెబ్బ తగిలింది. హెచ్‌సీఏకు వ్యతిరేకంగా జారీ అయిన అర్బిట్రేషన్ అవార్డును హైకోర్టు సమర్థించింది. హెచ్‌సీఏ ఏ దశలోనూ న్యాయబద్ధంగా ఆట ఆడలేదని.. కనీసం అవార్డుకు సంబంధించిన చట్టబద్ధమైన సెక్యూరిటీ డిపాజిట్ కూడా చేయలేదని హైకోర్టు తప్పుబట్టింది. హెచ్‌సీఏ క్రీడాస్ఫూర్తిలేని తన అసలు రంగును బయటపెట్టిందని హైకోర్టు వ్యాఖ్యానించింది.

రెండో టెస్ట్‌కు బుమ్రా దూరం?



న్యూఢిల్లీ: రెండో టెస్ట్ ముందు భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. టీమిండియా ఎంతో ఆధారపడిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బర్మింగ్‌హామ్ టెస్ట్‌కు దూరమవుతాడన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. తొలి టెస్ట్‌లో మిగతా పేసర్లు విఫలమైనా బుమ్రా ఒంటరి పోరాటం చేశాడు. అయితే, పనిభారం నిర్వహణలో భాగంగా బర్మింగ్‌హామ్ టెస్ట్‌కు బుమ్రాకు విశ్రాంతినివ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు సమాచారం. దీంతో లార్డ్స్‌లో జరిగే మూడో టెస్ట్‌కు అతడు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అయితే, లీడ్స్‌లో అనూహ్యంగా ఓటమిపాలైన భారత్.. పుంజుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత మాజీ ఆటగాడు రవిశాస్త్రి చెప్పాడు. బుమ్రాకు విశ్రాంతినిస్తే భారత్ 0-2తో వెనుకబడే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. 'ఈ సిరీస్‌లో మూడు టెస్టులు మాత్రమే ఆడతానని బుమ్రా చెప్పాడు. కానీ, అవి ఏవేవో చెప్పలేదు. ఒకవేళ రెండో మ్యాచ్‌కు దూరమైతే.. లార్డ్స్ టెస్ట్‌లో కచ్చితంగా ఆడాలనుకొంటాడు. అయితే, బర్మింగ్‌హామ్‌లో బుమ్రా బరిలోకి దిగకపోతే భారత్ 0-2తో వెనుకబడుతుంది. టీమిండియా పోటీలో ఉండాలంటే మాత్రం బుమ్రా ఆడి తీరాల'ని శాస్త్రి చెప్పాడు. ఇంగ్లండ్ బౌలింగ్ బలహీనంగా ఉండడంతోపాటు ఆ టీమ్‌ను గాయాల బెడద వెంటాడుతోందన్నాడు. వీటిని అవకాశాలుగా మలచుకొని భారత్ పంచ్ ఇవ్వాలని సూచించాడు. అలా జరగాలంటే టీమ్‌లో బుమ్రా ఉండాలని అన్నాడు.

హైదరాబాద్‌లో జాతీయ బాక్సింగ్

బరిలో లవ్లీనా, నిఖత్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎలీట్ మహిళల జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. శనివారం నుంచి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఒలింపియన్లు నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గొహైన్, ప్రపంచ యూత్ మాజీ చాంపియన్ అంకుషిత బోరో బరిలోకి దిగుతున్నారు. మొత్తం 15 రాష్ట్రాలకు చెందిన వందమందికి పైగా బాక్సర్లు 10 కేటగిరీల్లో తలపడనున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ బాక్సింగ్ సమాఖ్య సంయుక్తంగా ఈ టోర్నీని నిర్వహిస్తున్నాయి.

వెస్టిండీస్ 190 ఆలౌట్

బార్బడోస్: ఆస్ట్రేలియా-వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టులో బౌలర్ల ఆధిపత్యం సాగుతోంది. తొలి ఐదు సెషన్లలోనే ఇరు జట్లు ఆలౌట్ కావడం విశేషం. గురువారం రెండో రోజు టీ విరామ సమయానికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌ను 63.2 ఓవర్లలో 190 పరుగుల దగ్గర ముగించింది. దీంతో 10 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. హోప్ (48), చేస్ (44) రాణించారు. స్టార్క్‌కు 3... వెబ్‌స్టర్, హాజెల్‌వుడ్, కమిన్స్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే కుప్పకూలింది. హెడ్ (59), ఖవాజా (47), కమిన్స్ (28) ఆకట్టుకున్నారు.

వడ్డీ రేట్లను వెంటనే తగ్గించండి

- జాప్యం చేయొద్దు
- బ్యాంకులకు ఆర్‌బీఐ సూచన



ముంబై: తగ్గిన రెపో రేటుకు అనుగుణంగా బ్యాంకులన్నీ తమ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కోరింది. ఈ నెల 6న జరిగిన ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షలో ఆర్‌బీఐ కీలక రెపో రేటును ఆరు శాతం నుంచి 5.5 శాతానికి కుదించింది. ఈ నేపథ్యంలో తగ్గించిన రెపో రేటు స్థాయిలోనే బ్యాంకులు వెంటనే తమ రుణాలపై వసూలు చేసే వడ్డీ రేట్లు తగ్గించాలని గురువారం వెలువడిన జూన్ నెల ఆర్‌బీఐ బులెటిన్‌లో ప్రచురితమైన ఒక వ్యాసంలో ఆర్థికవేత్తలు సూచించించారు. బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద హామీగా ఉంచాల్సిన నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)నీ ఆర్‌బీఐ ఈ నెల 6న నాలుగు నుంచి మూడు శాతానికి కుదించింది. దీంతో ఈ ఏడాది చివరికల్లా బ్యాంకులకు రూ.2.5 లక్షల కోట్ల నిధులు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. ఇవన్నీ బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గించేందుకు అనువైన పరిస్థితులేనేని ఆ బులెటిన్ పేర్కొంది.

పరోక్ష మొట్టికాయ: రెపో రేటు తగ్గించిన కొద్ది రోజులకే ఎస్‌బీఐ, బీఓబీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో పాటు అనేక బ్యాంకులు తమ రుణాలపై వడ్డీ రేట్లను అర శాతం (0.5%) తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. ఇంకా కొన్ని బ్యాంకులు ఈ తగ్గింపును తమ రుణ ఖాతాదారులకు బదిలీ చేసేందుకు మీనమేషాలు లెక్కబెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా బులెటిన్ ఆ బ్యాంకులను సుతిమెత్తగా హెచ్చరించిందని భావిస్తున్నారు.

పోకో ఎఫ్7 5జీ స్మార్ట్‌ఫోన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ పోకో.. మార్కెట్లోకి సరికొత్త 5జీ స్మార్ట్‌ఫోన్ పోకో ఎఫ్7 విడుదల చేసింది. భారత్‌లోనే తొలిసారిగా 7,550 ఎంఏహెచ్ బ్యాటరీతో దీన్ని రూపొందించినట్లు సంస్థ ప్రొడక్ట్ మేనేజర్ సచిన్ దేవ్ వెల్లడించారు. సిలికాన్ కార్బన్‌తో కూడిన ఈ బ్యాటరీ దీర్ఘకాలం సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 చిప్‌సెట్, 6.83 అంగుళాల స్క్రీన్, 50 ఎంపీ సోనీ ఐమ్యాక్స్882 కెమెరాతో రెండు వేరియంట్లలో ఈ ఫోన్ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. 12 జీబీ రామ్, 256 జీబీ మెమరీతో కూడిన ఎఫ్ 7 ధర రూ.29,999గా ఉండగా 12 జీబీ రామ్ 512 జీబీ మెమరీతో కూడిన ఫోన్ ధర రూ.31,299గా ఉంది. జూలై 1న ఈ-కామర్స్ పోర్టల్ ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఈ ఫోన్‌ను విడుదల చేయనున్నట్లు సచిన్ తెలిపారు.

ఇళ్ల అమ్మకాలకు ధరల పోటు

20%పడిపోయిన అమ్మకాలు: అనరాక్

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు నేలచూపులు చూస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో ఈ ఏడు నగరాల్లో 1,20,335 ఇళ్లు, ఫ్లాట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 20 శాతం తక్కువ. రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. పుణె, హైదరాబాద్ నగరాల్లో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా 27 శాతం వరకు ఉంది. ఈ కాలంలో హైదరాబాద్‌లో అమ్మకాలు 15,085 యూనిట్ల నుంచి 11,040 యూనిట్లకు పడిపోయాయి. చెన్నైలో మాత్రం గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో అమ్మకాలు 11 శాతం పెరిగాయి. గత ఏడాది తొలి 6 నెలలతో పోలిస్తే ధరలు 11 శాతం పెరగడం, జాతీయ, అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇందుకు కారణమని అనరాక్ ఛైర్మన్ అనూజ్ పురి చెప్పారు.

ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో పెరుగుదల: నివాస గృహాల మార్కెట్ అంతంత మాత్రంగానే ఉన్నా ఆఫీస్ కార్యాలయాలకు మాత్రం మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో గత మూడు నెలల్లో (ఏప్రిల్-జూన్) ఈ ఏడు ప్రధాన నగరాల్లో 178 లక్షల చదరపు అడుగుల లీజుకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ కోలియర్స్ ఇండియా తెలిపింది. ఈ కాలంలో హైదరాబాద్‌లో 32 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజుకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయి.

బ్రాండ్ బాజా..

సత్తా చాటుతున్న దేశీయ కంపెనీల బ్రాండ్లు

- టాప్-100 బ్రాండ్స్ విలువ రూ.20.27 లక్షల కోట్లు
- అగ్రస్థానంలో టాటా బ్రాండ్ : బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: బ్రాండ్ వాల్యూ విషయంలో మన దేశీయ కంపెనీలూ సత్తా చాటుతున్నాయి. ప్రస్తుతం భారత్‌లోని టాప్-100 కంపెనీల బ్రాండ్ వాల్యూ 23,650 కోట్ల డాలర్ల (సుమారు రూ.20.27 లక్షల కోట్లు) వరకు ఉంటుందని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా సంస్థ ఒక నివేదికలో తెలిపింది. ఇందులో టాటా గ్రూప్ బ్రాండ్ విలువే 3,160 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.78 లక్షల కోట్లు) మేర ఉందని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం టాటా గ్రూప్ బ్రాండ్ విలువ 10 శాతం పెరిగింది. బ్రాండ్ వాల్యూ 3,000 కోట్ల డాలర్లకు మించిన తొలి భారత పారిశ్రామిక గ్రూప్ కూడా టాటా గ్రూపేనని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా తెలిపింది. బ్రాండ్ వాల్యూపరంగా టాటా గ్రూప్ తర్వాత ఇన్ఫోసిస్ (1,630 కోట్ల డాలర్లు), హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ (1,420 కోట్ల డాలర్లు), ఎల్ఐసీ (1,360 కోట్ల డాలర్లు), రిలయన్స్ గ్రూప్ (980 కోట్ల డాలర్లు), ఎస్‌బీఐ గ్రూప్ (960 కోట్ల డాలర్లు), హెచ్‌సీఎల్ టెక్ (890 కోట్ల డాలర్లు), ఎయిర్‌టెల్ (770 కోట్ల డాలర్లు), ఎల్ అండ్ టీ గ్రూప్ (740 కోట్ల డాలర్లు), మహీంద్రా గ్రూప్ (720 కోట్ల డాలర్లు) వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

పటిష్ఠమైన టాప్-10 బ్రాండ్ కంపెనీలు

కంపెనీ పేరు	పాయింట్ల వారీగా
తాజ్ హోటల్స్	92.2
ఏషియన్ పెయింట్స్	92.0
అమూల్	91.2
హీరో	91.0
తనిష్క్	90.0
మారుతి సుజుకీ	89.1
రాయల్ ఎన్‌ఫీల్డ్	88.7
ఎల్ఐసీ గ్రూప్	87.6
ఇండిగో	87.6
హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్	86.4

దూకుడుగా అదానీ గ్రూప్

ఇక వేగంగా బ్రాండ్ వాల్యూ పెంచుకుంటున్న పారిశ్రామిక సంస్థల్లో అదానీ గ్రూప్ అగ్రస్థానంలో ఉంది. గత సంవత్సర కాలంలో ఈ గ్రూప్ బ్రాండ్ వాల్యూ 82 శాతం పెరిగింది. కంపెనీల పరంగా చూస్తే తాజ్ హోటల్స్, ఏషియన్ పెయింట్స్, అమూల్ ముందున్నాయి.

బిజినెస్

హైదరాబాద్‌లో బృహస్పతి టెక్నాలజీస్ ప్లాంట్

రూ.70 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత నిఘా, సెక్యూరిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్ రూ.70 కోట్ల పెట్టుబడితో సీసీటీవీ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. గురువారం నాడిక్కడ కంపెనీ ఎండీ రాజశేఖర్ పాపోలు మాట్లాడుతూ.. హైదరాబాద్ సమీపంలోని తునికి బొల్లారంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నెలకు 2.5 లక్షల యూనిట్ల సామర్థ్యంతో నెలకొల్పుతున్న ఈ ప్లాంట్ వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి రానుందన్నారు. కంపెనీ ఇప్పటికే పటాన్‌చెరులో అసెంబ్లింగ్ యూనిట్‌ను నిర్వహిస్తోందని తెలిపారు.

కాగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) అయిన కింగ్స్‌మెన్ గ్లోబల్, సిట్రస్ గ్లోబల్ నుంచి రూ.85 కోట్ల నిధులను సమీకరించినట్లు రాజశేఖర్ వెల్లడించారు. అలాగే మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎంఎస్ఆర్‌టీసీ) నుంచి రూ.102 కోట్ల విలువైన కాంట్రాక్టును దక్కించుకున్నట్లు ఆయన చెప్పారు. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకి రావాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరం కంపెనీ టర్నోవర్ రూ.250 కోట్లుగా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.450 కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజశేఖర్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	575
వరంగల్	552	గోదావరి	560
చిత్తూరు	623	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	100
వరంగల్	93	గుంటూరు	105
కరీంనగర్	93	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	103
కర్నూలు	93	నెల్లూరు	108
విశాఖపట్నం	89	అనంతపురం	108
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,900 ▼	90,650 ▼	1,18,000 ▼
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,00,220 ▲	90,700 ▼	1,18,000 ▼
రాజమండ్రి	98,950 ▼	90,700 ▼	1,08,800 ▼
ప్రొద్దుటూరు	97,700 ▼	89,880 ▼	1,07,500 ▲
ముంబై	97,159 ▼	88,998 ▼	1,07,150 ▲

3 రోజులు.. రూ.9.70 లక్షల కోట్లు

మార్కెట్లో అదే జోరు.. సెన్సెక్స్ 1000 పాయింట్లు అప్

ముంబై: పశ్చిమాసియా ఉద్రిక్తతలు సడలిన నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజు కూడా ర్యాలీలో పురోగమించింది. ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడంతో పాటు మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ కౌంటర్లలో జరిగిన భారీ కొనుగోళ్లు మార్కెట్‌ను గురువారం ఉరకలెత్తించాయి. అంతర్జాతీయ విపణిలో అదుపులోనే ఉన్న క్రూడాయిల్ ధర (బ్యారెల్ 67.80 డాలర్లు) సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. ఈ నేపథ్యంలో గురువారం సెన్సెక్స్ 1000.36 పాయింట్లు లాభపడి 83,755.87 వద్ద ముగియగా నిఫ్టీ 304.25 పాయింట్లు లాభపడి 25,549 వద్ద క్లోజైంది. మూడు వరుస సెషన్లలో సెన్సెక్స్ 1859.08 పాయింట్లు లాభపడింది. బీఎస్ఈలో లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ విలువ మూడు రోజుల్లో రూ.9.7 లక్షల కోట్లు పెరిగి రూ.457 లక్షల కోట్లకు చేరింది.

ఎన్ఎస్ఈలో ఎలక్ట్రిసిటీ ఫ్యూచర్స్

రాబోయే రెండు, మూడు వారాల్లో ఎలక్ట్రిసిటీ ఫ్యూచర్స్ కాంట్రాక్టులు ప్రవేశపెట్టనున్నట్టు ఎన్ఎస్ఈ ప్రకటించింది. విద్యుత్ కొనుగోలుదారులు, విక్రేతలు, ట్రేడర్లు, పారిశ్రామిక రంగం, రిటైలర్లు ధరల రిస్క్ తగ్గించుకోవడానికి ఈ చర్య దోహదపడుతుందని తెలిపింది. త్వరలోనే దీని ప్రారంభ తేదీని ప్రకటించనున్నట్టు ఎన్ఎస్ఈ పవర్ విభాగం హెడ్ హరీశ్ అహూజా తెలిపారు.

ఆర్ఐఎల్ మళ్లీ 20 లక్షల కోట్ల శిఖరం పైకి...

అత్యంత విలువైన దేశీయ కంపెనీ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ మరోసారి రూ.20 లక్షల కోట్ల మార్కెట్ విలువ గల కంపెనీగా అవతరించింది. గురువారం బీఎస్ఈలో ఆర్ఐఎల్ షేరు 1.90% లాభపడి రూ.1,495.20 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో సైతం అదే శాతం లాభంతో రూ.1,495.30 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.37,837.9 కోట్లు పెరిగి రూ.20,23,375.31 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఇప్పటికి రిలయన్స్ షేరు 23 శాతం లాభపడగా ఫిబ్రవరి 13వ తేదీన ఆర్ఐఎల్ తొలిసారిగా రూ.20 లక్షల కీలకమైన మైలురాయిని చేరింది. మార్కెట్ విలువపరంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.15,51,218.93 కోట్లు), టీసీఎస్ (రూ.12,45,219.09 కోట్లు), భారతి ఎయిర్‌టెల్ (రూ.11,4,8,518.05 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.10,27,838.79 కోట్లు)తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

నెస్లె ఇండియా 1:1 బోనస్ షేరు

ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లె ఇండియా డైరెక్టర్ల బోర్డు బోనస్ షేర్ల జారీకి అనుమతించింది. ప్రస్తుత షేర్‌హోల్డర్లందరికీ వారి వద్ద గల రూపాయి ముఖ విలువ గల ఒక్కో షేరుకు అదే ముఖ విలువ గల ఒక షేరు బోనస్‌గా జారీ చేయనున్నట్టు తెలిపింది. ఇందుకు రికార్డు తేదీని త్వరలో ప్రకటించనున్నట్టు వెల్లడించింది. ఈ నిర్ణయం వచ్చే నెల 24వ తేదీన జరుగనున్న కంపెనీ వాటాదారుల అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం) అనుమతికి లోబడి ఉంటుందని ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సురేశ్ నారాయణన్ తెలిపారు.

మెడికల్ రీ-యింబర్స్ బిల్లులకు ఆమోదం



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర సర్కార్ తీపి కబురు అందించింది. రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ బిల్లులను క్లియర్ చేసింది. దీంతో బిల్లుల క్లియరెన్స్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఊపిరి పీల్చుకున్నారు. ఈ బిల్లులకు సంబంధించి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఒకేసారి రూ.180.38 కోట్లను విడుదల చేశారు. రైతు భరోసా కింద ప్రభుత్వం తొమ్మిది రోజుల వ్యవధిలోనే రూ.9 వేల కోట్ల సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే ఉద్యోగుల మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ బిల్లులను కూడా క్లియర్ చేయడం గమనార్హం. ఒక వైపు తీవ్ర ఆర్థిక ఇబ్బందులున్నా.. సంక్షేమ పథకాలకు నిధులను విడుదల చేయాల్సి ఉన్నా.. ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ బిల్లుల క్లియరెన్స్‌కు రూ.180 కోట్లను విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్ణయం తీసుకున్నారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రభుత్వం ఒక ఆదర్శ కుటుంబంగా భావించి, వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారానికి సంబంధించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, త్వరలోనే కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఆరోగ్య బీమా పథకం కూడా సిద్ధమవుతోందని ఆయన వివరించారు.

48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ

» నోటిఫికేషన్ జారీ చేసిన ఎంహెచ్‌ఎస్ఆర్‌బీ

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ (డీఏఎస్) పోస్టుల భర్తీకి తెలంగాణ వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు (ఎంహెచ్‌ఎస్ఆర్‌బీ) గురువారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇందులో తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కింద 42 పోస్టులు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్(ఐఎంఎస్) కింద 6 పోస్టులున్నాయని, వీటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. ఈ పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జన్(బీడీఎస్) కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. తెలంగాణ డెంటల్ కౌన్సిల్‌లో తప్పకుండా రిజిస్టర్ అయి ఉండాలి. జూలై 14 నుంచి దరఖాస్తు చేసుకోవడానికి బోర్డు వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తుంది. జూలై 25 వరకు దరఖాస్తుకు గడువు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులను జూలై 26 నుంచి 28 వరకు ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించారు. 95శాతం స్థానికత ఆధారంగా పోస్టుల భర్తీ ఉంటుందని ఎంహెచ్‌ఎస్ఆర్‌బీ వివరించింది. కాగా.. వైద్య ఆరోగ్య శాఖలోని వైద్య విద్యా సంచాలకుల(డీఎంఈ) పరిధిలో మరో 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు కూడా ఎంహెచ్‌ఎస్ఆర్‌బీ గురువారం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టులకు జూలై 12 నుంచి 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.

అధికారులు బాధ్యతగా పని చేయాలి: జూపల్లి

» ఆర్థిక ఇబ్బందులున్నా.. పక్కాగా పథకాల అమలు: వివేక్

ఆదిలాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అభివృద్ధికి అధికారులు బాధ్యతయుతంగా పని చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. గురువారం మంత్రి గడ్డం వివేక్‌తో కలిసి ఆయన ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. అనంతరం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం చేపట్టిన పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చట్టాలను చేస్తే వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. హామీ లను, సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తామన్నారు.

గురుకులాల పనివేళల మార్పునకు సీఎం ఓకే

» ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యా సంస్థలకు సంబంధించి పాఠశాలల పనివేళల మార్పునకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును గురుకులాల ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులతో పాటు ఆయన కలిశారు. గురుకులాల పనివేళల మార్పునకు సంబంధించి సీఎం సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఉత్తర్వులు విడుదల చేస్తామని సీఎస్ తమకు చెప్పారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

'శ్రీశైలం' భద్రతపై రేవంత్, ఉత్తమ్‌కు నోటీసులు

» జారీ చేసిన ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్స్

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయర్ భద్రతపై నిర్లక్ష్యాన్ని చూపినందుకుగాను సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్స్ లీగల్ నోటీసులు పంపింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, కృష్ణాబోర్డు చైర్మన్ అతుల్‌జైన్‌లకు కూడా నోటీసులు జారీ చేసింది. శ్రీశైలం ప్రాజెక్టును 19 లక్షల క్యూసెక్కుల వరద వెళ్లడానికి అనుగుణంగా డిజైన్ చేశారని, 2009 అక్టోబరు 2న 25.5 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో ప్రాజెక్టు కట్ట తీవ్రంగా దెబ్బతిందని ఫెడరేషన్ పేర్కొంది. 900 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జలవిద్యుత్ కేంద్రంతో పాటు 2000 చదరపు కిలోమీటర్ల దాకా సాగునీటిని అందించే ప్రధాన ప్రాజెక్టు దెబ్బతిన్నా పనులు చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని నోటీసులో పేర్కొంది. దాంతో శ్రీశైలం రిజర్వాయర్ రక్షణకు తీసుకునే చర్యలేంటో వివరించాలని కోరింది.

ప్రత్యేక సందర్భాల్లోనే ఉద్యోగుల బదిలీలు

» సాధారణ బదిలీలపై నిషేధమే.. స్పష్టత ఇచ్చిన సర్కారు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వోద్యోగుల బదిలపై రాష్ట్ర ప్రభుత్వం మరోమారు స్పష్టతనిచ్చింది. ప్రత్యేక కేసులు మినహా అన్ని శాఖల్లోనూ సాధారణ బదిలీలపై ప్రస్తుతం నిషేధం అమల్లో ఉంది. ఈ మేరకు ఉద్యోగుల బదిలీలపై స్పష్టతనిస్తూ.. రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం అంతర్గత ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఆగస్టు ఒకటో తేదీ నుంచి సాధారణ బదిలీలపై నిషేధం విధిస్తూ గతేడాది జూలై 31న జీవో 87 జారీ చేసింది. దీని ప్రకారం ప్రత్యేక కేసుల్లో చేపట్టే బదిలీలకు ఆర్థికశాఖ అనుమతి అక్కర్లేదని, ఉన్నతాధికారులు చేపట్టొచ్చునన్న సర్కారు.. ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు తమ పరిధిలోని విభాగాధిపతులకు తగు సూచనలు జారీ చేయాలని ఆదేశించింది. పరిపాలనాపరమైన బదిలీలు చేపట్టాల్సి వస్తే, సంబంధిత మంత్రి, సీఎస్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిలకు ఫైల్ పంపి సీఎం అనుమతి తీసుకోవాలని పేర్కొంది.

ప్రత్యేక కేసుల బదిలీలకు మార్గదర్శకాలు

- పదోన్నతులు పొందిన వారికి ఖాళీ ఉన్న చోట పోస్టింగ్ ఇస్తూ బదిలీ చేయొచ్చు. అప్పటికే అక్కడ పని చేస్తున్న ఉద్యోగిని కదిలించరాదు.
- కొన్ని ప్రభుత్వ స్కీమ్‌ల అమలుకు వెళ్లి, అవి రద్దయిన తర్వాత.. సొంత శాఖలకు రావాల్సిన వారు, పోస్టుల నుంచి రివర్టయిన వారు, సొంత శాఖలకు రీపాట్రియేట్ అయ్యేవారు, డిప్యూటేషన్లపై పని చేస్తున్న వారిని ప్రత్యేక బదిలీ చేయడానికి క్లియర్ వేకెన్సీలుండాలి.
- 6 నెలలకు పైగా దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నవారిని క్లియర్ వెకెన్సీ ఉన్న చోట పోస్టింగ్ ఇవ్వవచ్చు.

సాధారణ బదిలీల కోసం సీఎస్‌కు టీజీఓల విజ్ఞప్తి

ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలని, వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సీఎస్ కె.రామకృష్ణారావుకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) విజ్ఞప్తి చేసింది. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను సీఎస్‌కు టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం వివరించినట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

డ్రగ్స్ కట్టడికి ఈగల్!

(మొదటిపేజీ తరువాయి)

స్ఫూర్తితో ముందుకెళ్లాల్సిన రాష్ట్రం డ్రగ్స్ మహమ్మారికి బలవుతుండటం ఆలోచించాల్సిన విషయం. ఉద్యమాలకు వేదికైన తెలంగాణ ఇప్పుడు గంజాయికి వేదికైతే మనకు అవమానమో కాదో ఆలోచించాలి. ఏ బ్యాక్‌గ్రౌండ్ లేకుండానే ఈ వేదికపై ఉన్నవారమంతా ఈ స్థాయికి చేరుకున్నాం. రామ్ చరణ్ వాళ్ల నాన్న చిరంజీవి కూడా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. కష్టకాలంలో వ్యసనాలకు బానిసలు కాలేదు. రాష్ట్రంలో పాఠశాలల నుంచి వర్సిటీల వరకు విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు అవుతున్నారు" అన్నారు. పంజాబ్, హరియాణా ఒకప్పుడు దేశ రక్షణలో ముందు వరుసలో ఉండేవని, ఇప్పుడు అవి డ్రగ్స్‌తో నిర్వీర్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీ, ఫార్మా హబ్‌గా పేరు తెచ్చుకున్న హైదరాబాద్ డ్రగ్స్‌కు హబ్‌గా మారితే మనమంతా విఫలం అయినట్లేనని వ్యాఖ్యానించారు. "సౌత్ కొరియాలో హైదరాబాద్ జనాభా అంత ఉంటుంది. ఒలింపిక్స్‌లో వారికి 32 బంగారు పతకాలు వచ్చాయి. 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఒక అమ్మాయికి 3 బంగారు పతకాలు వచ్చాయి. ఒక్క అమ్మాయితో 140 కోట్ల మంది పోటీ పడలేకపోతున్నాం. అందుకే స్పోర్ట్స్ యూనివర్సిటీ పాలసీ తెచ్చాం. విదేశాల నుంచి శిక్షకుల్ని తెప్పిస్తాం. విదేశాల క్రీడాకారులకు మెరుగైన శిక్షణకు హైదరాబాద్‌కు వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అన్నారు. క్రీడల్లో రాణించే వారికి ఉద్యోగాల్లోనే కాకుండా రాజకీయాల్లో స్పెషల్ కోటా ఇస్తామని ప్రకటించారు. చరణ్ నా కళ్ల ముందు స్కూల్‌కు వెళ్లే వాడు. నేడు ఆర్‌ఆర్‌ఆర్‌తో దేశానికి గుర్తింపు తెచ్చారు. కఠోర శ్రమతోనే ఇది సాధ్యమైంది. యువత సినిమాల్లో పాత్రల్ని చూసి కాదు హీరోల నిజ జీవిత కష్టాన్ని ఆదర్శంగా తీసుకోవాలి" అని సీఎం సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు ఫీజులు చెల్లించి పాఠశాలలు, కళాశాలలకు పంపిస్తున్నారని, చదువు చెప్పడంతో బాధ్యత అయిపోయిందని యాజమాన్యాలు భావిస్తే కుదరదని ముఖ్యమంత్రి అన్నారు. విద్యా సంస్థల ఆవరణలో మత్తు పదార్థాల ఆనవాళ్లు దొరికితే యాజమాన్యాలపై కూడా కేసులు పెడతామని హెచ్చరించారు. మానసిక నిపుణుల్ని నియమించుకుని పిల్లల మానసిక స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. గద్ద 20, 30 వేల అడుగుల ఎత్తు నుంచి నేలపై ఉన్న టార్గెట్‌ను నిశితంగా చూడగలదని, అడవుల్లో గంజాయి పండిచే వారిని సైతం గుర్తించే విధంగా తెలంగాణ డ్రగ్స్ నియంత్రణ సంస్థ ఈగల్‌కు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇదే విషయాన్ని ఆయన ట్విట్టర్‌లో కూడా పెట్టారు.



ఈగల్ లోగో చూపుతున్న సీఎం రేవంత్; స్టాల్‌ను సందర్శిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో రామ్‌చరణ్, విజయ్, దిల్‌రాజు

డ్రగ్స్ తీసుకుంటే బహిష్కరణ: దిల్‌రాజు

డ్రగ్స్ తీసుకునే వారిని బహిష్కరించాలని మళయాళ సినీ పరిశ్రమ మంచి నిర్ణయం తీసుకుందని దిల్ రాజు ప్రశంసించారు. తెలంగాణలోనూ ఇక్కడి వారితో చర్చించి బహిష్కరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఒక్కసారి వెళ్తే అంతే: విజయ్ దేవరకొండ

స్నేహితులు ఏం కాదులే అని చెప్పారని ఒక్కసారే కదా అని మత్తు పదార్థాలు తీసుకుంటే ఇక అంతేనని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. ఒక్కసారి ట్రై చేయమని చెప్పి అలవాటు చేయించే బ్యాచులు ఉన్నాయని పోలీసులు గుర్తించారని చెప్పారు. తనకు జిమ్ చేసినపుడు, డబ్బులు సంపాదించినపుడు, ఖర్చు పెట్టినపుడు, ఒకరికి ఇచ్చినపుడు, నచ్చిన పని చేసి సక్సెస్ అయినప్పుడు మంచి హై వస్తదని అన్నారు. కుటుంబంతో ఎక్కువ సమయం గడపడం వల్ల కూడా హై వస్తుందని చెప్పారు. శత్రు దేశాలు వచ్చి యుద్ధాలే చేయాల్సిన అవసరం లేదని, మత్తు పదార్థాలతో కూడా దేశాన్ని నిర్వీర్యం చేయగలరని చెప్పారు. రాష్ట్రంలో నిషేధిత మత్తు పదార్థాల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని పోలీసు ఉన్నతాధికారి సందీప్ శాండిల్య అన్నారు. టీజీ న్యాబ్‌లో సమర్థులైన అధికారులు, సిబ్బందితోపాటు అత్యాధునిక ల్యాబ్ పరికరాలు ఉన్నాయని చెప్పారు. చిన్న వెంట్రుక దొరికినా ఒక వ్యక్తి డ్రగ్స్ ఉపయోగించాడో లేదో సాంకేతికంగా నిరూపించగలమని తెలిపారు. డీజీపీ జితేందర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హోంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, పుల్లెల గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించే షార్ట్ ఫిల్మ్, పాటను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులు అందించారు. అనంతరం పోలీసుల ఆయుధాలు, ఇతర పరికరాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు.

పిల్లల్ని బయటకు పంపాలంటేనే భయం: రామ్‌చరణ్

పరిస్థితులు చూస్తుంటే పిల్లల్ని బయటకు పంపించాలంటేనే భయంగా ఉంటుందని హీరో రామ్‌చరణ్ అన్నారు. కాలేజీ విద్యార్థిగా ఉన్నపుడు ఇలాంటి అవగాహనా కార్యక్రమాలకు వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. చిన్నప్పుడు స్కూల్ బయట గోలీసోడా, లాలీపాప్ కొనుక్కుని తినేవాడినని, ఇప్పుడు అలాంటి వాటిల్లో మత్తు పదార్థాలు కలిపి అమ్ముతున్నట్లు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. స్కూల్స్ వద్ద ఐస్‌క్రీమ్స్, చాక్లెట్స్‌లో ఏమిస్తున్నారో తెలియట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మంచి స్నేహితులు, మంచి మార్కులు, కుటుంబంతో గడిపే సమయంలో వచ్చే హై(కిక్కు) ఎంతో బాగుంటుందని విద్యార్థులకు సూచించారు.

రేవంత్ సిగరెట్ కాల్చడు, బీరు తాగడు: ఎంపీ కొండా

సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు ఎప్పుడు సిగరెట్ కాల్చలేదని, బీరు కూడా తాగలేదని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఆయనకు ఆనందం కలిగించే అంశం ఫుట్‌బాల్ అని చెప్పారు. డ్రగ్స్ తీసుకునే వారు అన్నీ తెలిసే తీసుకుంటారన్నారు. యువత ఆనందం కోసం భువనగిరి కొండ ఎక్కాలి, కయాకింగ్ చేయాలి, క్రీడలు నేర్చుకోవాలి, నటన నేర్చుకోవాలని సూచించారు. నషా ముక్త్ భారత్‌కు కేంద్రంలో ప్రధాన మంత్రి రూ.400 కోట్లు ఖర్చు చేస్తే ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే సీఎం రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నారని కొండా ప్రశంసించారు.

ఆచితూచి మాట్లాడండి!

రాష్ట్ర పార్టీతో సమన్వయంతో ముందుకెళ్లండి

» మంత్రి పొంగులేటికి ఖర్గే హితబోధ!

» ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడితో గంట భేటీ

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భేటీ అయినట్టు తెలిసింది. బుధవారం కుటుంబ సమేతంగా ఢిల్లీకి వచ్చిన పొంగులేటి సాయంత్రం సమయంలో ఒక్కరే ఖర్గే నివాసంలో ఆయనను కలిసినట్టు సమాచారం. సుమారు గంటకుపైగా సాగిన సమావేశంలో రాష్ట్ర రాజకీయాలపై చర్చించుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. రెవెన్యూ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీరుపై కాంగ్రెస్ పార్టీలో కొందరు ఎమ్మెల్యేలు అసహనంతో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసి కొందరు ఎమ్మెల్యేలు పొంగులేటి తీరుపై ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీనే ప్రధానమని, రాష్ట్ర పార్టీ నాయకత్వంతో పాటు సహచర మంత్రులు, ఎమ్మెల్యేలతో సమన్వయంతో ముందుకెళ్లాలని పొంగులేటికి ఖర్గే హితబోధ చేసినట్టు తెలిసింది. పొంగులేటి గతంలో ఒకసారి రాష్ట్ర రాజకీయాల్లో బాంబులు పేలతాయని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బహిరంగ ప్రకటన చేశారు. స్వయంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పొంగులేటి తీరును బహిరంగంగానే తప్పు బట్టారు. ఈ నేపథ్యంలో ఖర్గేతో భేటీలో ఈ అంశాలన్నింటిపైనా చర్చ జరిగినట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అలాగే, ఫోన్ ట్యాపింగ్ అంశంలో పొంగులేటి క్యాంపు ఆఫీసు సిబ్బందికి సిట్ నోటీసులు ఇవ్వడం పైనా చర్చ జరిగినట్టు సమాచారం. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో సమన్వయంతో ఉండాలని, బహిరంగ వేదికలపై ఆచితూచి మాట్లాడాలని పొంగులేటికి ఖర్గే సూచించినట్టు తెలిసింది. పొంగులేటిని అధిష్ఠానమే పిలిచిందా? ఆయనే సంజాయిషీ ఇచ్చుకోవడానికి వచ్చారా? అనే దానిపై స్పష్టత లేదు. పొంగులేటిని సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

జూలై 10న క్యాబినెట్ భేటీ

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం జూలై 10న సమావేశం కానుంది. సీఎం రేవంత్ అధ్యక్షతన సచివాలయంలో ఈ భేటీ నిర్వహించనున్నారు. ఈ సారి క్యాబినెట్‌లో కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీలకు 42% రిజర్వేషన్లు సహా పలు కీలక విషయాలు అజెండాలో ఉండే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

సీఎం రేవంత్... వెరీ గుడ్!

ఇదీ.. రాష్ట్రంలోని రైతులు చెబుతున్న మాట

రైతుబంధు జమకు కేసీఆర్ 5 నెలలు తీసుకున్నడు.. రేవంత్.. 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు వేసిండు

కాంగ్రెస్ పాలనకు.. కేసీఆర్ పాలనకు ఉన్న తేడా ఇదీ.. ఖజానా కొల్లగొట్టి.. కాంగ్రెస్‌పై నిందలా?

నా ఫోన్ ట్యాప్ అవుతోందని పోలీసులు చెప్పారు.. ట్యాప్ చేసినా వాళ్లు చేసేది ఏమీ ఉండదని చెప్పా

లిక్కర్ డాన్ కవితకు వందల కోట్లు ఎలా వచ్చాయి?.. కేసీఆర్ ఇల్లు.. డ్రామా కంపెనీ అయింది: జగ్గారెడ్డి



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): "సీఎం రేవంత్‌రెడ్డి.. వెరీ గుడ్! ఇది మేము అంటున్నది కాదు. ప్రస్తుతం రాష్ట్రంలోని రైతులంతా అంటున్న మాట" అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వెల్లడించారు. నాడు రైతు బంధు నిధులు జమ చేయడానికి కేసీఆర్ ఐదు నెలల సమయం తీసుకుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి కేవలం 9 రోజుల్లో రూ.9వేల కోట్ల రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో వేసేశారన్నారు. కాంగ్రెస్ పాలనకు, కేసీఆర్ పాలనకు మధ్య ఉన్న తేడా ఇదన్నారు. గాంధీభవన్‌లో గురువారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. రైతులందరికీ.. రైతు భరోసా నిధులు ఒకే సారి వేయాలన్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఆలోచన.. సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. కేసీఆర్ కుటుంబం.. రాష్ట్ర ఖజానాను దివాలా తీయించినా.. బాధ్యత గలిగిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలబడిందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. రాహుల్, సోనియా, మల్లికార్జున ఖర్గే ఇచ్చిన హామీ మేరకు భూమి ఉన్న ప్రతి రైతు ఖాతాలో డబ్బులు వేసినట్లు తెలిపారు. కేసీఆర్ చేయలేని పని తమ ప్రభుత్వం చేయడంతో హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని, కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేయించి, కేసీఆర్ సాధించిందేంటి? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. తన ఫోనూ ట్యాప్ అవుతోందని పోలీసులు, తమ పార్టీ కార్యకర్తలూ చెప్పేవారని, అయితే ట్యాప్ చేసి వారు సాధించేది ఏమీ లేదని తాను చెప్పేవాడినన్నారు. చివరకు భార్యాభర్తలు మాట్లాడుకున్నదీ రికార్డు చేసి.. బీఆర్ఎస్ నీచానికి పాల్పడిందన్నారు. అందరి ఫోన్లూ ట్యాప్ చేసి బలహీనమైంది బీఆర్ఎస్ వాళ్లేనని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుమార్తె కవితకు రేవంత్‌ను విమర్శించే స్థాయి లేదని, ఆమె ఓవర్ యాక్షన్ చేస్తోందని దుయ్యబట్టారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డిది సమాన హోదా అని, వారిద్దరూ మాట్లాడుకుంటేనే బాగుంటుందన్నారు. "కవితకు తండ్రితో పంచాయితీ ఉంటే వాళ్లు.. వాళ్లు.. చూసుకోవాలి. కేసీఆర్‌కు వారసత్వం కొడుకు అవుతాడు కానీ... కూతురు కాదు. అసలు కేసీఆర్ ఇల్లే ఒక డ్రామా కంపెనీ అయిపోయింది. పదేళ్లలో ఎన్నడూ లేనిది.. కవితకు ఇప్పుడు బీసీలు, మహిళలు గుర్తుకు వచ్చారు. లిక్కర్ బిజినెస్ పెట్టడానికి ఆమెకు రూ.వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? కవిత వల్లనే కేజ్రీవాల్, సిసోదియా జైలుకు వెళ్లింది వాస్తవం కాదా? లిక్కర్ డాన్‌గా ఉన్న కవిత.. కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది" అని అన్నారు.

9 ఏళ్ల తర్వాత సీఎం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నా

ఈ టర్మ్‌తో పాటు వచ్చే ఐదేళ్లు సీఎంగా ఉండాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని జగ్గారెడ్డి తెలిపారు. 9 ఏళ్ల తర్వాత సీఎం అయ్యేందుకు తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. బీఆర్ఎస్ వాళ్లకు ఎప్పటికీ సీఎం అయ్యే అవకాశం రాదన్నారు.

హైదరాబాద్ అభివృద్ధిలో 'హెచ్-సిటీ' కీలకం!

ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం: దుద్దిళ్ల

చందానగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరాభివృద్ధిలో 'హెచ్-సిటీ' ప్రాజెక్ట్ కీలకమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. హైదరాబాద్‌ను దేశంలోని ఇతర నగరాలకు రోల్ మోడల్‌గా నిలపాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. అందుకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'హైదరాబాద్ ఇన్నోవేటివ్ అండ్ ఇన్ఫర్మేటివ్ (హెచ్-సిటీ)' ప్రాజెక్టులో భాగంగా రూ.45 కోట్లతో ఎన్‌హెచ్-65లో చందానగర్ నుంచి అమీన్‌పూర్ వరకు చేపట్టబోయే రోడ్డు విస్తరణ పనులకు గురువారం ఆయన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామని చెప్పారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు రూ.7032 కోట్లతో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకే హెచ్-సిటీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, రహదారి నెట్‌వర్క్‌ను మెరుగుపరచడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యాలని వివరించారు. ఇప్పటికే ఆర్టీసీ ఆధ్వర్యంలో 1000 ఎలక్ట్రిక్ బస్సులను నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. వాటికి అదనంగా మరో 800 బస్సులను తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించారని, ఇందుకు కేంద్రం సైతం సహకరిస్తామని తెలిపిందని శ్రీధర్‌బాబు అన్నారు. నగరంలోని ట్రాఫిక్ సిగ్నళ్లను ఏఐతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాదచారుల భద్రతకు పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిని నలువైపులకూ విస్తరిస్తామన్నారు. తమ ప్రభుత్వంపై కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. "మా లక్ష్యం, ధ్యేయం అభివృద్ధే. ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సహకరించండి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఏపీ రాజధానిలో టవర్లకు రైట్ రైట్

» ఎల్-1 బిడ్డర్లకు ఎల్‌వోఏల అందజేత

» రూ.3,673 కోట్లతో పనులు అప్పగింత

» మౌలిక సదుపాయాలకు 1,052 కోట్లు

అమరావతి/విజయవాడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్‌లో ఇంటిగ్రేటెడ్ రాష్ట్ర సచివాలయం, హెచ్‌వోడీ టవర్ల నిర్మాణానికి గాను రూ.3,673.43 కోట్లతో ఎల్-1 బిడ్డర్లకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ(ఎల్‌వోఏ)ని ఆమోదిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనుల అప్పగింతకు సంబంధించి సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం ఇప్పటికే ఆమోదం తెలిపింది. రూ.882.47కోట్లతో జీఏడీ టవర్ (జీ+49) నిర్మాణ పనులను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు, రూ.1,487.11 కోట్లతో టవర్స్-1, 2 (జీ+39) పనులు షాపూర్జీ అండ్ పల్లోంజీ సంస్థకు, రూ.1,303.85 కోట్లతో టవర్స్- 3, 4 (జీ+39) పనులను ఎల్అండ్ టీ సంస్థకు అప్పగించేందుకు అనుమతించింది. కాగా, సెక్రటేరియట్, హెచ్‌వోడీ టవర్లకు సంబంధించిన ఎల్‌వోఏలను నిర్మాణ సంస్థలకు గురువారం సీఆర్డీఏ కార్యాలయంలో అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అనుసరిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా సంస్థలకు సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు సూచించారు. నిబంధనలు అతిక్రమించినా, కార్మికుల భద్రత విషయంలో లోపాలున్నా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, అమరావతి ప్రాంతంలో రోడ్ల నిర్మాణాలు, డ్రైన్లు, తాగునీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ, పునర్వినియోగ నీటి లైన్, అవెన్యూ ప్లాంటేషన్ తదితర సదుపాయాల కల్పనకు రూ.1,052కోట్లతో పనులు చేపట్టేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

జగదాంబికా తల్లీ.. అందుకో బోనం!

గోల్కొండ కోటలో అమ్మవారికి తొలి మొక్కులు

నగరంలో ఘనంగా ఆషాఢమాసం బోనాల వేడుక షురూ

పట్టువస్త్రాలు సమర్పించిన కొండా సురేఖ, పొన్నం, స్పీకర్

కార్వాన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గోల్కొండ కోటలోని జగదాంబికా అమ్మవారికి తొలిబోనం దక్కింది! పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డీజే పాటలు, యువత నృత్యాలతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన అషాఢమాస బోనాల జాతరకు గురువారం అట్టహాసంగా తెరలేచింది. గోల్కొండ కోటలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన వేడుక రాత్రి 11 గంటల వరకు జరిగింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ ప్రసాద్‌కుమార్ లంగర్‌హౌజ్‌లో తొట్టెలకు పూజలు చేసి జాతరను ప్రారంభించారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. లాల్‌దర్వాజా ఉమ్మడి బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గోల్కొండ జగదాంబిక అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించారు సినీనటి, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బీజేపీ నాయకురాలు మాధవీలత నెత్తిన బోనాలతో కోటపైకి నడుచుకుంటూ వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మొదటిరోజు గోల్కొండ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో కోటపైకి వెళ్లి అమ్మవారికి భక్తిప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం ప్రారంభమైన ఉత్సవాలు జూలై 24 వరకు జరుగుతాయి.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం తదితరులు; బోనం ఎత్తుకున్న మంత్రి సురేఖ

హనీమూన్ మర్డర్‌లా దొరికిపోవొద్దు!

మేఘాలయలో నిందితులు ఏదో పొరపాటు చేశారు

- మనం మాత్రం పక్కాగా ప్లాన్ చేయాలి
- హత్య జరిగాక హనీమూన్‌కు లద్దాఖ్ వెళ్లాలి
- హత్య ఆలస్యమైతే విహారానికి అండమాన్‌కు పోవాలి
- తేజేశ్వర్ హత్యకు ముందు ఐశ్వర్య, తిరుమలరావు ప్రణాళిక
- బ్యాంకు లోన్ ఇచ్చి ఐశ్వర్య తల్లిని లోబర్చుకున్న తిరుమలరావు
- గద్వాల హత్య కేసును ఛేదించిన పోలీసులు.. 8మంది అరెస్టు



విలేకర్ల సమావేశంలో గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 'అనుకున్నట్లుగానే హత్య చేయాలి.. అయితే మేఘాలయలో జరిగిన హనీమూన్ మర్డర్ ఘటనలో దుండగుల మాదిరిగా దొరికిపోకూడదు. మనం ఎలాంటి పొరపాటు జరగకుండా పక్కాగా పనికానిచ్చేద్దాం' తేజేశ్వర్ హత్య కోసం ఆయన భార్య ఐశ్వర్య, ఆమె ప్రియుడు తిరుమలరావు వేసుకున్న ప్రణాళిక ఇది!! తేజేశ్వర్‌ను చంపిన తర్వాత ఇద్దరూ లద్దాఖ్‌కు హనీమూన్ వెళ్లాలనీ అనుకున్నారు. అనుకోని కారణాల వల్ల హత్య ఆలస్యమైతే ఆషాఢమాసంలో అండమాన్ లేదా మరే ఇతర ప్రాంతానికైనా విహారానికి వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారు. అనుకున్నట్లుగానే తేజేశ్వర్‌ను చంపించినా పోలీసులకు దొరికిపోయి కటకటాలపాలయ్యారు. గద్వాలకు చెందిన తేజేశ్వర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణం అని గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఏపీలోని కర్నూలుకు చెందిన తిరుమలరావు వివాహితుడు. బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆఫీసులో పనిచేసే స్వీపర్ సుజాతకు హోమ్ లోన్ ఇప్పించి.. ఆర్థిక అవసరాలు తీరుస్తూ ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొన్నాళ్లకు ఆమె కూతురు ఐశ్వర్యతోనూ సంబంధం పెట్టుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని ఐశ్వర్యను నమ్మించాడు. గత డిసెంబరులో ఐశ్వర్యకు గద్వాలలో ప్రైవేటు సర్వేయర్‌గా పనిచేస్తున్న తేజేశ్వర్‌తో నిశ్చితార్థం జరిగింది. తర్వాత తాము కలవడం కష్టం కావడంతో తేజేశ్వర్‌ను హత్య చేయాలని ఐశ్వర్య, తిరుమలరావు ప్రణాళిక వేసుకున్నారు. తేజేశ్వర్ హత్యకు.. బ్యాంకు పనిమీద తన వద్దకు వచ్చిన పరశురాముడు, నగేశ్‌కు తిరుమలరావు సుపారీ ఇచ్చాడు. బ్యాంకు నుంచి లోన్లు ఇప్పించే విషయంలో సహకరిస్తానని వారికి మాటిచ్చాడు. ఐశ్వర్యతో వివాహానికి ముందే తేజేశ్వర్‌ను హత్య చేయాలనుకున్నారు. ఈ క్రమంలో నగేశ్, పరశురాముడు పలుమార్లు తేజేశ్వర్ హత్యకు ప్రణాళిక వేసినా సాధ్యపడలేదు. తిరుమలరావు సూచనతో నగేశ్, పరశురాముడు కలిసి తేజేశ్వర్ కదలికలు తెలుసుకునేందుకు ఆయన బైక్‌కు జీపీఎస్ ట్రాకర్ అమర్చారు. మే నెల 18న ఐశ్వర్య-తేజేశ్వర్ వివాహం జరిగింది. దీంతో మరింత రగిలిపోయిన తిరుమలరావు.. నగేశ్, పరశురాముడును పిలిచి "వాణ్ని చంపండి. ఎంత డబ్బయినా ఇస్తాను" అని చెప్పాడు. దీంతో ఆ ఇద్దరు చాకలి రాజు అనే మరో వ్యక్తిని భాగస్వామ్యం చేసుకున్నారు. దారి ఖర్చులకు రూ. 3500 తీసుకున్నారు. ఓ కారును నెల రోజుల కోసం అద్దెకు తీసుకున్నారు. జూన్ 17న ముగ్గురు కలిసి గద్వాల వచ్చారు. తేజేశ్వర్‌కు ఫోన్ చేసి రప్పించుకొని కారులో ఎక్కించుకున్నారు. తమ మేనేజర్ అని చెప్పి తిరుమల్‌రావుతో మాట్లాడించారు. ఆ తర్వాత తమకు తెలిసిన వారి కారు ఆగిపోయిందని చెప్పి.. కారును కర్నూలువైపు పోనిచ్చారు. ఓ 20 కి.మీ వెళ్లాక వారు ఫోన్ ఎత్తడం లేదంటూ గద్వాలకు యూటర్న్ తీసుకున్నారు.

తల, గొంతు, పొట్టలో కత్తితో దాడి

గద్వాలకు వస్తుండగా పరశురాముడు సీటు కింద ఉన్న కొడవలి తీసుకొని తేజేశ్వర్ తలపై కొట్టాడు. నగేశ్ కారును సైడ్‌కు ఆపిన తర్వాత అదే కొడవలితో పరశురాముడు తేజేశ్వర్ గొంతు కోశాడు. చాకలి రాజు మరో కొడవలితో తలపై, చేతులపై నరికాడు. నగేశ్ కత్తితో కడుపులో పొడవడంతో తేజేశ్వర్ చనిపోయాడు. తర్వాత తిరుమల్‌రావుకు ఫోన్ చేశారు. డెడ్‌బాడీని పంచలింగాల వద్ద వెంచర్‌కు తీసుకురావాలని అతడు చెప్పాడు. దారిలో బ్రిడ్జి వద్ద తేజేశ్వర్ బ్యాగ్, ఫోన్లను నదిలో పడేశారు. తిరుమలరావు తన కారులో వచ్చి ముగ్గురికి కొత్త డ్రెస్సులు ఇచ్చాడు. తర్వాత పరశురాముడు, చాకలిరాజును అక్కడే వదిలేసి నగేశ్‌తో కలిసి తిరుమలరావు కారులో నంద్యాల వైపు బయలుదేరి సుగానిమిట్ట వద్ద నిర్మిస్తున్న గాలేరు-నగరి కాల్వలో మృతదేహాన్ని పడేశాడు. మరుసటిరోజు నగేశ్‌కు తిరుమలరావు 50 వేలు ఇచ్చాడు. 20వ తేదీన మరో 2 లక్షలు తెలిసిన వ్యక్తితో ఇప్పించాడు. ఈ ఘటనకు సంబంధించి తిరుమలరావు, ఐశ్వర్య, నగేశ్, పరశురాముడు, చాకలి రాజు, ఐశ్వర్య తల్లి సుజాత, తిరుమలరావు తండ్రి తిరుపతయ్య సహా 8మందిని పోలీసులు అరెస్టు చేశారు. హత్యకుపయోగించిన కారు, కొడవళ్లు, 1.20 లక్షల నగదు, 10 మొబైల్ ఫోన్లు, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

90 ఏళ్ల వృద్ధురాలికి ఎంత కష్టం!

- ఆమెను ఇంట్లోంచి గెంటేసిన కుమారులు
- ఆ ఇల్లు తనకే దక్కాలని వృద్ధురాలి ఫిర్యాదు



వృద్ధురాలు శకుంతలా బాయితో తహసీల్దార్ జయశ్రీ

చాదర్‌ఘాట్, జూన్26 (ఆంధ్రజ్యోతి): ఆ కుమారులకు తల్లే భారమైంది! వృద్ధాప్యంలో ఉన్న తల్లికి అన్నీతామై అవసరాలు తీర్చి.. ఆప్యాయంగా చూసుకోవాల్సిందిపోయి ఇంటి నుంచి నిర్దాక్షిణ్యంగా బయటకు గెంటేశారు. తొంభై ఏళ్ల వయసులో ఆమె ఎక్కడికని వెళ్లగలదు? తన భర్త కట్టిన ఆ ఇంట్లో కడదాకా ఉండే హక్కు తనకు ఉందని, తన బాగోగులు చూడని కుమారులు తన ఇంట్లో ఉండొద్దంటూ పోరాడుతోంది. మలక్‌పేట ముసారాంబాగ్‌కు చెందిన శకుంతలా బాయి(90) దీనగాథ ఇది. ఆమె భర్త చాలా కాలం క్రితమే మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలున్నారు. కుమారులతో కలిసి ఆమె తన ఇంట్లోనే ఉంటున్నారు. కొన్నాళ్ల పాటు తల్లిని బాగానే చూసుకున్న ఆ కుమారులు, ఆ తర్వాత నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. ఇటీవల ఆమెను ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారు. అప్పటి నుంచి ఆమె సైదాబాద్‌లో నివాసముంటున్న చిన్న కూతురు వద్ద ఉంటున్నారు. తన ఇంటిని తనకు అప్పగించాలంటూ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆమె 2024 ఫిబ్రవరిలో హైదరాబాద్ జిల్లా ఆర్డీవోను ఆశ్రయించారు. ఆర్డీవో.. వృద్ధురాలి కుమారులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇంటిని తన తల్లికి అప్పగిస్తామంటూ ఆర్డీవో ముందు అంగీకరించినా వారు ఆ పని చేయలేదు. దీంతో ఇంటిని రెండు రోజుల్లో ఖాళీ చేయకపోతే సీజ్ చేస్తామని వారికి సైదాబాద్ తహసీల్దార్ జయ ఫైనల్ నోటీసు ఇచ్చారు. గడువు ముగియడంతో జయశ్రీ సిబ్బందితో కలిసి గురువారం శకుంతల బాయి ఇంటికి వెళ్లారు. అప్పటికే ఆమె కుమారులు ఇంటికి తాళం వేసి పరారయ్యారు. రెవెన్యూ సిబ్బంది ఆ ఇంటిని సీజ్ చేశారు.

యాప్‌లో దంపతుల పోర్నోగ్రఫీ

- అంబర్‌పేట్‌లో గలీజు దందా
- ఇంటి డాబాపై ప్రత్యేక సెటప్
- గుర్తించి, నోటీసులు ఇచ్చిన పోలీసులు

అంబర్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆ దంపతులు తొలుత పోర్న్ వీడియోలను చూసేవారు..! ఆ తర్వాత ఓ యాప్‌లో చేరి, డబ్బుకోసం తామే పోర్నోగ్రఫీని లైవ్‌లో చేయడం ప్రారంభించారు..! ఇందుకోసం ఇంటి డాబాపై పరదాలతో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకున్నారు..! ముద్దుముద్దుగా.. కవ్వించేలా తెలుగు పోర్నోగ్రఫీ వీక్షకులను ఆకట్టుకుంటూ.. వీడియోలు చేసేవారు..! ఆనోటా ఈనోటా విషయం తెలిసిన హైదరాబాద్ తూర్పు మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి, వారి ఆట కట్టించారు. అంబర్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట మల్లికార్జున నగర్‌లో ఉండే వ్యక్తి(42) ఇంటర్ వరకు చదివి.. డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య(37) ఐదో తరగతి వరకు చదువుకున్న గృహిణి. వీరికి ఇంజనీరింగ్, ఇంటర్ చదివే ఇద్దరు కుమార్తెలున్నారు. తొలుత అశ్లీల వెబ్‌సైట్లు, యాప్‌లలో పోర్నోగ్రఫీ చూడడానికి అలవాటు పడ్డ ఈ దంపతులు.. క్రమంగా సులభంగా డబ్బు సంపాదించేందుకు పోర్నోగ్రఫీ యాప్‌లో సభ్యులుగా చేరి, తమ అశ్లీల వీడియోలు అప్‌లోడ్ చేసేవారు. ఒక్కో వీడియోకు రూ.500 మొదలు.. రూ.2 వేలు వచ్చేవి. దాంతో.. లైవ్ టెలికాస్ట్‌లో పోర్నోగ్రఫీకి ఎక్కువ డబ్బులొస్తాయని తెలుసుకుని, తమ డాబాపై పరదాలతో ప్రత్యేకంగా సెటప్ ఏర్పాటు చేశారు. లైవ్‌కాస్ట్ ప్రారంభించారు. "పోర్నోగ్రఫీ యాప్‌లో వీక్షకులు కోరినట్లు ఈ దంపతులు ప్రవర్తిస్తారు. అశ్లీలం హద్దు మీరాలంటే.. వీక్షకులు వీరికి క్రెడిట్స్ ఇవ్వాలి. ఆ క్రెడిట్స్‌ని వీరు డబ్బుగా మార్చుకుంటారు" అని ఈ కేసు విచారణలో పాలుపంచుకుంటున్న ఓ అధికారి వివరించారు. తెలుగు కస్టమర్లు పెరుగుతుండడంతో.. 'లైవ్ సెక్స్' కథ తూర్పు మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చేరింది. దాంతో వారు కొంతకాలంగా ఈ దంపతులపై నిఘా పెట్టారు. బుధవారం అదుపులోకి తీసుకుని, అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. అంబర్‌పేట పోలీసులు వారిని విచారించి, ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు రావాలంటూ నోటీసులు ఇచ్చి పంపారు. కోర్టు ఆదేశిస్తే వారిని రిమాండ్‌కు తరలిస్తామని వివరించారు.

'డేటా స్పీడ్'లో ఐఐటీహెచ్ ముందడుగు

- మారుమూల ప్రాంతాల్లో 5జీ సిగ్నళ్ల బలోపేతానికి అభివృద్ధి చేసిన ఫీచర్‌కు ప్రేగ్ సదస్సు మద్దతు
- 6జీ అభివృద్ధికి దోహదపడుతుందని ప్రశంస
- పరిశోధనల్లో వైసింగ్ నెట్‌వర్క్స్ సంస్థ సహకారం

కంది, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల్లో కూడా 5జీ సిగ్నళ్లను బలోపేతం చేసే.. మొబైల్ అప్లికేషన్ల డేటా స్పీడ్ పెంచే పరిజ్ఞానం అభివృద్ధిలో ఐఐటీహెచ్ ముందడుగు వేసింది. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీహెచ్... వైసింగ్ నెట్‌వర్క్స్ సంస్థ సహకారంతో హెచ్‌డీ వీడియో, ఎక్స్‌ఆర్, ఆన్-డివైస్ ఏఐ వంటి క్లిష్టమైన అప్లికేషన్ల డేటాను వేగంగా అప్‌లోడ్ చేయడానికి '3జీపీపీ 5జీ ఆర్‌ఈఎల్-17' అనే ఫీచర్‌ను తెచ్చింది. దీనికి గురువారం యూరప్‌లోని ప్రేగ్‌లో నిర్వహించిన 3జీపీపీ అంతర్జాతీయ సదస్సు మద్దతు తెలిపింది. సాంకేతికత విషయంలో ఐఐటీహెచ్ ప్రపంచదేశాలతో పోటీపడుతోందని, ఆ సంస్థ పరిశోధనలు 6జీ టెక్నాలజీ అభివృద్ధికి పునాది వేస్తున్నాయని పలు ప్రఖ్యాత నెట్‌వర్క్ సంస్థలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఈ పరిశోధనలకు ఐఐటీహెచ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కిరణ్ కుచి నేతృత్వం వహించారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

దుమ్ముగూడెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతిచెందారు. మాడ్ డివిజన్ మావోయిస్టు నేతలు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు నారాయణపూర్, కొండగావ్ జిల్లా డీఆర్జీ, ఎస్టీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కోకామెట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో రాత్రి వేళ ఇరుపక్షాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. అనంతరం ఘటనాస్థలంలో ఇద్దరు మహిళా మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఒక ఇన్సాస్ రైఫిల్, 315 బోర్ రైఫిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శుక్రవారం ప్రకటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఫలితాలు అధికారిక వెబ్‌సైట్ www.bsc.telangana.gov.inలో అందుబాటులో ఉంటాయని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించారు.

కార్మికుడి కుటుంబానికి 1.34 కోట్ల పరిహారం

- అందజేసిన ఎన్టీపీసీ.. 14 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం

చిక్కడపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఎన్టీపీసీ యాజమాన్యం రూ. 1.34 కోట్ల నష్టపరిహారాన్ని చెల్లించింది. కార్మికశాఖ కమిషనరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్)-3 ప్రభావతి ఇందుకు సంబంధించిన చెక్కును ఉద్యోగి భార్య రేవతికి అందజేశారు. చాట్రగడ్డ ప్రభాకరరావు 1982 నుంచి ఎన్టీపీసీలో మెకానికల్ మెయింటెనెన్స్ విభాగంలో టెక్నీషియన్‌గా పనిచేస్తూ 2010లో గుండెపోటుతో చనిపోయారు. డ్యూటీలో ఉండగా చనిపోయినా నష్టపరిహారం ఇవ్వకపోవడంతో ఆయన భార్య రేవతి 2012లో కరీంనగర్ కార్మిక శాఖలో కేసు వేశారు. వాదోపవాదాలు తర్వాత 2024లో అప్పటి ఏసీఎల్ జానస్ రేవతికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ఆమెకు రూ.47,66,100 నష్టపరిహారం చెల్లించాలని, దానిపై 2010 మార్చి 6 నుంచి ఏడాదికి 12 శాతం వడ్డీ ఇవ్వాలని ఆదేశించారు. అసలు, వడ్డీ కలిపి రూ. 1,34,78,269లను ఏసీఎల్-3 ఖాతాలో ఈనెల 15న ఎన్టీపీసీ డిపాజిట్ చేసింది. దానినే చెక్కు రూపంలో అందజేశారని కేసు వాదించిన న్యాయవాది ఇంద్రసేన్‌రెడ్డి తెలిపారు.

కీచక టీచర్‌కు 17 ఏళ్ల జైలు శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

మండలంలోని ఒక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన సాతూరి మధుకర్ (52)కు పోక్సో కేసులో న్యాయస్థానం 17 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. దాంతో పాటు రూ.1.50 లక్షల జరిమానా విధిస్తూ పెద్దపల్లి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు స్పెషల్ జడ్జి సునీత గురువారం తీర్పునిచ్చారు. 2017 నాటి ఈ కేసుకు సంబంధించిన వివరాలను ప్రస్తుత ఎస్సై వెంకటేశ్ వివరించారు. జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 2013లో పదో తరగతి చదువుతున్న బాలికతో అదే పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేసిన హన్మకొండకు చెందిన మధుకర్ అసభ్యంగా ప్రవర్తించేవాడు. రాత్రి వేళ బాలికను పాఠశాలకు పిలిపించుకుని ఆమెను లోబర్చుకుని పలుమార్లు లైంగిక దాడి చేశాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే మీ తల్లిదండ్రులను చంపేస్తానని బాధితురాలిని బెదిరించేవాడు. అనంతరం బాధిత యువతి డిగ్రీ చదువుతున్న సమయంలో.. హన్మకొండలోని తన స్నేహితుడి గదికి పిలిపించుకొని శారీరకంగా వాడుకున్నాడు. ఆ సమయంలో వీడియోలు తీసిన మధుకర్.. తాను పిలిచినప్పుడల్లా రావాలని ఆమెను బెదిరించాడు. అయితే, 2017లో ఆ యువతి మరో యువకుడిని పెళ్లి చేసుకున్నా సరే.. మధుకర్ వేధింపులు ఆపలేదు. తనకు వివాహమైందని, వదిలేయమని కోరినా కనికరించలేదు. తన మాట వినడం లేదని యువతి భర్త ఫోన్‌కు అసభ్యకర వీడియోలు పంపాడు. వాటిని చూసిన భర్త.. ఆమెకు విడాకులు ఇచ్చాడు. దీంతో మధుకర్ వేధింపులతో విసిగిపోయిన బాధితురాలు.. కాల్వశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై షేక్‌జానీపాషా కేసు నమోదు చేశారు. అప్పటి ఏసీపీ సింధూశర్మ విచారణ చేసి నేరస్తుడు సాతూరి మధుకర్‌ను రిమాండ్‌కు తరలించారు. నేరం నిరూపితం అవ్వడంతో పెద్దపల్లి కోర్టు మధుకర్‌కు శిక్ష విధించింది.

ఏసీబీ మెరుపు దాడులు!

రవాణా, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో తనిఖీలు

- ఏకకాలంలో పలు చెక్‌పోస్టుల్లోనూ సోదాలు
- ఏసీబీ అదుపులో 28 మంది ఏజంట్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అవినీతి ఆరోపణల నేపథ్యంలో రవాణా శాఖతో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, సరిహద్దు చెక్‌పోస్టులపై ఏసీబీ అధికారులు గురువారం మెరుపు దాడులు చేశారు. హైదరాబాద్‌లోని ఉప్పల్, తిరుమలగిరి, మన్నెగూడ, కామారెడ్డి, పెద్దపల్లి రవాణా శాఖ కార్యాలయాలతో పాటు పలు సరిహద్దు చెక్‌పోస్టుల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా భారీ నగదుతో పాటు పలువురు ఏజెంట్ల నుంచి వాహన ధ్రువీకరణ పత్రాలు, ఇతర డాక్యుమెంట్లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. లెర్నింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, వాహన యజమాన్య హక్కు బదిలీ, తదితర సేవల నిమిత్తం రవాణా శాఖ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు ఏజంట్ల ద్వారా వెళ్తేనే రవాణాశాఖ అధికారులు పనులు చేస్తున్నారని, నేరుగా వస్తే ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఉప్పల్ రవాణా శాఖ కార్యాలయంలో ఫీజులు కన్నా ఎక్కువ నగదుతో కార్యాలయంలోకి వచ్చిన పదిమంది ఏజంట్లను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తిర్మల్‌గిరి రవాణా శాఖ కార్యాలయంలో తలుపులు మూసివేసి అక్కడి సిబ్బందిని సోదాలు చేశారు. తిరుమలగిరిలో భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అలాగే, 18 మంది ఏజంట్లను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కామారెడ్డి జిల్లాలోని సలబత్‌పూర్ చెక్‌పోస్టులో జరిపిన సోదాల్లో లెక్కలకు అదనంగా ఉన్న రూ.1.81 లక్షలను, పెద్దపల్లి రవాణా కార్యాలయంలో రూ.60 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లా బూర్గంపాడు, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిపిన సోదాల్లో 91 వేలు స్వాధీనం చేసుకున్నామని, ఇక్కడ అవకతవకలు గుర్తించామని ప్రభుత్వానికి నివేదికను పంపనున్నామని ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ తెలిపారు.

ఏసీబీ వలలో ముగ్గురు

- ఆదిలాబాద్‌లో ఇద్దరు అధికారులు.. సూర్యాపేటలో పంచాయతీ కార్యదర్శి అరెస్టు

ఆదిలాబాద్/ పెన్ పహాడ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్, సూర్యాపేట జిల్లాల పరిధిలో ఇద్దరు అధికారులు, ఒక ఉద్యోగి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఆదిలాబాద్ పట్టణంలో చేపట్టిన రోడ్డు పనుల బిల్లు ఇవ్వడానికి సంబంధిత కాంట్రాక్టర్‌ను రూ.20 వేలు లంచం ఇవ్వాలని మున్సిపల్ అకౌంట్స్ అధికారి రాజ్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రవి కుమార్ డిమాండ్ చేశారు. చివరికి రూ.15 వేలకు బేరం కుదుర్చుకున్నారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు రాజ్‌కుమార్, రవికుమార్‌లకు గురువారం బాధిత కాంట్రాక్టర్ రూ.15 వేలు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ మధు తెలిపారు. సూర్యాపేట జిల్లా నాగులపాటి అన్నారం శివారులో బొగ్గుల బట్టి పెట్టుకునేందుకు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే రూ.15 వేలు లంచం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి అనంతుల సతీశ్ డిమాండ్ చేశారు. చివరకు రూ.8,000 ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. కానీ, బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ జగదీశ్ సిబ్బందితో పంచాయతీ కార్యాలయంపైనా, సూర్యాపేటలోని సతీష్ ఇంట్లో తనిఖీ చేసి, ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.

టీజీపీజీఈసెట్‌లో 21,290 మంది ఉత్తీర్ణత

ఫలితాలు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి




పీజీఈసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న బాలకిష్టారెడి తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేటెడ్ ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీజీ పీజీఈసెట్-2025 ఫలితాలను గురువారం జేఎన్‌టీయూలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి విడుదల చేశారు. పీజీఈసెట్‌కు ఈసారి 25,335 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 22,983మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 21,290 మంది (90.72శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 19 సబ్జెక్టులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించగా అత్యధికంగా ఫార్మసీ అభ్యర్థులు 7,266 మంది, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌కు 6,434 మంది అర్హత సాధించారు. టెక్స్‌టైల్ టెక్నాలజీ, నానో టెక్నాలజీ, మైనింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఫుడ్‌టెక్నాలజీ, ఏరోస్పేస్, బయోమెడికల్ ఇంజనీరింగ్ సబ్జెక్టుల్లో అర్హులైన వారి సంఖ్య 100కు లోపే ఉంది.

గతేడాది ఎంటెక్‌లో అడ్మిషన్లు 60శాతం లోపే: బాలకిష్టారెడ్డి

బయోటెక్నాలజీ, ఫార్మసీ కోర్సుల్లో ఏపీకి చెందిన అభ్యర్థులు టాపర్లుగా నిలిచారు. మిగతా సబ్జెక్టుల్లో టాపర్లుగా తెలంగాణ అభ్యర్థులున్నారు. ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో అందుబాటులో ఉన్న సీట్లలో గతేడాది 60శాతం లోపే అడ్మిషన్లు జరిగాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. రాష్ట్రంలోని 106 ఇంజనీరింగ్ కాలేజీల్లో 7,912 ఎంటెక్ సీట్లుండగా గతేడాది 4,732 సీట్లే భర్తీ అయినట్టు చెప్పారు. ఎం.ఫార్మసీలో 5,371సీట్లకు 4,050 మంది, ఫార్మ్‌డీ కోర్సులో 390 సీట్లకు 252 మంది అభ్యర్థులే ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందారని పేర్కొన్నారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలను మరింత పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎంటెక్ కోర్సుల్లో గేట్ ర్యాంకర్లకు, ఎం.ఫార్మసీ కోర్సుల్లో జి.పాట్ ర్యాంకర్లకు సీట్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యత ఉంటుందని జేఎన్‌టీయూ రెక్టార్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. మిగిలిన సీట్లను పీజీఈసెట్ ర్యాంకర్లకు కేటాయిస్తారన్నారు. జర్మనీతో జేఎన్‌టీయూ ఎంవోయూ చేసుకున్న మాస్టర్స్ ఇన్ ఎనర్జీ సిస్టమ్స్ కోర్సు ప్రవేశాలకు పీజీఈసెట్ ర్యాంకర్లు అర్హులేనని చెప్పారు.

నా రీఎంట్రీకి ఇదే సరైన చిత్రం



\- లయ

నితిన్ కథానాయకుడిగా నటించిన 'తమ్ముడు' చిత్రంతో రీఎంట్రీ ఇస్తున్నారు నటి లయ. శ్రీరామ్ వేణు తెరకెక్కించిన ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. జూలై 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా లయ మీడియాతో మాట్లాడుతూ 'నా రీఎంట్రీకి 'తమ్ముడు' సరైన సినిమా అనిపించింది. క్యారెక్టర్ కోసం కొంచెం లావు కావాలని డైరెక్టర్ చెప్పారు. అందుకని స్వీట్స్ తిని బరువు పెరిగాను. ఈ సినిమాలో ఝాన్సీ కిరణ్మయి అనే పాత్రలో నటించాను. తనొక స్ట్రిక్ట్ ఆఫీసర్. కుటుంబాన్ని చూసుకుంటూనే ఆఫీసర్‌గా నా బాధ్యతలు నిర్వర్తిస్తుంటాను. చాలా బలవంతమైన స్త్రీ పాత్ర అది. తను అనుకున్నది చేస్తుంది. ఏది ఏమైనా భయపడదు. హీరో నితిన్‌కు సోదరి పాత్ర నాది. ఈ చిత్రం కోసం అడవిలో షూటింగ్ చేశాం. కథలో ప్రాధాన్యమున్న పాత్రల్లో నటించాలని అనుకుంటున్నా. ఆ పాత్ర సిస్టర్ అయినా, మదర్ అయినా చేస్తాను' అని అన్నారు.

విజయ్ మేకింగ్ అంటే చాలా ఇష్టం

\- సురేశ్‌బాబు



తమిళ నటుడు విజయ్ ఆంటోని నటిస్తూ, నిర్మించిన తాజా చిత్రం 'మార్గన్'. లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. తెలుగులో సురేశ్‌బాబు రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేశ్‌బాబు మాట్లాడుతూ 'విజయ్ ఆంటోనికి సినిమా పట్ల చాలా ప్యాషన్ ఉంది. మ్యూజిక్ డైరెక్టర్ నుంచి హీరోగా, నిర్మాతగా, దర్శకుడిగా ఆయన ప్రయాణాన్ని చూస్తున్నాను. ఆయన మేకింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అలాంటి వారు తీసే చిత్రాల్ని చూసేందుకు ఇష్టపడుతుంటాను. అందుకే నేను 'మార్గన్' సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నాను' అని తెలిపారు. హీరో విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'ఇదొక నార్మల్ సీరియల్ కిల్లర్ చిత్రంలా ఉండదు. ఇందులో చాలా లేయర్లు ఉంటాయి. మొదటి ఫ్రేమ్ నుంచి చివరి ఫ్రేమ్ వరకు ప్రేక్షకులను సీట్లకు కట్టిపడేస్తుంది. భాష్యశ్రీ పాటలు, మాటల వల్ల ఇది పూర్తి తెలుగు సినిమాగా అనిపిస్తోంది' అని అన్నారు. కార్యక్రమంలో చిత్ర నటులు అజయ్ ధీషన్, బ్రిగిడ, దీప్షిక, రచయిత భాష్యశ్రీ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

మళ్లీ హాస్పిటల్‌లో చేరిన పొన్నాంబళం



కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తమిళ నటుడు పొన్నాంబళం మళ్లీ ఆస్పత్రిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఆడియోను రిలీజ్ చేశారు. ఇందులో తన అనారోగ్యంపై వివరించారు. 'నేను మళ్లీ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాను. ఇప్పటివరకు నాకు అనేక మంది పలు విధాలుగా సాయం చేశారు. వారిలో చిరంజీవి, శరత్ కుమార్, ధనుష్, కేఎస్ రవికుమార్, నిళల్‌గల్ రవి, రవి మోహన్, శింబు, కమల్ హాసన్ తదితరులెంతోమంది ఉన్నారు. కొన్నేళ్ళుగా చిత్రాల్లో నటించడం లేదు. ఆదాయం లేదు. ఆర్థికంగా చితికిపోయాను. నాకు ఆర్థిక సాయం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

-చెన్నై, (ఆంధ్రజ్యోతి)

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.